ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-2-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 23 పేజీలు: 8+4 వెల: 6.50



ట్రంప్ రిసార్ట్‌లో కాల్పులు: ఆగంతకుడు హతం 2లో

భారత్-యుఎస్ వాణిజ్య చర్చలకు బ్రేక్ 5లో




## తగ్గనున్న వంటనూనె ధరలు!

ముడి నూనెలపై దిగుమతి సుంకం 10శాతానికి తగ్గింపు

కేంద్రం నిర్ణయం

మే 31 నుంచి అమలులోకి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** దేశీయ అవసరాలకు గాను దిగుమతి చేసుకుంటున్న వంటనూనెలపై దిగుమతి సుంకాలను ప్రస్తుతం ఉన్న 20 శాతంనుంచి పదిశాతానికి తగ్గించాలని కేంద్రం నిర్ణయించింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని వంటనూనెలు అంటే పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ వంటి ముడినూనెలపై ఈ సుంకాలు తగ్గిస్తోంది. తగ్గించిన సుంకాలు వెంటనే అమలులోకి వస్తాయని అంచనా.

వ్యవసాయ మౌలిక వనరుల అభివృద్ధి సెస్ కింద, సాంఘిక సంక్షేమ సర్‌ఛార్జి మొత్తం దిగుమతి సుంకాలు ఇప్పటి వరకూ 27.5శాతంగా ఉన్నాయి. ఇకపై 16.5శాతంగా ఉంటాయని తేలింది. పసుపు బఠాణీలు, శెనగల పైనా కూడా దిగుమతి సుంకాలు విధించి స్థానిక రైతులకు మేలుచేసే విధంగా నిర్ణయించింది. కేంద్ర బడ్జెట్‌లో ఈ అన్ని ఉత్పత్తులను తగ్గిస్తామని కూడా ప్రకటించారు. వ్యక్తిగత అవసరాలకు వినియోగించే అన్ని వనరులపైనా దిగుమతి సుంకాలు 20 నుంచి 10శాతానికి తగ్గించనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపిన సంగతి తెలిసిందే. పునర్వ్యవస్థీకరించిన సుంకాలన్నీ కూడా వచ్చే మేనెల ఒకటవ తేదీనుంచి అమలులోకి వస్తాయని కేంద్రం ప్రకటించింది. ఇప్పటి వరకూ ఈ బఠాణీలపై 30శాతం సుంకాలు విధించింది.

ఇపుడు తగ్గిస్తున్న సుంకాలు దిగుమతి వ్యాపారులకు మేలుచేస్తాయని పేర్కొంటున్నారు. పప్పుదినుసులు ఎక్కువగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో పండిస్తుంటారు. ఈ సుంకాల ప్రభావం రైతులపైనా ఉంటుందని అంచనా.

## దేశం పరువు తీయొద్దు



ఎఐ సదస్సులో కాంగ్రెస్ మురికి రాజకీయాలు

కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా దివాలా తీసింది

సీటు ఆక్రమించుకోండంటూ మహిళా ఎంపీలను పంపినంత మాత్రాన మీరు ప్రధాని కాలేరు

రాహుల్‌గాంధీపై ప్రధాని మోడీ ఘాటు విమర్శలు

కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమి భాగస్వాములకు మోడీ ధన్యవాదాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** కృత్రిమ మేధ భవిష్యత్తుపై ప్రపంచ స్థాయి చర్చలు జరుగుతున్న వేదికను కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తమ రాజకీయ నిరసనలకు వేదికగా మార్చుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అంతర్జాతీయ ప్రతినిధులు, టెక్ దిగ్గజాలు పాల్గొన్న ఈ సదస్సులో కాంగ్రెస్ కార్యకర్తలు షర్ట్‌లెస్ (చొక్కాలు లేకుండా) నిరసనలు చేపట్టడంపై మోడీ అసహనం వ్యక్తం చేశారు. ప్రపంచం ముందు దేశం పరువు తీస్తున్నారని, భారతదేశం గ్లోబల్ టెక్ హబ్‌గా ఎదుగుతున్న తరుణంలో, ఇటువంటి చర్యలు దేశ ప్రతిష్ఠను దిగజార్చుతాయని ఆయన మండిపడ్డారు. సదస్సును కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వాడుకుందని ప్రధాని మోడీ విమర్శించారు. ప్రపంచం మొత్తం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని, మన యువత మేధస్సును చూసి గర్విస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. కానీ విపక్షాలు మాత్రం ఇలాంటి గొప్పవేదికలపై బాధ్యతా రహితంగా వ్యవహరిస్తూ దేశ అభివృద్ధికి అడ్డుపడుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఎఐ వల్ల ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని, లేదా నిర్దిష్ట అంశాలను లేవనెత్తుతూ కాంగ్రెస్ శ్రేణులు చొక్కాలు తీసి వినూత్న నిరసనకు దిగాయి. అయితే, టెక్నాలజీ సదస్సులో ఇటువంటి ప్రదర్శనలు అప్రస్తుతమని బీజేపీ వర్గాలు వాదిస్తున్నాయి. ఈ సమ్మిట్ కేవలం ఒక సమావేశం కాదని, ఇది భారతదేశాన్ని ఎఐక్యాపిటల్‌గా నిలబెట్టే ప్రయత్నమని బీజేపీ నేతలు, ప్రభుత్వ పెద్దలు అంటున్నారు. వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే మార్గం ఇదని భవిష్యత్తు తరాలకు ఉపాధి కల్పించే దిశగా వేసిన అడుగు అని వాళ్లు చెప్పుకొస్తున్నారు. ఇలాంటి వేదికల్లో భారత పరువు నిలపాల్సిన ప్రతిపక్షాలు, విశ్వవేదికల సాక్షిగా స్వదేశపరువు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

### ఎఐ సదస్సులో ఆ రెండు ఆవిష్కరణలు

## ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయి



జంతువుల చికిత్సకు, పురాతన గ్రంథాల సంరక్షణ కోసం ఎఐ వినియోగం: మన్‌కీ బాత్‌లో ప్రధాని

5లో




సిఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బిసి జనార్దన్ రెడ్డి సమక్షంలో ఆదివారం డిజిటల్ భారత్ నిధి- ఏపి ప్రభుత్వం మధ్య ఎంఓసి దృశ్యం

## యేడాదిన్నరలో ప్రతి ఇంటికీ
# హైస్పీడ్ ఇంటర్నెట్

టెక్నాలజీతో పౌర సేవలు సులభతరం

అంతర్జాతీయ స్థాయి విజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు చేరేలా చూడాలి

ఎఐతో మరిన్ని ఉద్యోగాలు వచ్చేలా యువతలో నైపుణ్యం పెంచుతున్నాం

ఇన్నోవేషన్లకు ఏపి టెస్ట్ బెడ్

గత ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను నాశనం చేసింది

రూరల్ డిజిటల్ కనెక్టివిటీపై జరిగిన ఎంఓసి కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక సహకార ఒప్పందం

5 లక్షల ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు ఇచ్చే లక్ష్యంతో ఏపిలో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్

సిఎం చంద్రబాబు- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమక్షంలో ఎంఓసి

**విజయవాడ, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయాలంటే ప్రతి ఇంటికీ డిజిటల్ కనెక్టివిటీ ముఖ్యమని సిఎం వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సిఎం క్యాంప్ కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం కుదిరింది. సుమారు 5లక్షల గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు ఫైబర్‌కనెక్షన్లు అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్‌ఎబిఎన్‌పి అమలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏపిలో ఎబిఎన్‌పి అమలుకు రూ. 2,432

>>2

## సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు



**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ 1969 లోని రూల్ 3 ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. క్రిమినల్ కేసు పూర్తి లేదా పదవీ విరమణల ఏది ముందైతే అప్పటి వరకు సస్పెన్షన్ కొనసాగుతుంది. సునీల్‌కుమార్‌పై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లడం, వైకాపా హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును వేధించిన కేసుతో పాటు అగ్రిగోల్డ్‌నిధుల దుర్వినియోగం వ్యవహారంలో సునీల్‌కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది.

## టెక్నాలజీ పెరిగినా
# డాక్‌సేవక్‌లకు తిరుగు లేదు

దేశానికి కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థ డాక్ సేవక్‌లే

ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇచ్చి వారికి మరింత సదుపాయం కల్పించాలి

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే దేశంలో డబుల్ స్పీడ్‌తో అభివృద్ధి

గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో






ఆదివారం తిరుమల విచ్చేసిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో టిటిడి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

# సేద్యానికి చేయూత

రూ.400కోట్లు నిధులు విడుదల చేయండి

సూక్ష్మసేద్యం విస్తరణ, నీటివనరుల సమర్థ వినియోగానికి సహకరించండి

కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు వినతి

**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేయాలని, సూక్ష్మసేద్యం విస్తరణ నీటివనరుల సమర్థ వినియోగంకు దోహదపడతుందని రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుండి రావాల్సిన 400 కోట్ల రూపాయలు విడుదల చేయాలని కోరారు. ఆదివారం ఉదయం తిరుమలలో కేంద్రవ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌ను రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు, కేంద్ర పథకాల సమర్థవంతమైన అమలుచేయడాన్ని కేంద్రమంత్రికి అచ్చెన్నాయుడు వివరించారు. రాష్ట్రంలో రైతులకు మద్దతుగా కేంద్రప్రభుత్వం అందిస్తున్న సహకారం, నిధులు, వివిధ పథకాలు అమలుపై మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సూక్ష్మ సేద్యం పథకానికి సంబంధించి కేంద్రం నుండి 695కోట్లు

>>2

## మావోయిస్టు అగ్రనేత
# దేవ్ జీ లొంగుబాటు




సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి కూడా

తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన మరో 20 మంది మావోలు

ఆసిఫాబాద్ అటవీ ప్రాంతంలో లొంగిపోయినట్లు సమాచారం

ధ్రువీకరించిన చత్తీస్‌గఢ్ డిప్యూటీ సిఎం విజయ్ శర్మ

నేడు మీడియా ఎదుట ప్రవేశపెట్టనున్న తెలంగాణ పోలీసులు?



మల్లా రాజిరెడ్డి(ఫైల్)

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మావోయిస్టు విముక్త్ భారత్ కోసం కేంద్రం చేబట్టిన ఆపరేషన్ గడువు మార్చి 31వ తేదీ దగ్గర పడుతున్న వేళ మావోయిస్టు పార్టీకి మరోసారి భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా వున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీతో పాటు అగ్రనేతలు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నర్సింహా రెడ్డి అలియాస్ గంగన్న సహా 20 మంది తెలంగాణ పోలీసుల ఎదుట ఆదివారం లొంగిపోయినట్లు తెలిసింది. మావోయిస్టుల ఏరి వేతకు ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ సరిహద్దులో గల కర్రెగుట్టల్లో కేంద్ర బలగాలు మరో సారి భారీగా కూంబింగ్ చేబట్టిన క్రమంలో వీరంతా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్న వేళ ఆసిఫా బాద్ అటవీ ప్రాంతంలో తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలతో లొంగిపోయినట్లు సమాచారం. అయితే వీరి లొంగుబాటును

>>2

## ఉగ్ర కుట్ర భగ్నం

8 మందిని పట్టుకున్న ఢిల్లీ పోలీసులు

తమిళనాడులోని తిరుప్పూర్‌లో ఆరుగురు, బెంగాల్‌లోమరో ఇద్దరు అరెస్టు

2లో



అరెస్టయిన వారిలో బంగ్లాదేశ్ పౌరులు

ఐఎస్ఐ, బంగ్లాదేశ్ లింకులు

దర్యాప్తు కోసం ఢిల్లీకి తరలింపు

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



2లో

10,57,312 మంది విద్యార్థులు, 1,537 కేంద్రాలు ఏర్పాటు

ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారుల సూచన

# మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ లొంగుబాటు

>> తెలంగాణ పోలీ సులు ధృవీకరించక పోగా ఛత్తీస్‌ఘడ్ డిప్యూటీ సిఎం విజయ్ వర్మ ధృవీకరించడం గమనార్హం. కాగా లొంగిపోయిన మావోయిస్టులను సోమ వారం హైదరాబాద్‌లో మీడియా ఎదుట ప్రవేశపెట్టనున్నారని తెలిసింది. మరో వైపు దేవ్‌జీ లొంగు బాటుపై సోదరుడి కుమార్తె సుమ బావోద్వేగంతో కూడిన లేఖను మీడియాకు విడుదలచేశారు. మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతూనే వున్నాయి. ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఎపిలతో పాటు తెలంగాణలో పదుల సంఖ్యలో నక్సలైట్లు ఆయుధాలతో లొంగిపోతుండడం తెలిసిందే. ఈ ఏడాది మార్చి ఆఖరుకు దేశంలో నక్సలైట్లు లేకుండా చేయడం లక్ష్యంగా ఎంచుకున్నట్లు కేంద్రం ప్రకటించి అందుకు అనుగుణంగా నక్సల్స్‌కు పట్టున్న ఛత్తీస్‌ఘడ్‌లో వేల సంఖ్యలో కేంద్ర బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తుండడం విదితమే.

ఈ క్రమంలో ఛత్తీస్‌ఘడ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లతో పాటు ఎపి లోనూ ఎన్‌కౌంటర్లు జరిగి పదుల సంఖ్యలో నక్సలైట్లు మరణిం చారు. ఇదే సమయంలో రెండు వేల మంది వరకు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో అగ్రనేతలు పలువురు వుండగా ఎన్‌కౌంటర్లో మరణించిన వారిలో హిడ్మా సహా పలువురు కీలక నేతలున్నారు. అజ్ఞాతంలో వున్న నక్సలైట్ల కోసం కేంద్ర బలగాలతో పాటు ఆయా రాష్ట్రాల పోలీ సులు గాలింపు జరుపుతున్న వేళ మావోయిస్టు పార్టీలో మిగిలిన ఐదారు మంది అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, నర్సింహా రెడ్డి తదితరులు లొంగిపో యేందుకు సిద్దంగా వున్నారని, ఇందుకోసం మధ్యవర్తులతో మాట్లాడుతున్నట్లు వారం రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఒక దశలో వీరంతా హైదరా బాద్‌లో లొంగిపోయారని ప్రచారం జరిగింది. అయితే వీరంతా ఆసిఫాబాద్ అడవుల్లో తెలంగాణ పోలీసులకు లొంగిపోయారని తెలిసింది.

రెండు నెలల క్రితం ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన 40 మంది నక్సలైట్లు ఆసిఫాబాద్ అడవుల్లో తెలంగాణ పోలీసులకు లొంగిపోవడం తెలిసిందే. వీరంతా ఛత్తీస్ ఘడ్ నుంచి ఆసిఫాబాద్ అడవుల్లో రాగా ఇక్కడి పోలీసులు అదుపులోకి తీసు కున్నట్లు స్థానికులు తెలిపారు. అయితే వీరంతా లొంగిపోయారని మ రుసటి రోజు డిజిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో డిజిపి సహా ఇతర ఉన్నతాధికారులు తెలిపారు. తాజా లొం గుబాటు కూడా ఇదే తరహాలో జరిగిందని సమాచారం. వీరి లొంగుబాటులో ఛత్తీస్‌ఘడ్ కోబ్రా దళం అధికారులు తెలంగాణ పోలీసులకు సహకరించినట్లు తెలిసింది. కాగా లొంగిపోయిన నక్సలైట్లలో పలువురు అనారోగ్యంతో వుండడంతో ఆదిలాబాద్‌లో ఓ రహస్య ప్రాంతంలో వుంచి, వైద్యం, ఆహారం అందిస్తున్నట్లు తెలిసింది. వీరు కోలుకున్న తరువాత సోమవారం నాడు హైదరాబాద్‌లో మీడియా ఎదుట ప్రవేశపెట్టే వీలుందని తెలిసింది. కాగా దేవ్‌జీ స్వస్థలం జగిత్యాల జిల్లా కోరుట్ల. తెలంగాణలో నక్సల్స్ ఉద్యమంలో ఆయన అనేక హోదాలో పనిచేశారు. పార్టీ కార్యదర్శిగా వున్న నంబాళ్ల కేశవరావు ఎ దురు కాల్పుల్లో చని పోయాక దేవ్‌జీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. మరోవైపు అజ్ఞాతంలో వున్న నక్స లైట్లు వెంటనే లొంగిపోవా లని డిజిపి శివధర్ రెడ్డి కోరడం తెలిసిందే. రెండేళ్ల కాలంలో 588 మంది నక్సలైట్లు లొంగిపోయారని ఆయన తెలిపారు.

**నిజమేనని ఛత్తీస్‌ఘడ్ డిప్యూటీ సిఎం వెల్లడి:** కాగా, మావోయిస్టు పార్టీ కార్యదర్శి దేవ్‌జీ సహా ఇతర అగ్రనేతలు లొంగిపోవడంపై తెలంగాణ పోలీసులు ధృవీకరించడం లేదు. ఇదంతా అవాస్తవమని వారు చెబుతున్నారు. అయితే ఛత్తీస్‌ఘడ్ డిప్యూటీ సిఎం విజయ్ వర్మ మాత్రం మావోయిస్టు పార్టీ కార్యదర్శి దేవ్‌జీ సహా ఇతర అగ్రనేతలు లొంగిపోవడం నిజమేనని తెలిపారు. వారంతా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తమకు సమాచారం వుందని రాయ్‌పూర్‌లో తెలిపారు. మావోయిస్టుల ఏరివేతలో ఇది కీలక ముం దడుగుగా ఆయన అభివర్ణించారు. నక్సలైట్లు ఎక్కడ లొంగి పోయినా ఒకటేనని ఆయన తెలిపారు. వచ్చే మార్చి నెలాఖరుకు నక్సలైట్లను ఏరివేస్తామన్న కేంద్ర లక్ష్యం కచ్చితంగా నెరవేరు తుందని ఆయన తెలిపారు.

**దేవ్‌జీ లొంగుబాటుపై సోదరుడి కుమార్తె బావోద్వేగ పోస్ట్**

ఇదిలావుండగా మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ లొంగపోయారన్న వార్తపై ఆయన సోదరుడి కుమార్తె సుమ ఆదివారం సోషల్ మీడియాలో బావోద్వేగంతో కూడిన పోస్ట్ వుంచడంతో పాటు మీడియాకు లేఖ విడుదల చేశారు. దేవ్‌జీ రాకకోసం తమ కుటుంబం ఎంతో కాలంగా ఎదురు చూస్తుందని, ఇది దశాబ్దాల నిరీక్షణగా ఆమె తెలిపారు. తన కొడుకు ఎప్పటికైనా తిరిగి రావాలని వృద్ధ తల్లిదండ్రుల ఆశ అని సుమా తెలిపారు. దేవ్‌జీ తనకు పెదనాన్న అవుతాడని, ఇప్పటి వరకు చూడలేదని, ఆయనను చూసేందుకు ఆసక్తిగా వున్నానని సుమా తెలిపారు. దేవ్‌జీ మాకు కొండంత ధైర్యమని ఆమె వెల్లడించారు. ఇంత కాలం అడవిబాట పట్టిన పెదనాన్న జనజీవన స్రవంతిలోకి రావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# ఉగ్ర కుట్ర భగ్నం

## తమిళనాడు, బెంగాల్‌లో పోలీసుల దాడులు

### ఆరుగురు బంగ్లా టెర్రరిస్టుల సహా ఎనిమిది మంది అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో విధ్వంసం సృష్టించేందుకు పాక్ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐ సహకారంతో బంగ్లా ఉగ్రవాదులు పన్నిన కుట్రను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా తమిళనాడు, బెంగాల్‌లో నిర్వహించిన దాడుల్లో ఎనిమిది మంది ఉగ్ర వాదులు అరెస్టయ్యారు. వీరిలో ఆరుగురు బంగ్లాదేశీయులు వుండగా ఇద్దరు స్థానికులు కావడం గమనార్హం. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సంద ర్భంగా ఢిల్లీలో ఖలీస్థాన్ ఉగ్రవాదులకు అనుకూలంగా, కాశ్మీర్ పాక్‌దేనంటూ ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్‌లలో రెచ్చగొట్టే విధంగా పోస్టర్లు వెలిశా యి. ఖలిస్తాన్ కోసం ఢిల్లీలో విధ్వంసం సృష్టిస్తామని అందులో వుండంతో దీనిపై వున్న కుట్రను చేధించేందుకు రంగంలో దిగిన ఢిల్లీ పోలీసులు మె ట్రో స్టేషన్లలో వున్న పోస్టర్లను స్వాధీనం చేసుకుని పరిశీలించగా ఇందులో పాక్ ఉగ్రవాదుల హస్తం వున్నట్లు తేలింది. పాక్ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐ సహకారంతో బంగ్లాకు చెందిన ఉగ్రమూకలు ఈ దాడులకు కుట్ర పన్నినట్లు తేలింది. వీరంతా తమిళ నాడు, బెంగాల్‌లో తలదాచుకున్నట్లు నిర్ధారణ అయ్యాక శనివారం రాత్రి ఢిల్లీ ప్రత్యేక బృందం పోలీసులు రెండు రాష్ట్రాలలో మెరుపుదాడులు నిర్వహించారు. తమిళనాడులోని తిరుప్పూరులో గల ఓ గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న ఆరుగురు ఇందులో భాగస్వాములుగా తేలడంతో వారిని అరెస్టు చేశారు. వీరంతా పాక్‌కు అనుకూలంగా జీహా దిని ప్రోత్సహించడం, ఖలీస్తాన్‌కు మద్దతు తెలపడం చేస్తున్నట్లు తేలింది. పట్టుబడ్డ ఉగ్రవాదులను మిజనూర్ రహమాన్ (33), మహమ్మద్ సపెట్ (35), ఒమర్ (32), మహమ్మద్ లిటన్ (40), మహమ్మద్ జగీత్ (40), మహమ్మద్ ఉజల్ (29)గా గుర్తించారు. వీరిని స్థానిక మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి పిటి వారంట్‌పై వెంటనే ఢిల్లీకి తరలించారు. వీరు బంగ్లాదేశీయులు కాగా బెంగాల్‌కు చెందిన ఇద్దరి సహకారంతో నకిలీ ఆధార్ కార్డు లు, ఐడి కార్డులతో భారతీయులుగా చలామణి అవుతూ తమిళనాడులో ఉద్యోగం చేస్తున్నారు. వీరి వద్ద ఎనిమిది సెల్‌ఫోన్లతో నాటు 16 సిం కా ర్డులు, కొంత ఉగ్రవాద సాహిత్యం పట్టుబడింది. వీరికి సహకరించిన బెంగాల్‌కు చెందిన మరో ఇద్దరిని కూడా అరెస్టు చేశారు. బంగ్లాదేశీయులు ఎ ప్పటి నుంచి భారత్‌లో వుంటున్నారనే దానిపై విచారణ చేస్తున్నారు.

# హైస్పీడ్ ఇంటర్నెట్

>> కోట్ల మేర నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఎబిఎన్‌పి కోసం ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎపిబిఐఎల్) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌పివి ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధిరాష్ట్ర ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నిధులు సమకూర్చి ప్రాజెక్టు అమలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సిఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బిసి జనార్దన్ రెడ్డి సమక్షంలో డిజిటల్ భారత్ నిధి- ఎపి ప్రభుత్వం మధ్య ఎంఒసి కుదుర్చుకున్నారు. డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐ అండ్ ఐ శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు ఎంఒసిపై సంతకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఇన్‌ఫ్రా బలోపేతం, గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేలా సహకార ఒప్పందం చేసుకున్నారు. త్వరిగతిన అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్ర స్థాయి సమన్వయానికి పూర్తి సహకా రం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. 1,692 ఫేజ్-1 పంచాయతీల్లోని నెట్ వర్క్ అప్ గ్రేడ్ చేయడం, 11,254 ఫేజ్-2లోని గ్రామాల డిజిటల్ కనెక్టివిటీని పూర్తి చేయడం, ఇక కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్టివిటీ ఇచ్చేలా చర్యలు తీసుకోవడం వంటి వాటిపై ఈ ఎబిఎన్‌పి ప్రాజెక్టుతో పని చేయనుంది. 3,942 గ్రామాల్లో డిమాండ్ ఆధారంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచే అంశంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. డిజిటల్ కనెక్టివిటీ ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈగవర్నెన్స్ వంటి సేవలను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఈ సహకార ఒప్పందం కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు బాండ్ విడ్త్ పెంచమని బిఎస్ఎన్ఎల్‌ను అడిగాను. పెంచిన బ్యాండ్ విడ్త్‌తో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్సులు పెట్టేవాడిని. టెలికం రంగంలో సంస్కరణలు తీసుకురావాలని నాటి ప్రధాని వాజ్‌పేయిని కోరాను. అప్పట్లో జాతీయ స్థాయిలో కమిటీ వేస్తే టెలికం రంగంలో సంస్కరణలు చేపట్టాలని నివేదిక ఇచ్చాం. ఆ తర్వాత దేశవ్యాప్తంగా డిరెగ్యులేషన్ అమల్లోకి వచ్చింది. భారతదేశంలో డిజిటల్ విప్లవానికి, డిజిటల్ కనెక్టివిటీ ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చక్కగా పని చేస్తున్నారు" అని ముఖ్యమంత్రి అన్నారు.

**చక్కటి వ్యవస్థను నాశనం చేశారు:** "2014-19 మధ్య కాలంలో ఫైబర్ నెట్ వ్యవస్థను ఏర్పాటు చేశాం... కరెంట్ పోల్స్‌పై ఫైబర్ కేబుల్స్ వేసి కనెక్టివిటీ కల్పించాం. 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చాం. ఆ తర్వాత 2019లో వచ్చిన ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టింది. గత ప్రభుత్వం దురుద్దేశ్యంతో చేసిన నిర్వాకం వల్ల కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది. ఇప్పుడు మళ్లీ కేంద్ర సహకారంతో డిజిటల్ కనెక్టివిటీని పెంచుతాం. వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయడానికి ఈ చర్యలు ఉపకరిస్తాయి. ఏఐ క్వాంటం టెక్నాలజీలకు ప్రధాని చాలా ప్రాముఖ్యత ఇస్తున్నారు. అందుకే ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సు నిర్వహించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు వివిధ దేశాల నుంచి దిగ్గజ కంపెనీలకు చెందిన ప్రముఖులు వచ్చారు. గ్లోబల్ నాలెడ్జిని గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురావాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలి... దానికి కేంద్రం సహకరిస్తోంది. డిజిటల్ కనెక్టివిటీ ఉంటే ప్రజలకు సేవలు కూడా చాలా సులువుగా అందుతాయి. వాట్సాప్ ద్వారా 900కు పైగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టెక్నాలజీతో పట్టాదార్ పాస్ పుస్తకాలను ముద్రించి భద్రత కల్పిస్తున్నాం. భూ రికార్డులకు బ్లాక్ చైన్ టెక్నాలజీతో సెక్యూర్టీ కల్పిస్తున్నాం. టెక్నాలజీని అనుసంధానించి ప్రజారోగ్య రంగంలో సంజీవని ప్రాజెక్టు అమలు చేయబోతున్నాం. ఏఐ సహకారంతో విద్య, వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. వివిధ ఏఐ అప్లికేషన్లను అందుబాటులోకి తెస్తాం. ఏఐతో ఉద్యోగాలు పోవడం కాదు.. ఉద్యోగాలు క్రియేట్ అయ్యేలా యువతలో నైపుణ్యం పెంచుతున్నాం" అని సిఎం చంద్రబాబు చెప్పారు.

**నెంబర్1 స్థానం దక్కించుకునే సత్తా బిఎస్ఎన్ఎల్‌ది**

"టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో... ఇతర దేశాల కంటే భారతదేశం చాలా ముందుంది. భారతదేశంలో బ్రాండ్ న్యూ టెక్నాలజీ అందుబాటులో ఉంది. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నేతృత్వంలో బిఎస్ఎన్ఎల్ నెంబర్1 నెట్ వర్క్ అవుతుందనే నమ్మకం ఉంది. బిఎస్ఎన్ఎల్ సంస్థకు ఆ కెపాసిటీ ఉంది. గూగుల్ డేటా సెంటర్ ఎపికి రాబోతోంది... విశాఖ నుంచి ఇతర దేశాలకు సబ్ సీ కేబుళ్ల ద్వారా డేటాను పంపే పరిస్థితి వస్తుంది. ఎపిలో 5 లక్షల మంది వర్క్ ఫ్రం హోం ద్వారా పని చేస్తున్నారు. పారిశ్రామిక విప్లవాన్ని భారతదేశం అందుకోలేకపోయింది. సర్వీస్ రంగాన్ని అందుకున్నాం అభివృద్ధి చెందుతున్నాం. ఎపిలో చాలా ప్రముఖ సంస్థలు, జిసిసిలు వస్తున్నాయి. వన్ ఫ్యామిలీవన్ ఏఐ ఎక్స్‌పర్ట్ అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ఐబిఎంటిసిఎస్ఎల్ అండ్ టి కన్సార్షియంతో దేశంలో తొలిసారి క్వాంటం కంప్యూటర్ తెస్తున్నాం. వచ్చే రెండు మూడేళ్లలో క్వాంటం కంప్యూటర్లను అమరావతి నుంచి ఉత్పత్తి చేయాలని ఆలోచన చేస్తున్నాం. బ్యూరోక్రసీ కూడా ఏఐలో నైపుణ్యం పెంచుకోవాలి. టెలికాం, టెక్నాలజీ రంగంలో ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా... టెస్ట్ బెడ్‌గా ఉండేందుకు ఎపి సిద్ధం" అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ నెట్ ఎండి గీతాంజలి శర్మ, బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**విజయవాడ.ఫిబ్రవరి 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు 2026 సోమవారం ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు ఇప్పటికే హాల్ టికెట్లు కూడా ఇంటర్ బోర్డు..విడుదల చేసింది.ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి అనుమతిస్తారు. పరీక్షల ప్రారంభ సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైన హాలులోకి అనుమతించరు.ఈ నిబంధన కచ్చితంగా అమలు చేస్తారు.సోమవారం నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షలు, మంగళవారం నుంచి సెకండ్ ఇయర్ విద్యా ర్థులకు పరీక్షలు మొదలవుతాయి.రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలకు మొత్తం 10,57,312 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇక ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మంచినీటితోపాటు విద్యుత్, టాయిలెట్లు వంటి తదితర మౌలిక సదుపాయాలు విద్యార్థుల సౌకర్యార్థం కల్పించినట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయనున్నట్లు వివరించారు. అలాగే పరీక్షలు మరింత పారదర్శంగా జరిగేందుకు పరీక్ష గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాని, పటిష్ట నిఘాలో పరీక్షలు జరుగుతాయని అన్నారు. మరోవైపు పరీక్షల పర్యవేక్షణకు జిల్లా పరీక్ష కమిటీలు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లు తనిఖీలు చే స్తాయని తెలిపారు. ఇంటర పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు జరగనున్నాయి. మార్చి 3న జరగాల్సిన సెకండ్ ఇయర్ మ్యాథ్‌మెటిక్స్,సివిక్స్ పేపర్లు మార్చి 4కి, మార్చి 20న జరగాల్సిన ఫస్ట్ ఇయర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ పేపర్లు మార్చి 21కి మార్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలేజీలు గమనించాలని, తదనుగుణంగా పరీక్షలకు సిద్ధమవ్వాలని ఇప్పటికే బోర్డు సూచించింది కూడా. మార్చి 3న హోలీ, మార్చి 20 రంజాన్ పండగ సెలవుల నేపథ్యంలో ఈ మార్పు లు చేసింది. మిగిలిన పరీక్షలు యథాతథంగా గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి. పరీక్షలు రాసే విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అ దనపు బస్సు సర్వీసులు నడపనుంది. ఈ మేరకు ఆర్టీసీని కోరినట్లు విద్యాశాఖ తెలిపింది. విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేసింది. చివరి నిమిషంలో గందరగోళానికి గురికాకుండా గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు,కాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. పరీక్షలకు సంబంధించి ఇతర సందేహాలు, సమస్యలకు 1800-425-1531 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా విద్యార్థులు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని సూచించారు.

# టెక్నాలజీ పెరిగినా డాక్‌సేవక్‌లకు తిరుగులేదు

**గుంటూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో అత్యంత కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థగా డాక్ సేవక్‌లు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టెక్నాలజీ పెరిగినా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చినా డాక్ సేవక్‌ల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని సిఎం స్పష్టం చేశారు. గుంటూరులో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపాలా శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోస్ట్ మాస్టర్‌లను సన్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "గ్రామీణ డాక్ సేవకుల సేవలు చిరస్మరణీయం. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పార్సిల్ వెళ్లాలంటే డాక్ సేవకుల వల్లే సాధ్యం. నేను చదువుకునే రోజుల్లో ఏ పని కావాలన్నా తపాలా వ్యవస్థపైనే ఆధార పడేవాళ్లం. గతంలో అతిపెద్ద కమ్యూనికేషన్ వ్యవస్థ పోస్టల్ సేవలే. పార్సిళ్లు, మనీ ఆర్డర్ల కోసం పోస్ట్ మ్యాన్ ఎప్పుడు వస్తారా అని ఎదురు చూసే పరిస్థితి. టెలీ కమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు రావాలని బలంగా కోరుకున్నాం. నేడు 4జీ సేవలు అందుబాటులోకి వచ్చినందుకు గర్వపడుతున్నాం. భారతీయ తపాలా శాఖకు ఉన్నంత నెట్‌వర్క్... మరే దేశంలోనూ ఏ పోస్టల్ సంస్థకు లేదు. మనకు స్వాతంత్రం రాక ముందు నుంచే బలంగా ఉన్న వ్యవస్థల్లో భారతీయ తపాలా శాఖ ఒకటి. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పరోక్షంగా కీలక పాత్ర పోషించిన ఘనత పోస్టల్ శాఖకు ఉంది. దేశంలో 1.64 లక్షలకు పైగా పోస్టాఫీసులు ఉంటే, అందులో 90 శాతం గ్రామాల్లోనే ఉన్నాయి. ఇందులో దాదాపు 2.7 లక్షల గ్రామీణ డాక్ సేవకులు పనిచేస్తున్నారు. మన రాష్ట్రంలో 9,100కు పైగా పోస్టాఫీసుల ద్వారా 17,000కు పైగా గ్రామీణ డాక్ సేవక్‌లున్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందంటే అందుకు డాక్ సేవకులే కారణం. 33శాతం మేర డిబిటి ద్వారా ఆర్థిక సాయం డాక్ సేవకుల ద్వారానే జరడం అభినందనీయం. బ్యాంకింగ్ సేవలు, బీమా సేవలు, డిబిటి అనుసంధాన సేవలు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు డాక్ సేవకుల ద్వారానే అందుతున్నాయి. వికసిత్ భారత్, స్వరాంధ్ర సాధనకు డాక్ సేవకులు వెన్నెముక" అని సిఎం చంద్రబాబు అన్నారు.



ఆదివారం గుంటూరులో ఉత్తమ డాక్ సేవక్‌లకు ప్రశంసాపత్రాలు అందచేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రులు జోతిరాధిత్య సింధియా, పెమ్మసాని

**డాక్ సేవకులకు ఎలక్ట్రికల్ సైకిళ్లు:** "డాక్ సేవకుల గౌరవం పెంచేలా కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా పనిచేస్తున్నారు. జ్యోతిరాదిత్య తండ్రి మాధవరావ్ సింధియాతో కలిసి పని చేశాను. విశాఖలోని గాజువాకలో ఒక ప్రాంతానికి సింధియా పేరుంది. త్వరలోనే ఆ ప్రాంతాన్ని జ్యోతిరాదిత్య సందర్శించాలని కోరుతున్నాను. టెక్నాలజీ ఎంత పెరిగినా మానవత్వంతో పని చేసిది డాక్ సేవకులే. వారి కోసం కేంద్ర మంత్రి డ్రెస్ కోడ్‌ను డిజైన్ చేశారు. డాక్ సేవకులకు ఎలక్ట్రికల్ సైకిళ్లు కూడా ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరుతున్నా. దీనివల్ల పొల్యూషన్ బెడద ఉండదు. డాక్ సేవక్‌లు విధులు నిర్వహించటంలోనూ చక్కగా ఉపయోగపడుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో డబుల్ స్పీడ్‌లో అభివృద్ధి**

"ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. తాను రూపొందించిన విజన్ కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. 2047 నాటికి మన దేశం నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ పనిచేస్తున్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ స్పీడ్‌లో అభివృద్ధి జరుగుతోంది. 20 నెలల్లో సంక్షేమం అందించాం. అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నాం. సుపరిపాలనకు నాంది పలికాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను పౌరుల ఇంటి వద్దకే అందిస్తున్నాం. గత పాలకులు అమరావతిని స్మశానం, ఎడారి అన్నారు. దేవతల రాజధాని అమరావతి. ప్రపంచం మెచ్చేలా రాజధానిని నిర్మిస్తాం. గడిచిన ఐదేళ్లలో పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందే గోదావరిని పూర్తి చేసి జాతికి అంకితమిస్తాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా లాభాలబాట పట్టించాం. జనవరిలో రూ.54 కోట్ల లాభాలు ఆర్జించేందుకు ఎన్డీఏ పాలన సామర్థ్యమే కారణం. ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సుకు 80 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో మన దేశ నూతన ఆవిష్కరణలు చూసి వారంతా ఆశ్చర్యపోయారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమం నిర్వహిస్తే దేశ పరువు తీసే విధంగా కాంగ్రెస్ అర్ధనగ్న ప్రదర్శనలు చేసింది. వారికి ఏఐ తెలీదు. టెక్నాలజీపై అవగాహన లేదు. బ్రాండ్ దెబ్బతీసేలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదు" అని ముఖ్యమంత్రి

# ట్రంప్ రిసార్టులో కాల్పులు: ఆగంతకుడు హతం

**ఫ్లోరిడా, ఫిబ్రవరి 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యాజమాన్యంలోని ఫ్లోరిడా రిసార్ట్ లో తీవ్ర కలకలం రేగింది. పామ్ బీచ్‌లోని ప్రఖ్యాత మార్‌ఎలాగో ఎస్టేట్‌లోకి షాట్‌గన్, ఇంధనం క్యాన్‌తో చొరబడేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపారు. ఈ ఘటన గత అర్ధరాత్రి దాటాక 1:30 గంటల సమయంలో చోటుచేసుకుంది. మార్‌ఎలాగో రిసార్ట్ ఉత్తర గేటు నుంచి ఒక వాహనం బయటకు వస్తుండగా, అదే అదనుగా మరో వాహనంలో వచ్చిన ఆగంతకుడు లోపలికి ప్రవేశించాడు. అతని వద్ద షాట్‌గన్, ఇంధనంతో కూడిన క్యాన్ ఉండటాన్ని గమనించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, పామ్ బీచ్ కౌంటీ షెరిఫ్ డిప్యూటీలు అతన్ని అడ్డుకున్నారు. ఆయుధాలు కింద పెట్టాలని ఆదేశించారు. ఆ వ్యక్తి ఇంధనం క్యాన్‌ను కింద పెట్టి, తన వద్ద ఉన్న షాట్‌గన్‌ను ఏజెంట్ల వైపు గురిపెట్టాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు అతనిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతను అక్కడికక్కడే మరణించినట్లు పామ్ బీచ్ కౌంటీ షెరిఫ్ రిక్ బ్రాడ్‌షా ధృవీకరించారు. ఈ ఘటనలో సిబ్బంది ఎవరికీ గాయాలు కాలేదు. మృతుడిని నార్త్ కరోలినాకు చెందిన 20 ఏళ్ల యువకుడిగా అనుమానిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం అతను కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఘటన జరిగిన సమయంలో ట్రంప్, ఆయన భార్య మెలానియా వైట్‌హౌస్‌లో ఉన్నారు. నిందితుడి ఉద్దేశం ఏమిటి, అతని మానసిక పరిస్థితిపై ఎఫ్‌బీఐ దర్యాప్తు చేస్తోంది. గతంలో 2024లో ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన నేపథ్యంలో ఈ తాజా ఘటన భద్రతా వర్గాలను మరోసారి అప్రమత్తం చేసింది.

## వారం - వర్జ్యం

23-02-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
షష్ఠి ఉ.9.09
భరణి సా.4.32
వర్జ్యం : రా.3.49-తె.5.20
దు.ము.12.45-1.32,
2) మ.3.06-3.53
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రతి విషయంలోనూ గోప్యంగా వ్యవహరించే మీ వైఖరికి భిన్నంగా ఈరోజు ఒక కార్యక్రమాన్ని అత్యంత ఆర్భాటంగా ప్రారంభిస్తారు.

**వృషభం:** వ్యాపార పరంగా మీ వ్యూహాలు అంచనాలు మీరు ఊహించిన విధంగా వుంటాయి. కుటుంబ సమస్యలు తీరుతాయి.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకు కలించవచ్చు. పట్టుదలతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తిచేస్తారు.

**కర్కాటకం:** ఆలోచనలు మాత్రం స్థిరంగా ఉండవు. గృహ, స్థలం కొనుగోలు యత్నాలను వాయిదావేస్తారు. ఋణ వత్తిడులు.

**సింహం:** పండితులు, ప్రముఖులు కలుస్తారు. టెండర్స్, కాంట్రాక్ట్స్ వర్క్ ఆర్డర్స్ లాభదాయకంగా వుంటాయి. సోదరుల కలయిక.

**కన్య :** మీ ప్రవర్తనలో గానీ, వ్యవహారాలలో గానీ దాపరికం, ఏకాంత మవసరం. ఒక వ్యవహారంలో మర్మంగా వ్యవహరిస్తారు.

**తుల :** ఋణాలు ఇవ్వటం తీసుకోవటం వంటి లావాదేవీలు జరపకండి. సంతాన విషయంలో కొంత మానసిక ఆందోళనకు గురవుతారు.

**వృశ్చికం:** మీ కుటుంబ వ్యవహారాలలో అతిగా జోక్యం చేసుకునే వారిని ఆదిలోనే తృంచివేయండి. క్రయ విక్రయాలలో లాభాలు.

**ధనుస్సు:** తామరాకు మీద నీటి బిందువు లాగా ఉండటంవలన లాభ పడతారు. కారణం లేని చికాకులు ఎదురు అవుతాయి.

**మకరం:** రహస్య విరోధులపై విచారణలు, అభియోగాలు సంభవం. ఉమ్మడిగా సాగించే కృషికి ప్రతిఫలం లభిస్తుంది.

**కుంభం:** ఉద్యోగ పారిశ్రామిక రంగాలలో కొన్ని చిక్కులు ఎదురవుతాయి. ఆత్మీయులతో విహారయాత్రలు చేస్తారు.

**మీనం :** రావలసిన మొత్తాలు, క్లయిములు చెల్లించవలసిన పద్దులు పరిష్కారమవుతాయి. మీ కృషి ఫలిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కర్నూలులో విద్యార్థిని పట్ల టీచర్ అసభ్య ప్రవర్తన

## దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు

### విచారణకు ఆదేశించిన డి. సిఎం పవన్

**కర్నూలు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** కామాంధుడైన ఓ ఉపాధ్యాయుడు తన విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవహరించారు.. తల్లిదండ్రులు దేహ శుద్ధి చేశారు. విషయం అలా ఇలా వెళ్లి.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వరకు వెళ్ళింది. ఆయన విచారించాలని సూచించారు. అయితే డీఈవో కార్యాలయ అధికారులు జరిగిందే వాస్తవమే.. పొరపాటున టీచర్ చేయి తగిలింది కానీ.. సదరు ఉపాధ్యాయుడు శ్రీరామచంద్రుడు అంటూ నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఇవ్వడానికి ఎలాంటి ప్రలోభాలు పనిచేశాయి అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉపాధ్యాయుడిపై దాడి చేసినందుకు పోలీస్ కేస్ పెడతామని బాధితులను బెదిరించినట్లు కూడా తెలుస్తోంది. అధికారులకు విద్యార్థినిల రక్షణ పట్ల ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. కర్నూలు నగరంలోని పాత కంట్రోల్ రూమ్ ఎదురుగా ఉన్న మున్సిపల్ పాఠశాలలో ఒక టీచర్ అసభ్యంగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 18వ తేదీన పాఠశాలలోని ఒక విద్యార్థిని పట్ల అక్కడి హిందీ మాస్టర్ అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థినులను మందలించే విషయంలో ఆ ఉపాధ్యాయుడు నీచంగా ప్రవర్తించాడు. ఒక విద్యార్థిని పట్ల మాత్రమే అసభ్యంగా ప్రవర్తించి తగలకూడని చోట కొట్టాడు. ముమ్మాటికీ అది బ్యాడ్ టచ్. ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. తల్లిదండ్రులు ఆగ్రహంతో పాఠశాలకు వచ్చి టీచర్ పై దాడి చేసి టీచర్ కు దేహ శుద్ధి చేశారు. ఈ విషయం జనసేన పార్టీ కార్యకర్తలైన జనసైనికులు గుర్తించి జనవాణి కార్యక్రమం ద్వారా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కర్నూలు జిల్లా ఉన్నతాధికారులకు తో మాట్లాడి ఈ విషయంపై విచారించాలని సూచించారు.

కర్నూలుజిల్లా డీఈవో సుధాకర్ డిప్యూటీ డిఈఓ శ్రీధర్ ఆధ్వ ర్యంలో విచారణకు ఆదేశించారు. విచారణలో టీచర్ అసభ్యంగా ప్రవర్తించడం వాస్తవమే అని తేలింది. అదేవిధంగా తల్లిదండ్రులు దాడి చేసిన విషయం వాస్తవమేనని తేలింది. అయితే టీచర్ చేయి పొరపాటున తగలకూడని చోట తగిలిందని అతను సచ్చీలుడు అని తేల్చారు. ఆమేరకు నివేదిక ఇచ్చారు. బాధిత విద్యార్థినితో వీడియో వాయిస్ తీసుకొచ్చారు.

అదే క్రమంలో సహచర టీచర్లతోనూ అతను చాలా మంచివాడు అంటూ స్టేట్మెంట్ లు తీసుకొచ్చారు. అంతేగాక విద్యార్థిని తల్లిదండ్రులతో కూడా టీచర్ కు అనుకూలంగా స్టేట్మెంట్ తీసుకొచ్చారు. అది ఏదో చిన్న పొరపాటు అనే విధంగా వివరాలు సేకరించి నివేదిక రూపంలో డిఇఓ కు అందించారు. ఇందులో డిఈ ఓ కార్యాలయ అధికా రులు విచా రించారా జరిగిన వాస్తవాన్ని అవాస్తవంగా తీర్చిదిద్దారా.. అనేది అర్థం కాని పరిస్థితి. ఇక్కడ జరిగిందేమంటే సదరు ఉపాధ్యాయుడు అలా ప్రవర్తించినట్లుఅంగీకరించాడు. అయితే తాను ఉద్దేశపూ ర్వకంగా ఏమిచేయలేదని విద్యార్థిని మందలించే క్రమంలో తన చేయి తగిలిందని తనకు ఎలాంటి దుర్దేశం లేదని చెబుతూ ఇది మొదటి తప్పుగా క్షమించాలని రాతపూర్వకంగా ఇచ్చినట్లు డీఈవో సుధాకర్ చెబుతున్నారు.

టీచర్ చేసిన నీచమైన పనికి విద్యార్థిని బాధపడటంతో ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పుకుని ఏడ్చింది. పాప మాటలు విన్నవారు ఆగ్రహంతో దాడి చేశారు. మరి చిన్న పొరపాటు అయితే విద్యార్థిని బాధపడుతుందా.. తల్లిదండ్రుల ఆగ్ర హంతో ఉపాధ్యాయుని పై దాడి చేయడాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని.. అటు పాఠశాలలోని సహచర ఉపాధ్యాయులు డీఈ ఓకార్యాలయ అధికారులు విద్యార్థినిని,తల్లిదండ్రులను భయపెట్టారు. కీచక టీచర్ పై డీఈవో చర్యలు తీసుకుంటారు. అదే సమయంలో ఉపాధ్యాయుని పై దాడి చేసిన తల్లిదండ్రులపై పోలీస్ కేసు అవుతుందని భయపెట్టారు.

**వివరణ ...** ఈ విషయంపై డిఇఓ సుధాకర్ ను ప్రభాత వార్తా వివ రణ కోరగా ఈ సంఘటన 18వ తేదీ జరిగిన మాట వాస్తవమే. తమకు సమాచారం అందగానే విచారణకు ఆదేశించామన్నారు. డిప్యూటీ డిఇఓ ఆధ్వర్యంలో విచారించామని, ఇందులో సదరు ఉపాధ్యాయుడు పొరపాటున చేయి తగిలిందని ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని నివేదిక ఇచ్చారన్నారు. అయితే అధికారులు ప్రలోభాలతో విచారణ పక్కదారి పట్టించారు అనే విషయంపై తన విచారిస్తానని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ వివరణ ఇచ్చారు.

# విద్యార్థినిపై టీచర్లే అత్యాచారం

**భువనేశ్వర్,ఫిబ్రవరి 22:** స్కూల్ టీచర్లు ఒక బాలికను లైంగికంగా వేధించారు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత విద్యార్థిని కుటుంబం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.ఐదుగురు టీచర్లను అరెస్ట్ చేశారు. ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 13ఏళ్ల బాలిక ఒక ప్రైవేట్ స్కూల్‌లో ఏడోతరగతి చదువుతున్నది. అయితే ఆ స్కూల్‌కు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు చాలా కాలంగా ఆ విద్యార్థిని లైంగికంగా వేధిస్తున్నారు.

# సేద్యానికి చేయూత

>> రూపాయలు రావలసి ఉందని, ప్రస్తుతం 50కోట్ల రూపాయలు మాత్రమే విడుదలయ్యాయని వివరించారు. 645కోట్లు విడుదల చేయాల్సి ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కేంద్ర వాటా నిధులను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులను ఆర్‌కెవివై, పిడిఎంసి పథకాల ద్వారా మంజూరుచేయాలని అచ్చెన్న కోరారు. త్వరితగతిన నిధుల విడుదలకు చర్యలు చేపడతామని కేంద్రమంత్రి చౌహాన్ హామీ ఇచ్చారు.

## అమరావతి కోసం కృష్ణానది వరద పరిరక్ష పనులకు రూ.308.60 కోట్లతో టెండర్లు

**రాజంపేట, ఫిబ్రవరి22 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, కృష్ణా నదికి కుడి ఒడ్డున నేరుగా ఉండడంతో భవిష్యత్తులో వరద ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసు కుంది.ఉంది. రాజధాని!!కోర్ సిటీ జోన్‌లో దూరం చాలా తక్కువగా ఉండడం, !!కొత్త రాజధాని ప్రాంతం యొక్క పరిపాలనా, చట్టపరమైన న్యాయ కేంద్రం కృష్ణ నదికి కుడి ఉన్న నేపథ్యంలో వరద పరిరక్షణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు ఏడిపి నిధులను కేటాయించింది. ఈ ప్రాంతంలోని కుడి ఒడ్డు ప్రాంతం వరదలకు గురయ్యే చదునైన, సారవంతమైన భూమిని కలిగి ఉండడంవల్ల నివాస ప్రాంతాలకు ముప్పు లేకుండా రక్షి ంచడానికి వరద రక్షణ గోడలను నిర్మించేందుకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ తాజాగా 308.60 కోట్ల రూపా యల అంచనా వ్యయంతో టెండర్లను పిలిచింది. రాజధాని నిర్మాణం పనులు భాగంగా ఈ 1 రహదారి ప్రాంతంలో 37వ ప్యాకేజ్ 104.55 కోట్ల తోను, 38వ ప్యాకేజీ 101.74 కోట్ల తోను, 39వ ప్యాకేజీ102.31 కోట్లతోనూ ఎడిసిఎల్ టెండర్లు పిలిచింది. టెండర్లు దాఖలు చేసేందుకు మార్చి 11 వరకు గడువు ఇచ్చారు. ఇదే రోజున టెక్నికల్ బిడ్ ను ఓపెన్ చేస్తారు. అనంతరం ఫైనాన్స్ బిడ్ ఓపెన్ చేసి టెండర్లు ఖరారు

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం

### - గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణ

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీ ఓటర్ల మదర్ లిస్ట్ (జనవరిఆరంభం -2026), (05ఫిబ్రవరి )వరకు అప్డేట్స్ తప్పనిసరిగా పొందాలని ఏపీ ఎన్నికల సంఘం వెల్లడించింది.ఓటర్ల జాబితా హార్డ్ కాపీలు మండలాల వారీగా డిప్యూటీ ఎంపీడీవోలకు అందజేయాలి. పంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీకి సంబంధించిన ఓటర్లను వెరిఫై చేయాలి. గ్రామ పంచాయతీ వారీగా డాటా ఇన్‌పుట్ షీట్ తయారు చేసి మ్యాపింగ్ చేయాలి. నెట్ ఓటర్స్ సంఖ్య మండల నెట్ ఓటర్స్‌తో సరిపోలాలి ఒక్క ఓటరు కూడా మిస్ కాకూడదు. సాఫ్ట్‌వేర్ లో డాటా ఫీడ్ డోర్ నెంబర్ మరియు విలేజ్ వైస్ సార్టింగ్ చేసి ఫైనల్ ఓటర్ లిస్ట్ తయారు చేయాలి. డోర్ నంబర్ ఎర్రర్ ఉంటే కరెక్ట్ చేసి తిరిగి సార్టింగ్ చేయవచ్చే. సార్టింగ్ సాధ్యం కాకపోతే మాన్యువల్ మ్యాపింగ్ ద్వారా కూడా ఓటర్ లిస్ట్ తయారు చేసే అవకాశం ఉంది. పంచాయతీ రాజ్ యాక్ట్ -1994 సెక్షన్ -11 మరియు జీవో -254 నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ:09-03-2026. ఈ సమాచారిన్న సంబంధిత సిబ్బందితో వెంటనే షేర్ చేయండి.

## ఎపి వాటా మేరకే 465 టీఎంసీలు వాడుకున్నాం

### - రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుత నీటి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ కృష్ణా నది నుంచి 465.66 టీఎంసీలు నీటిని వినియోగించుకుంది. అంటే, మా వాటా మేరకు మాత్రమే తీసుకున్నాం. రెండు రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకున్నాం. ఇంకా ఏపీకి ఉమ్మడి జలాశయాల్లో 40.51 టీఎంసీల నీళ్లు వాడుకునే హక్కు ఉంది అని రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాశారు. వరద కాలంలో మళ్లించిన నీటిని లెక్కలోకి తీసుకోకూడదు. ఆ నీటిని లెక్కించినా రాష్ట్ర వాటాగా పరిగణించకూడదు. సాగర్ కుడి, ఎడమ కాలువల కింద సాగు, తాగునీటి అవసరాలకు మే నెలాఖరు వరకు 73.50 టీఎంసీలు నీరు అవసరం అని లేఖలో పేర్కొన్నారు. 2025-26 నీటి సంవత్సరంలో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం ఆశించిన మేర వచ్చింది. 2025 జూన్ 13 నుంచి నవంబరు చివరి వరకు 2,343 టీఎంసీల జలాలు ఈ రిజర్వాయర్‌కు చేరాయి. జూరాల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు కృష్ణాలో మిగులు జలాలున్న సమయంలో 58 రోజుల పాటు 1513 టీఎంసీలు శ్రీశైలానికి వచ్చాయి. అలా భారీగా వరద పోటెత్తిన సందర్భంలోనే విద్యుత్ కేంద్రం, స్పిల్ వేతో పాటు శ్రీశైలం అన్ని అవుట్ లెట్‌ల ద్వారా నీళ్లు వదిలేశాం. వెరసి, నీటి వనరులను ఉత్తమంగా వినియోగించాం.

## కార్యకర్తలకు సొంత ఇల్లులా పార్టీ కార్యాలయం



**తిరుపతి,పిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** కార్యకర్తలకు సొంత ఇల్లులా పార్టీ కార్యాలయాన్ని నిర్మించి ,అందుబాటులో ఉండేలా చూస్తామని తెలుగుదేశంపార్టీ నాయకులు ముక్తకంఠంతో తెలిపారు. ప్రజల సేవకు పార్టీ నాయకులు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. తిరుపతి జిల్లాలో నూతనంగా టిడిపి పార్టీ కార్యాలయం నిర్మాణానికి ఆదివారం ఉదయం ఎంఆర్‌పల్లి అవిలాల మార్గంలోని శ్రీజడెయిరీ సమీపంలో భూమిపూజ నిర్వహించారు.తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షురాలు పనబాకలక్ష్మి, ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ సంక్షేమకార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, ఎమ్మెల్యేలు బొజ్జలసుదీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, పార్టీ నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, దంపూరి భాస్కర్, రవినాయుడు, శ్రీధర్‌వర్మ, మన్నెం శ్రీనివాసులు, జెబి శ్రీనివాస్ తదితరులు పాల్గొని శాస్త్రోక్తంగా టిడిపి కార్యాలయానికి భూమిపూజ చేశారు.

త్వరగా భవననిర్మాణం పూర్తిచేసి కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. శ్రీవారి పాదాలచెంత టిడిపి కార్యాలయం నిర్మించుకోవడంఆనందంగా ఉందన్నారు.

> ప్రజల సేవకు కృతనిశ్చయంతో పనిచేస్తాం
>
> తిరుపతిలో టిడిపి ప్రాంతీయకార్యాలయం భూమిపూజ

## మాజీ ఎంపి బుట్టా రేణుక ఆస్తుల వేలం!



**కర్నూలు ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసీపీ నాయకురాలు మాజీ ఎంపీ బుట్ట రేణుక ఆమె భర్త నీలకంఠకు చెందిన కోట్ల రూపాయల ఆస్తులను వేలం వేయడానికి ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. బుట్ట ఇన్ఫ్రాస్ట్రక్చర్, బుట్ట కన్వెన్షన్ సర్వీసెస్, మేరెడియాన్ ఎడ్యుటెక్ సంస్థల పేరుతో గతంలో వీరు తీసుకున్న 340 కోట్ల రుణం వడ్డీలతో కలిపి ప్రస్తుతం 782 కోట్ల భారీ బకాయిగా మారింది. ఈ బకాయిల వసూలు కోసం వారు తనకబెట్టిన అత్యంత ఖరీదైన ఆస్తులు కూకట్పల్లిలోని మెరిడియన్ స్కూల్ సుమారు 65 కోట్లు బంజారా హిల్స్లోని స్కూల్ భవనం ఫర్నిచర్ కంప్యూటర్లతో పాటు మాదాపూర్ సమీపంలోని ఖానామెట్ లో ఉన్న 725 చదరపు గజాల ఖాళీ స్థలం మరియు ప్రసిద్ధ బుట్టా కన్వెన్షన్ సెంటర్లను మార్చి 24న ఈ వేలం వేయనున్నారు. బుట్టా రేణుక ఒక సాధారణ బిసి సామాజిక వర్గానికి చెందిన మహిళగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి ఒక పక్క వ్యాపారవేత్తగా రాణిస్తూనే మరోపక్క వెనుకబడిన వర్గాల ప్రతినిధిగా గుర్తింపు పొందారు. 2014లో వైసీపీ తరపున కర్నూలు ఎంపీగా గెలిచిన ఆమె ఆ సమయంలో ఆ పార్టీకి ఉన్న బలమైన బీసీ నేతల్లో ఒకరిగా నిలిచారు. రాజకీయాల్లోకి రాకముందే ఆమె కుటుంబం విద్యాసంస్థలు ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో భారీగా పెట్టుబడులను పెట్టినప్పటికీ నేడు ఆ ప్రతిష్టాత్మక ఆస్తులన్నీ వేలానికి రావడం ఆమె ఆర్థిక పతనానికి అద్దం పడుతోంది. కోవిడ్ వళ్ళ వ్యాపారాలు దెబ్బ తిన్నాయని రుణాన్ని రీషెడ్యూల్ చేయాలనీ వారు కోరినప్పటికీ నిబంధనల ప్రకారం చెల్లింపులు జరగకపోవడంతో ఎల్ఐసి ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే గతంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక బహిరంగ వేదికపై బుట్టా రేణుక సామాజిక వర్గాన్ని ప్రస్తావిస్తూ ఆమె ఆర్థిక స్థితిగతులపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఆమె ఆర్థికంగా అంతంత మాత్రమే అని ఆమె వద్ద పెద్ద ఆస్తులు లేవని జగన్ మాట్లాడటం అప్పట్లో పెద్ద దుమారాన్ని రేపింది వందల కోట్ల వ్యాపారాలు చేస్తున్నా ఒక ఎంపీ స్థాయి మహిలను అలా తక్కువ చేసి మాట్లాడటంపై అప్పట్లో నెటిజన్లో తీవ్రంగా ట్రోల్ చేశారు. కానీ నేడు సీన్ కట్ చేస్తే ఆమె ఆస్తులన్నీ వేలానికి వచ్చి నిజంగానే ఆర్థికంగా రోడ్డున పడే పరిస్థితి రావడం గమనార్హం . నాడు జగన్ ఏదో ఉద్దేశంతో అన్న మాటలు నేడు ఆమె పరిస్థితికి అక్షరాలా సరిపోతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. రాజకీయంగా జగన్ ఇచ్చిన హామీలను నమ్మి టిడిపిని వీడి తిరిగి వైసిపిలోకి వచ్చిన బుట్టా రేణుకకు ఐదేళ్ల అధికార కాలంలో కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా దక్కకపోగా 2024 ఎన్నికల్లో సీటు కూడా నిరాకరించడం గమనార్హం ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు అందకపోవడం లేదా రాజకీయ సహకారం లేకపోవడంతోనే ఈ ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని ప్రచారం సాగుతోంది. ఒకవేళ ఆమె టిడిపిలోనే కొనసాగి ఉంటే బీసీ కోటాలో కచ్చితంగా మంత్రి అయ్యే వారని జగన్ హామీలు నమ్మి అటు రాజకీయ పదవులు ఇటు వ్యాపార సామ్రాజ్యం రెండిటిని కోల్పోయారని ఆమె అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రుణాల వ్యహారం ఇప్పటికే నేసీఎల్ టి పరిధిలో ఉండగా మార్చి 24 న జరగనున్న వేళా ఆమె భవిష్యత్తును నిర్ణయించనుంది.

## సమస్యలు మా దృష్టికి తీసుకురండి

### : డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



**తిరుపతి,పిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంత పురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకు వచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 8712652679చిత్తూరు: 7993 147979 నెల్లూరు: 08612320427 అన్నమయ్య: 94408 17449కడప: 08562242457 కర్నూలు: 7382614308 నంద్యాల: 73826 18976అనంతపురం: 9154790 350శ్రీసత్య సాయి: 9963707847 సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## దేవుడితో రాజకీయం చేసే వైఎస్సార్సీకి గుణపాఠం

### - 7 జిల్లాల్లో టిడిపి కార్యాలయాల నిర్మాణం - పార్టీకి కార్యకర్తే అధినేత

#### - పార్టీ కార్యాలయ నిర్మాణ భూమిపూజలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ళ, జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడుషణ్ముగరెడ్డిలు

**చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** తిరుమల శ్రీవారితో రాజకీయం చేస్తున్న ప్రతిపక్ష వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మరోసారి గుణపాఠం తప్పదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డిలు అన్నారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం నూతన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో పని చేయడం సంతోషంగా వుందని, రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో ఏడు జిల్లాల్లో నూతన పార్టీ కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని పార్టీ అధినేత నిర్ణయించడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే అధినేత అని, పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎంపీలు, ఎమ్మెల్యేలు అందుబాటులో వుండటం కోసం జిల్లా కేంద్రంలో నూతన హంగులతో జిల్లా పార్టీ కార్యాలయంను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ హంగులతో నిర్మించున్న జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నాయకులకు ఒకొక్క గది నిర్మిస్తున్నామన్నారు.



భూమి పూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ళ, అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి

అలాగే కార్యకర్తలకు సైతం రాత్రి బస చేయడానికి వీలుగా కార్యాలయ నిర్మాణం వుంటుందన్నారు.

ప్రతిపక్ష వైకాపా తన రాజకీయ మనుగడ కోసం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతుందని ధ్వజమెత్తారు.

## కేంద్రం సహకారంతో కాణిపాకం ఆలయ అభివృద్ధి : మంత్రి రామ్మోహన్‌నాయుడు

**కాణిపాకం,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాణిపాకం ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆయన గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలసి ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. కాణిపాకం ఆలయ దర్శనానంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 25 ఏళ్ళ క్రితంతో పోలిస్తే కాణిపాకం ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. నేడు కాణిపాకం ఆలయం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్నట్లు తెలిపారు. అయితే పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ అభ్యర్థన మేరకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రశాంత్ పథకంలో చేర్చి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేస్‌బాబులు కేంద్రంలో మోదీ ఇస్తున్న సహకారంలో రాష్ట్రాన్నా బ్రాండ్ అంబాసిడర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. దేశంలోని పెట్టుబడులే కాకుండా ప్రపంచంలో వున్న పెట్టుబడులకు కూడా ఏపీ కేంద్రంగా అభివృద్ధి తయారైందన్నారు.భవిష్యత్తు టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంల వేదికగా తయారైందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో ప్రజాపాలన సాగుతోందని, ఇందుకు స్వామివారి ఆశీస్సులు కూడా కావాలని ప్రార్థించినట్లు మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయం ఆదివారం కూడా భకు తల రద్దీ కొన సాగింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈ మేరకు శని,ఆదివారాలు వారంతపు రోజులు కావడం ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు.ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం భారీగా తరలి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో స్వామి దర్శనం కోసం ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది.



మంత్రి రామ్మోహన్‌నాయుడు,గల్లా జయదేవ్‌లకు స్వామివారి జ్ఞాపికలను అందజేస్తున్న ఛైర్మన్ ఇఒలు

# తిరుమల సమాచారం

## 26నుండి తెప్పోత్సవాలు



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలు ఈనెల 26వతేదీ నుండి ఐదురోజులు వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు, నీటివిభాగం అధికారులు బలమైన తండ్లుతో తెప్పను తీర్చిదిద్దారు. నేటి సాయంత్రం పుష్కరిణిలో తెప్పలను ట్రయల్‌రన్ నిర్వహించి సౌకర్యవంతంగా తీర్చిదిద్దనున్నారు .తిరుమలలో శ్రీవారి ఆలయానికి పక్కనే ఉన్న పవిత్రమైన స్వామివారి పుష్కరిణిలో ఐదురోజులు జరిగే ఈ తెప్పోత్సవాలకు టిటిడి అన్ని చర్యలు తీసుకుని ఏర్పాట్లు చేస్తుంది. ఫిబ్రవరి 26వతేదీ గురువారం సాయంత్రం నుండి మార్చి 2వతేదీ సోమవారం వరకు ఐదురోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు.ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి రెండవరోజు మూడుచుట్లు, మూడవరోజు ఐదు చుట్లు. నాలుగు,ఐదు రోజుల్లో పలురకాల అలంకరణల్లో మలయప్ప తెప్పలపై విహరి స్తారు.రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేశారు.

## శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం లోకక్షేమం కోసం భగవంతుని ఆశీస్సులుండాలి

### - కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాత వార్త ప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ రూపం దర్శనంతో మనసు ఆనందంగా ఉందని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ విశ్వాసం వ్యక్తం చేశారు.భగవంతుని ఆశీస్సులతో లోకక్షేమంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. భారతదేశం అన్ని రంగాల్లో మరింతగా అభివృద్ధిచెందాలని, ఆ దేవదేవుని కరుణాకటాక్షాలు మెండుగా కలగాలని వేడుకున్నానన్నారు. భారతదేశం అభివృద్ధిని ప్రపంచదేశాలు కూడా గుర్తిస్తున్నాయన్నారు. ఆదివారం ఉదయం ఆలయంలోనికి చేరుకున్న కేంద్రమంత్రి చౌహాన్‌కు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెపి నాయకులు రమేశ్‌నాయుడు, పురుషోత్తంనాయుడు కేంద్రమంత్రి వెంట ఉన్నారు. ఆలయంలోపల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నా : మంత్రి అచ్చెన్నాయుడు



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. చేస్తున్న అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆదివారం ఉదయం మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబంతో కలసి వేంకటేశ్వర స్వామికి మొక్కులు తీర్చుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ శ్రీవారిని దర్శించుకున్నారు.

## అనంతాళ్వార్ జీవితం అందరికీ ఆదర్శప్రాయం: టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** వైష్ణవ భక్తాగ్రేసరుడు, ఆళ్వారులలో అనంతాళ్వార్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ పేర్కొన్నారు. తిరుమలలోని అనంతాళ్వార్ తోట (పురశైవారితోట) లో అనంతాళ్వార్ 972వ అవతార మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఇఒ డాక్టర్ శరత్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ అనంతాళ్వార్ అవతార మహోత్సవాల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. భక్తి అంటే ప్రార్థన మాత్రమే కాదని, భక్తి అంటే సేవ అని నిరూపించిన మహానుభావుడు అనంతాళ్వార్ అని కీర్తించారు. 972 సంవత్సరాలుగా అనంతాళ్వార్ వంశీకులు శ్రీవారికి పుష్ప కైంకర్యం చేస్తున్నారని, వారి పరంపర ఎల్లప్పటికీ కొనసాగాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా అనంతాళ్వార్ వంశీకులు నాలాయిర దివ్య ప్రబంధ గోష్ఠిగానం నిర్వహించారు. అనంతరం పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా వేంకటాచల ఇతిహాసమాల, రామానుజులవారి తిరుమల యాత్ర, స్వామి పుష్కరిణి వైభవం, శ్రీ రామాయణ కాలక్షేపం, తిరుమలనంబి - తన్నీరముదు ఉత్సవం, మూలవర్ల తిరుమంజనం - తిరునామం, తిరుమలలో రామానుజ సన్నిధి ప్రతిష్ఠ, సహస్రనామార్చన వైభవం, తిరుమలలో జీయర్ మఠం స్థాపన, శ్రీవారి సుప్రభాతంఏకాంత సేవ, తిరుమలలో దివ్యప్రబంధ క్రమం, తిరుమలలో పుణ్య తీర్థాలు తదితర అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పండితులు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో అనంతాళ్వార్ వంశస్తులు వేంకట కృష్ణ స్వామి, భరద్వాజస్వామి, తదితరులు

## ట్రెజరీస్, అకౌంట్స్ గెజిటెడ్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి

### సంఘం అధ్యక్షుడు కె.రాజకుమార్, కార్యదర్శి డిజె సంపత్ కుమార్

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ మరియు అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి కార్యవర్గ ఎన్నికలు ఆదివారం విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాలోత్సవ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారి జి.నాగసాయి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పర్యవేక్షణలో పారదర్శకంగా, సజావుగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుండి హాజరైన గజిటెట్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని సంఘ ఐక్యతను చాటారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కే.రాజకుమార్ మాట్లాడుతూ ట్రెజరీ మరియు అకౌంట్స్ శాఖల ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు తన వంతు నిస్వార్థంగా కృషి చేస్తానని తెలిపారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, సేవా పరిస్థితుల మెరుగుదల తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రభుత్వంతో సానుకూల చర్చలు జరిపి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డి.జే సంపత్ రావు మాట్లాడుతూ సభ్యుల ఐక్యతే సంఘ బలమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రెజరీ మరియు అకౌంట్స్ అధికారుల సమస్యల పరిష్కారానికి సంఘం సమిష్టిగా కృషి చేస్తుందని తెలిపారు. సేవా పరమైన అంశాల్లో పాదర్శకత, సమర్థత, సభ్యుల న్యాయ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కె.రాజ్‌కుమార్ అధ్యక్షునిగా డి.జె. సంపత్ రావు ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షునిగా ఎండీ, మజహర్ బేగ్ ఉపాధ్యక్షునిగా పి.వి.నారాయణ ఉపాధ్యక్షునిగా సీహెచ్.శ్రీనివాసులు ఉపాధ్యక్షునిగా కె.బరద్వాజ ఉపాధ్యక్షుడు, జి.నిర్మలమ్మ ఉపాధ్యక్షురాలు,

కె.రాజు ఆర్గనైజింగ్ కార్యదర్శి, పి.శ్యామ్ ప్రసాద్ కార్యదరిశ, పి పార్థసారథి కార్యదర్శి, ఇ.సుబ్బారాయుడు కార్యదర్శి, కె.వి.సురేష్ బాబు కార్యదర్శి, ఎస్.కె.మక్సూద్ కార్యదర్శిగా బి.రవీంద్రరెడ్డి కార్యదర్శిగా. పి.మాధవి కార్యదర్శిగా ఎం రాజ్యలక్ష్మి ట్రెజరర్‌గా నూతన కార్యవర్గం ఎన్నికయింది..

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్

# వన్యప్రాణులను కాపాడుకోలేమా?

అటవీ రక్షణకు వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అడవులను ధ్వంసం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని అటు కేంద్రపాలకులు, ఇటు ఆయా రాష్ట్రాల పాలకులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు లభించడం లేదు. అంతకంతకు అటవీ విధ్వంసం పెరిగిపోతున్నది. కొందరు అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, వీటన్నింటికి మించి రాజకీయ జోక్యంతో చట్టాలు నిరుపయోగం అవుతున్నాయి. అరణ్యాలను స్మగ్లర్లకు వదిలి కొందరు అధికారులు జనారణ్యాలకే పరిమితం కావడంతో పరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. ఒకనాడు దేశంలో కాకులు దూరని కీకారణ్యాలుగా పేరొందిన అరణ్యాలు సైతం మైదానాలుగా మారిపోతున్నాయి. ఈ అటవీ సంపదతోపాటు వీటి ఆధారంగా శతాబ్దాల తరబడి జీవనం సాగిస్తున్న పెద్ద పులులు, చిరుత పులులు, దుప్పులు, అడవి పందులు, ఏనుగులు, ఇలా ఒక్కటేమిటి సమస్త ప్రాణులు వేటగాళ్ల బారినుంచి తప్పించుకోలేక కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అడవుల విస్తీర్ణం తగ్గడం, స్మగ్లర్ల కార్యకలాపాలు పెరగడంతో ఈ వన్యప్రాణులకు అటవీ ప్రాంతాల్లో ఆహారం దొరకక జనారణ్యాలపై పడుతున్నాయి. ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాల్లోకూడా పులులు,ఎలుగుబంట్లు, ఏనుగులు, అడవిపందులు తదితర వన్యప్రాణులు ఎన్నో జనారణ్యంలోకి చొచ్చుకువచ్చి ఆహారం కోసం రైతుల పంటలపై పడుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం తదితర ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో అడవి ఏనుగులు పంటలపై దాడిచేస్తున్నాయి. దీంతో ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సాగు చేసుకున్న పంటలు నోటికి అందుతున్న దశలో వన్యప్రాణులు ధ్వంసం చేస్తుండటంతో పురుగు మందులు, కరెంటు తీగలు పెట్టి కొందరు చంపుతున్నారు. ఇది రాను రాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఒకనాడు ఆహారం కోసం ఆ తర్వాత సరదాగా ఆరంభమైన వన్యప్రాణుల వేట ఇప్పుడు వ్యాపారంగా మారిపోయింది. ఆదిమానువుని జీవనం వేటతోనే ఆరంభమైనట్లు చరిత్ర చెబుతున్నది. కేవలం తమ ఆకలి తీర్చుకునేందుకే ఆనాటి ఆదిమానవుడు వేటాడేవారని చరిత్ర ఆధారాలు వెల్లడిస్తున్నాయి. రాజుల కాలంలో వేటను సరదాగానో, తమ ప్రతిష్టకోసం కొనసాగించారు. ఆ తర్వాత వేట క్రమేపీ వ్యాపారంగా రూపాంతరం చెందడంతో 1526 నుండి 1857 వరకు వేటజోరుగా సాగినట్లు ఆధారాలున్నాయి. మనదేశానికి బ్రిటిష్ కాలంలో తుపాకులు రావడంతో వేట మరింత సులభం అయింది. దీంతో వన్యప్రాణులతోపాటు ప్రధానంగా పులుల సంఖ్య విపరీతంగా పడిపోయింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలో నలభై వేలకుపైగా పులులు ఉండగా, 1972 ప్రాంతానికి మూడువేల వరకు తగ్గిపోయాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అసలు పులుల జాతితోపాటు మరికొన్ని వన్యప్రాణుల జాతి కూడా ఆనవాళ్లు లేకుండా అంతరించిపోతుందని ఆందోళనలు వ్యక్తం కావడంతో ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని 1972 సంవత్సరంలో ప్రవేశపెట్టారు. వేటాడటం నిషేధించడంతోపాటు పులుల పెంపుదలకు కొన్ని ప్రత్యేక పథకాలు చేపట్టారు. అందులోభాగంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఇరవైమూడు టైగర్ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలంవల్ల ఒక ప్రాజెక్టు ప్రారంభమైంది. అయినా ఆశించిన మేరకు పెద్దపులుల సంఖ్య పెరగడం లేదని చెప్పొచ్చు. ముఖ్యంగా అడవుల్లో వేట కారణంగా జింకలు,కుందేళ్ల లాంటి వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోవడంతో పులులు ఆహారం దొరకక జనారణ్యంలోకి ప్రవేశిస్తున్నాయి. రైతుల పశువులు, గొర్రెలు, మేకలు లాంటి వాటిపై దాడి చేసి చంపుతున్నాయి. దాదాపు ఏడువందల కిలోమీటర్లకుపైగా ప్రయాణించి పెద్దపులి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చేరుకున్నది. ఆహారం దొరకక పశువులపై దాడి చేస్తున్న దానిని పట్టుకునేందుకు పెద్దఎత్తునే ప్రయత్నం చేశారు. అదృష్టవశాత్తు అది ఒక ఇంట్లోకి దూరడంతో మత్తుతూటాతో పట్టుకొని ముందు జూకు తరలించి ఆతర్వాత అభయారణ్యాలకు పంపారు. ప్రస్తుతం సిద్దిపేట జనగాం జిల్లాలో మరొక పెద్దపులి తిరుగుతున్నది. దాన్ని పట్టుకునేందుకు గత నెల రోజులుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఆ ప్రాంతవాసులుకు ఈ పులివల్ల ఇబ్బందులు, భయాందోళనలు కలుగుతున్న మాట వాస్తవమేకావొచ్చు. అసలు ఆ పులి ఎందుకు అరణ్యాలను వదిలి వస్తున్నదో ఆలోచించాల్సిన అవసరం ఉంది. అడవులు అంతరించడం, జనసంచారం పెరిగిపోవడం, జంతువుల సంఖ్య తగ్గిపోతుండడంతో ఆ ప్రభావం పులితోపాటు అన్ని వన్యప్రాణులపై పడుతున్నది. ఇప్పుడు వేటకు తుపాకులు కూడా అవసరం లేకుండాపోయింది. మేకనో, గొర్రెనో ఏదో పశువునో ఎరగావేసి దానికి క్రిమిసంహారక మందులు ప్యాకెట్లు కట్టి పులులను మట్టుపెడుతున్నారు.ఒకపక్క అడువులు తగ్గిపోవడం, మరొకపక్క విజృంభించిన విష ప్రయోగాలు, విద్యుత్ కంచెల ఉచ్చులతో వన్యప్రాణులు బలైపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. అవసరం అనుకుంటే చట్టాన్ని సవరించి మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలి. అడవులను పర్యవేక్షించాల్సిన అధికారుల కార్యాలయాలు, పరిధులు నగరాలకే పరిమితం చేయకుండా ఆయా ప్రాంతాలకు తరలించాలి. వన్యప్రాణులను కాపాడేందుకు త్రికరణశుద్ధిగా అన్ని స్థాయిల్లోనూ ప్రయత్నాలు జరగాలి. ఇందులో స్వచ్ఛంద సంస్థలు కూడా పాలుపంచుకోవాలి.

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైనదో తెలిసొస్తుంది.



జాకబ్‌బ్రొనోవిస్కీ

## ప్రజావాక్కు



### ఆ విశ్వవిద్యాలయాలను రద్దుచేయాలి

రాజస్థాన్ కోటాలోని వర్ధమాన్ మహావీర్ ఓపెన్ యూనివర్సిటీ వారు హిందూవివాహపద్ధతులను , కర్మకాండలు అనగా తద్దినాలూ ఎలాచేయాలి అనేవాటిపై ఒక ఆరు నెలల కోర్సు ప్రవేశపెడుతుంది. వయసుతోపనిలేకుండా అన్నికులాలు, అన్నిమతాలవారికి ప్రవేశం ఉంటుందట. హిందూమతసాంప్రదాయాలతో యూనివర్సిటీలకు ఏమి పని?ఈకోర్సు చదివినవారు ఆవారావాళ్ళలాగా తయారై పెళ్లిపేరుతో,తద్దినాలపేరుతోఇంటింటికితిరిగి బతికేందుకా! తక్షణమె ఇలాంటి బుద్దిలేని కోర్సును ఉపసంహరించాలి. విద్యాలయాలు విద్యార్థులకు జ్ఞానాన్నిఅందించాలి. పెళ్ళి మంత్రాలు అన్నీబూతులు అనితెలిసిపోయింది.ఇంక తద్దినాలపేరురో జరిగేకర్మకాండ మొత్తం పురోహితుల పొట్టకూటికోసమే అని ప్రజాకవివేమన ఎలుగెత్తిచాటాడు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### బిసిలపై దృష్టి సారించాలి

ఉమ్మడిరాష్ట్రాల్లో చదివే కాలం తర్వాత ఉద్యోగ నియామకాల్లో రిజర్వ్‌డ్ కేటగిరి మినహా బిసి కుల అభ్యర్థులు ఎక్కువ. పోటీ కూడా ఎంపికకు చాలా కష్టం. కుటుంబాలు చాలావరకు దిగువ స్థాయి ఆదాయంలోనే ఉంటారు. వృత్తులు బాగా పడిపోయిన తర్వాత కుటుంబ ఆదాయం బాగా తగ్గినది. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పథకాలు పెడుతున్న కూడా నిరుద్యోగులు ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏ మాత్రం రిజర్వేషన్ ఇచ్చినా అది సమంజసమే. ప్రస్తుతం ప్రభుత్వం నడుపున్న కోచింగ్ కేంద్రాలలో కూడా నామమాత్రపు ఫీజు ఉంటే ఎంతోమంది పోటీలో తప్పక నెగ్గుతారు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### ఆలోచనా శక్తి పెంచాలి

భారత విద్యావ్యవస్థలో పరిశోధనా దృష్టిని విస్తరించాల్సిన అవసరం అత్యంత కీలకంగా మారింది. దేశంలో కోట్లాదిమంది విద్యార్థులు,లక్షలాదిపాఠశాలలు, ఉపాధ్యాయులు ఉన్న పరిస్థితిలో, పిల్లలలో జిజ్ఞాస, విచారణ, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన బాధ్యతగా నిలిచింది.ప్రశ్నించడం, అన్వేషించడం, వివిధ కోణాలలో ఆలోచించడం అనే దృక్పథాన్ని చిన్నప్పటి నుంచే అభివృద్ధి చేయాలి.

- సి. సాయిరుత్విక్, నల్గొండ

### కఠిన శిక్షలు విధించాలి

పదహారేళ్ళ వయసున్న అమ్మాయిని ఓ ముగ్గురు యువకులు అందులో ఇద్దరు మైనర్లు అత్యాచారం చేసారన్న వార్త కొత్త విషయమేమీ కాకున్నా మనసులను కలచివేసింది. రోజు రోజుకు ఈ ఆకృత్యాలు పెరుగుతున్నా వీటిని నిర్మూలించలేకపోతున్నాయి ప్రభుత్వాలు. రేపులకు పాల్పడిన వారికి జీవితాంతం, లేదా కనీసం ముప్పై ఏళ్ళ కఠిన కారాగార శిక్ష విధించాలి. అవసరమయితే క్రిమినల్ చట్టాన్ని సవరించాలి. ఇటువంటి శిక్షపడిన వారిని చూస్తే యితరులు నేరం చేయడానికి భయపడాలి. మన శిక్షాస్మృతిలో దీనిని డిటరెంట్ పనిష్మెంట్ అంటారు.దీనికన్నా కఠినమైనది రెట్రిబ్యూటివ్.ఈ శిక్షణను ఇంత వరకుమనదేశంలో అమలుపరచిన దాఖలాలులేవు. అత్యచారాలకుఆనకట్టలేకుండాపోతుంది.సుప్రీంకోర్టు వారు ఆలోచించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పెరుగుతున్న డిజిటల్ మోసాలు

డిజిటల్ యుగంలో సాంకేతికత జీవితం సులభతరం చేస్తున్నకొద్దీ, అదే సాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడే శక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతున్న సైబర్‌నేరాలలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ రూపకల్పన మోసాలు ముఖ్యమైనవిగా నిలుస్తున్నాయి. మనిషి ముఖం,స్వరం,మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు, ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేరగాళ్లకు సులభమైంది. వినోదం, పరిశోధన కోసం ఉపయోగించాల్సిన ఈ సాంకేతికత, ప్రజల నమ్మకాన్ని దోచుకునే సాధనంగా మారడం ఆందోళనకరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కాలుష్య నియంత్రణ చేపట్టాలి

నగరాల్లో రోజురోజుకు వాయు కాలుష్యం పెరిగిపోతున్నది. కట్టెలు,వ్యవసాయ వ్యర్థాలు వల్ల ఏహానీలేదు.ప్రస్తుత పరిస్థితుల్లో గాలిలోకి ప్రవేశించి వాతావరణాన్ని కలుషితం చేసే పొగలు చాలా ప్రమాదం. కొన్ని ఆ ప్రాంతంలో ఉన్న వారికి తక్షణమే శ్వాసకోశ ఇబ్బందితో ప్రమాదం వస్తుంది. కేవలం భోగీ మంట సందర్భం మాత్రమే కాక సాధారణంగా కూడా వాటిని గుర్తించి నిరోధించాలి. ముఖ్యంగా వీధిచివరి ఇటువంటి మంటలు ఎన్నో కనిపిస్తున్నాయి. వాటిలో నిషేధిత వస్తువులు వేసే పనివల్ల అందరికీ ముప్పు అని గుర్తెరగాలి. ఆ విధంగా సంప్రదాయ విధంగా భోగిని జరుపుకోవడం మన విధి.

- బి. ఆంజనేయులు, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# ఎన్నికల్లో ఏదీ మహిళా సాధికారత?

**చట్టబద్ధమైన రిజర్వేషన్లతో మహిళలకు ఒనగూడాల్సిన రాజకీయ ప్రయోజనాలు ఆచరణలో ప్రశ్నార్థకంగా మారి వారి వారి భర్తలూ, కుటుంబంలోని పురుషులే అధికార కేంద్రాలుగా మారి రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన రాజకీయ అధికారాన్ని అనుభవించలేని ఉత్సవ విగ్రహాలుగా మహిళలు మిగిలిపోక తప్పదు. ఈ నేపథ్యంలో మహిళలు తమ ఉదాసీనతతో రాజ్యాంగేతర శక్తులుగా రూపాంతరం చెందుతున్న భర్తలతో, సోదరులతో, ఇతర పురుష కుటుంబ సభ్యుల జోక్యంతో తమ అస్థిత్వానికీ, సమానత్వ సాధనకు ఒనగూడుతున్న ప్రమాదాల బారినుండి తమను తాము కాపాడుకుంటూ మేమూ పురుషులతో సమానమేనని నినదిస్తూ గెలిచి నిలుస్తారో లేదా మనుధర్మ స్మృతి మాయలోపడి పురుష ప్రపంచం నీడలోనే నిలిచి తరించే ద్వితీయ శ్రేణిపౌరులుగా తమ జీవితాలను కొనసాగిస్తారో రాబోయే కాలమే తేల్చిచెప్పాలి.**



డాక్టర్ నీలం సంపత్

తెలంగాణా రాష్ట్రంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో 73,74 వ రాజ్యాంగ సవరణలను అనుసరించి నలభై ఆరుశాతం రిజర్వేషన్లను సొంతం చేసుకున్న మహిళలు ,నిన్నటికి నిన్న మున్సిపాల్టీలకు జరిగిన ఎన్నికలలో ఏభై శాతంతో ఆయా రాజకీయ పార్టీల బి.ఫాం లు అందుకున్నప్పటి నుండి ప్రచార పర్వంలో ప్రజల మధ్యకు వెళ్లేక్రమంలో బి.సి,యస్.సి, యస్.టి సామాజిక వర్గాలనే తేడా లేకుండా, ఆర్థిక మూలాలతో, విద్యార్హతలతో సంబంధం లేకుండా మెజారిటీ మహిళలు తమ తమ భర్తల పేరుని మోయాల్సి రావడం మహిళా సాధికారతను మరుగున పడేసే చర్యగా భావించక తప్పదు. మహిళా సమానత్వానికి తామే ఛాంపియన్లమని ప్రకటించుకున్న కొన్ని ప్రసార సాధనాలు సైతం బి.ఫారాలు భర్తల పేరు పైనే వచ్చినట్లు కలర్ ఇస్తూ ప్రచారం చేయడంశోచనీయమే. అంతే కాకుండా అన్ని రకాల ప్రచార సామగ్రి పైన పోటీలో వున్న భార్యల కన్నా భర్తల ఫోటోలూ,పేర్లేముందు వరసలో ఉండడం మాత్రమే కాకుండా మా ఆవిడను గెలిపిస్తే మీ వార్డు లేదా కార్పొరేట్ డివిజన్‌ల అభివృద్ధికై నేను నిరంతరం పోరాడుతానని ఎమ్మెల్యేలు, ఎంపిలుమంత్రుల సమక్షంలో ప్రసార సాధనాలలో బహిరంగ ప్రకటనలు చేస్తుండడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా పులులూ, సింహాలుగా తమను తాము చిత్రీకరించుకుంటూ విస్తృత ప్రచారం చేస్తున్న వైనంతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళలు వారి భర్తల చేతుల్లో కీలు బొమ్మలుగా కొనసాగక తప్పదనే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది.ఆకాశంలోసగం ,అవనిలో సగం అంటూ ఆధునిక ప్రపంచంలో విద్యా,వైద్య, శాస్త్ర, సాంకేతిక,పోలీస్,మిలట్రీ లాంటి విభిన్న రంగాలతో పాటు,ఐ.ఏ.యస్, ఐ.పి.యస్ ఆఫీసర్లుగా పరిపాలనా రంగంలో, సామాజిక వేత్తలుగా, న్యాయవాదులుగా, న్యాయ మూర్తులుగా, పాత్రి కేయులుగా సైతం తమ ఉనికిని అత్యంత ప్రభావ పూరితంగా చాటుకుంటున్న మహిళలు రాజకీయ రంగంలో ఎమ్మెల్యేలుగా, యం.పిలుగా ముఖ్య మంత్రులుగా, దేశాధ్యక్షులుగా ఎంతో విజయవంతంగా తమ కర్తవ్యాలను నిర్వర్తిస్తున్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలలో మాత్రం తమ భర్తలు,సోదరులు ఇతర పురుష కుటుంబ సభ్యుల చేతుల్లో మర బొమ్మలుగా మారుతున్న వైనం పురుషులతోపాటు మహిళలకుసమానత్వ హక్కులకు ప్రధాన ప్రతిబంధకంగా భావించక తప్పదు. నిజానికి ఎన్నికల ముందే ఏ పదవీ లేకున్నా భార్యలపై భర్తల ఆజమాయిషీ ఇలా కొనసాగుతూ ఉంటే రేపు అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల్లో స్త్రీలు పెత్తనం మాత్రం పురుషులదే అవుతుందనే భావన నిజం కాక తప్పదనే గుసగుసలు ఊపందుకుంటున్నాయి. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలతో వారు దైనందిన జీవనంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపట్ల వ్యక్తిగత శ్రద్ధాసక్తులను ప్రదర్శించే చట్టపరమైన బాధ్యతను నెరవేర్చాల్సిన సర్పంచులు,యం.పి.టి.సిలు, జడ్.పి.టి.సిలు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు మహిళా అభ్యర్థులుగా ఎన్నికలలో విజేతలుగా ఆవిర్భవిస్తున్న నేపథ్యంలో కనీసం వారిని ఫోన్ ద్వారా నైనా సంప్రదించే అవకాశమే లేకుండా వారి భర్తలే ఆఫీస్ వ్యవహారాలను నడిపిస్తారేమోననే భావన ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో అక్కడక్కడా కొన్నికొన్ని



స్థానిక సంస్థల ప్రధాన కార్యాలయాల్లో అధికారంలో వున్న మహిళలకు తోడుగా వారికి కేటాయించిన గదుల్లోనే ప్రత్యేక సీట్లను ఏర్పాటు చేసుకుని సమాంతర అధికారాన్ని చలాయిస్తుండడం విస్తుగొలిపేదే. ఈ చర్యలకు కొనసాగింపుగా మహిళలు వార్డ్ మెంబర్లుగా, ఛైర్మన్‌లుగా ఎన్నికైనప్పటికీ వారి భర్తలే వార్డ్ మెంబర్లుగా, ఛైర్మన్‌లుగా వ్యవహరిస్తూ రాజ్యాంగేతర శక్తులుగా మారి పాలనను కొనసాగిస్తున్న వైనం దురదృష్టకరమే. గతంలో గ్రామ సభల్లో, మండల స్థాయి సమావేశాలలో, కొన్నికొన్ని మున్సిపాలిటీల్లో రాజకీయ నేతల ఒత్తిళ్లతోనో,అధికారుల అలసత్వం లేదా పర్యవేక్షణ లోపం ఫలితంగానో గాని ఆయా అధికారిక సభలూ, సమావేశాల్లో భార్యల తరపున భర్తలే పాల్గొన్న ఉదంతాలు వంద శాతం రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనగా భావించక తప్పదు. నిన్నటికి నిన్న మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాల ప్రకటనల తర్వాత అందులో విజయం సాధించిన మహిళా అభ్యర్థులను అభినందించే క్రమంలో అధికార, విపక్ష శాసన సభ్యులతోపాటు మంత్రులు తదితర బడాబడా రాజకీయ నాయకులు సైతం అసలు విజేతలైన మహిళలను అలక్ష్యం చేస్తూ వారిభర్తలే గెలిచినట్లుగా వారినే హీరోలుగా వర్ణిస్తూ అభినందిస్తున్న వైనం మహిళల స్వతంత్రత, సాధికారతకు ఇబ్బందిని కలిగించేదేననే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. నేటికీ మనుస్మృతి ఆధిపత్యం చేస్తున్న భారతీయ సమాజంలో కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాతా,శయనేషు రంభా అనే ఆర్యోక్తిని తిరగ రాస్తూ అత్యున్నత విద్యా సముపార్జనతో ఉద్యోగ ప్రస్తానంలో కొనసాగుతున్న నేపథ్యంలో వివిధ కార్యాలయాల్లో, కార్ఖానాల్లో ఎదురౌతున్న అనేక అవరోధాలకు, అమానవీయ వేధింపులకు ఎదురొడ్డి అప్రతిహతంగా ముందుకు సాగుతున్న మహిళలు స్థానిక సంస్థల పాలనా వ్యవహారాలను నడిపించలేమనే భావంలోకి నెట్టి వేయబడడానికి కారణం పురుషాధిక్య భావజాలపు ఒత్తిళ్లా ? లేదా మహిళలకు తమ సామర్థ్యంపై తమకు విశ్వాసం లేని ఆత్మన్యూనత భావమా? అనేది తేల్చు కోవాల్సిన బాధ్యత నిస్సందేహంగా మహిళా లోకానిదేనని చెప్పక తప్పదు. నిజానికి కుటుంబ పరమైన పెళ్లిళ్లు, పేరంటాలు, గృహ ప్రవేశాలు, నామకరణ మహోత్సవాలూ, తదితర వివిధ శుభ కార్యాల నేపథ్యంలో అచ్చు వేసి పంపిణీ చేసేఆహ్వాన పత్రికలలో భార్యలతో పాటు భర్తల ఫోటోలు సైతం ముద్రించే సాంప్రదాయాన్ని ,ఆచారాలను నేటి సమాజం ఆదరిస్తుండడం అభినందనీయమే. ఐతే రాజ్యాంగ నిబంధనల ప్రకారం జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు మహిళలైనప్పుడు వారికి జారీ చేసే బి.ఫామ్ మినహా వారిఎన్నికల ప్రచార సామగ్రిలో భాగంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లపై భర్తల ఫోటోలే ప్రముఖంగా కనపడుతుండడమే కాదు విజయోత్సవాలలోనూ మహిళలకు తోడుగా కాదు వారే విజేతలుగా ఎన్నికైనట్లు చేస్తున్న ప్రదర్శనలతో కొన్నికొన్ని సందర్భాల్లో వారే చట్టబద్ధంగా ఎన్నికైన భావన కలిగిస్తోంది. ఇదేదీ చాలదన్నట్లు కొన్ని టెలివిజన్ ఛానల్స్ గెలిచిన మహిళా విజేతలను మొక్కుబడిగా అభినందించి వారి భర్తలతో సుదీర్ఘ ఇంటర్వ్యూలు తీసుకుంటున్న వైనం ఎన్నికైన మహిళా ప్రతినిధులు భర్తల చాటు భార్యలే తప్ప స్వతంత్రంగా ప్రజా ప్రతినిధులుగా తమ తమ రాజ్యాంగ బద్ధమైన విధులను నిర్వహించలేరేమోననే అపోహను కలిగిస్తున్న భావన ప్రజలకు కలగక తప్పదు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే చట్ట బద్ధమైన రిజర్వేషన్లతో మహిళలకు ఒనగూడాల్సిన రాజకీయ ప్రయోజనాలు ఆచరణలో ప్రశ్నార్థకంగా మారి వారివారి భర్తలూ, కుటుంబంలోని పురుషులే అధికార కేంద్రాలుగా మారి రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన రాజకీయ అధికారాన్ని అనుభవించలేని ఉత్సవ విగ్రహాలుగా మహిళలు మిగిలిపోక తప్పదు. ఈ నేపథ్యంలో మహిళలు తమ ఉదాసీనతతో రాజ్యాంగేతర శక్తులుగా రూపాంతరం చెందుతున్న భర్తలతో, సోదరులతో, ఇతర పురుష కుటుంబ సభ్యుల జోక్యంతో తమ అస్థిత్వానికీ, సమానత్వ సాధనకు ఒనగూడుతున్న ప్రమాదాల బారి నుండి తమను తాము కాపాడుకుంటూ మేమూ పురుషులతో సమానమేనని నినదిస్తూ గెలిచి నిలుస్తారో లేదా మనుధర్మ స్మృతి మాయలోపడి పురుష ప్రపంచం నీడలోనే నిలిచి తరించే ద్వితీయ శ్రేణిపౌరులుగా తమ జీవితాలను కొనసాగిస్తారో రాబోయే కాలమే తేల్చిచెప్పాలి. •

# ప్రాణాలు పిండేస్తున్న నకిలీ వైద్యులు!

ఈ. శ్రీనివాస్ రావు

వైద్య వృత్తి ముసుగులో కొందరు మోసగాళ్లు అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అక్షరం ముక్క రాకపోయినా తెల్లకోటు తగిలించుకుని, మెడలో స్టెతస్కోపు వేసుకుని క్లినిక్‌లు నడుపుతున్న నకిలీ వైద్యుల ఘటనలు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. వైద్య విద్య లేకపోయినా వైద్యుడిగా నటించడం కేవలం చట్టవ్యతిరేక చర్య మాత్రమేకాదు, అది ప్రత్యక్షంగా ప్రాణహానికి దారితీసే నేరం. ఆంధ్రప్రదేశ్‌లోని సింగరాయకొండలో రక్తపరీక్ష కేంద్రం నిర్వహించే వ్యక్తి తనను తాను వైద్యుడిగా ప్రకటించుకుని నాలుగేళ్ల బాలుడికి చికిత్సపేరుతో ప్రాణాపాయం కలిగించిన సంఘటన ప్రజలను కలచివేసింది. అలాగే చిత్తూరు జిల్లాలో పదో తరగతి కూడా చదవని వ్యక్తులు క్లినిక్‌లు ప్రారంభించి అమాయకులను మోసం చేస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణలోని సూర్యాపేటలో నకిలీ వైద్యుల నిర్లక్ష్యంతో కొద్ది రోజుల్లోనే ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటనలు నమోదయ్యాయి. టెక్నీషియన్‌గా పనిచేసే వ్యక్తి వైద్యుడిగా నటించి గర్భిణీలపై అక్రమ శస్త్రచికిత్సలు చేయడం వంటి సంఘటనలు మరింత భయాందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లోనే అనుమతులు లేని వందలాది ఆసుపత్రులు నడుస్తున్నాయని అంచనాలు చెబుతున్నాయి. ఇవన్నీ కేవలం బయటపడిన సంఘటనలే కాని, లోతులో ఇంకా ఎన్నో ఉదంతాలు దాగి ఉన్నాయనే అనుమానం వ్యక్తమవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం భారతదేశంలో అల్లోపతి వైద్యులుగా చలామణీ అవుతున్న వారిలో సగానికి పైగా మందికి సరైన అర్హతలు లేవని వెల్లడైంది. వీరిలో గణనీయమైన శాతం కేవలం పాఠశాల విద్యతోనే సరిపెట్టుకున్నవారేనని అధ్యయనాలు చెబుతున్నాయి. భారతీయ వైద్య సంఘం అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో నకిలీ వైద్యులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. చికిత్స సమయంలో సంభవిస్తున్న మరణాల్లో గణనీయమైన శాతం ఈనకిలీ వైద్యుల నిర్లక్ష్యం అవగాహనలేమి కారణంగానే జరుగుతున్నట్లు వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. తెలంగాణలో రాష్ట్ర వైద్య మండలి గత కొంతకాలంలో వందలాది కేసులు నమోదు చేసినప్పటికీ, అర్హతలు లేని వేలాది మంది ఇంకా వైద్యం పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. ఉన్నత న్యాయస్థానం కూడా గతంలో నకిలీ వైద్యం సమాజానికి పెనుముప్పు అని హెచ్చరించినప్పటికీ, ఆ హెచ్చరికలు కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. నకిలీ వైద్యుల వల్ల కలిగే నష్టం కేవలం తక్షణ ప్రాణాపాయం మాత్రమే కాదు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తోంది. అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు ఇవ్వడం వల్ల శరీర నిరోధక శక్తి దెబ్బతింటోంది. మందులకు పనిచేయని వ్యాధులు పెరుగుతున్నాయి. చిన్న జ్వరమే ప్రాణాంతకంగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శస్త్ర చికిత్సల పేరిట అవగాహనలేని చర్యలు తీసుకుని రోగుల అవయవాలను దెబ్బతీయడం, శాశ్వత వైకల్యాలకు గురిచేయడంవంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా పేదలు, గ్రామీణులు, నగర పేదవర్గాలు తక్కువ ఖర్చుతో చికిత్స దొరుకుతుందనే నమ్మకంతో ఈ మోసగాళ్ల వద్దకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈసమస్యకు మూల కారణాలు అనేకం. చట్టాల అమలులో సమన్వయ లోపం, వైద్య మండలి, పోలీసు శాఖ, ఔషధ నియంత్రణ విభాగాల మధ్య సమర్థవంతమైన అనుసంధానం లేకపోవడం, తక్కువ శిక్షలు, అవినీతి ఆరోపణలు, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వైద్యుల కొరత వంటి అంశాలు నకిలీలకు అవకాశాలుగా మారుతున్నాయి. రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ పేరుతో కొందరు చట్టపరమైన సందిగ్ధతను ఉపయోగించుకుని అల్లోపతి వైద్యంచేయడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం అత్యవసరం. అనుమతులు లేని క్లినిక్‌లు, ఆసుపత్రులను గుర్తించి వెంటనే మూసివేయాలి. మోసం, ప్రజారోగ్యానికి హాని వంటి నేరాల కింద కఠిన శిక్షలు విధించి, బెయిల్ సులభంగా లభించని విధంగా చట్టాలను అమలు చేయాలి. ప్రతి వైద్యుడి నమోదు సంఖ్యను ప్రజలకు అందుబాటులో ఉంచి, రోగులు సులభంగా ధృవీకరించుకునే విధానాలను అమలు చేయాలి. ప్రజల్లో అవగాహన పెంపొందించి అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స పొందడం ప్రాణాపాయం అని స్పష్టంగా తెలియజేయాలి. మందుల దుర్వినియోగాన్ని నియంత్రించే కార్యక్రమాలు అమలు చేయాలి. స్వాతంత్ర్యం సాధించి దశాబ్దాలు గడిచినా, అర్హతలు లేని వారు వైద్యులుగా కొనసాగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ. వైద్యం ప్రాణరక్షణ మార్గం కావాలి గాని ప్రాణహానికర యమపాశం కాకూడదు. ప్రభుత్వాలు, వైద్యసంఘాలు,మీడియా, ప్రజలు అందరూ కలిసి ఈనకిలీ వైద్యుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి. ప్రజారోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, సమాజం కర్తవ్యం కూడా. •

# ఊడిగం చేస్తేనే ఉన్నత పదవులా?



ఎం. నారాయణ స్వామి

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఊడిగం తప్పదు. ప్రమోషన్లు, ఉన్నత పదవుల కోసం 'హుజూర్' అంటూ పోలీసు అధికారులు, ఉన్నతాధికారులు అధికార పార్టీ నేతలకు సేవలు చేస్తున్నారు. అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అధికార పార్టీ అన్యాయం కేసులకు న్యాయం చేస్తున్నారు. అధికార పార్టీ దుర్మార్గాలు, దౌర్జన్యాలను కవచంలా కాపాడుతూ ఆయా పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల మెప్పులను పొందుతున్నారు. ప్రమాదకరమైన కేసుల్లో కీలకమైన నాయకులు చిక్కుకుపోతే వారిని రక్షించి, ఆయా కేసులను తారుమారు చేసేస్తున్నారు. పాలించే నేతల ఆదేశాల ప్రకారం కీలకమైన కేసులలో నిర్బంధించిన వారిపై చర్యలు తీసుకొంటున్నారు. ఇలాంటి దుస్థితి తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశంలోని మిగితా రాష్ట్రాల్లోనూ అలుముకొని ఉంది. పోలీసులు కఠినంగా, సమర్థంగా విధులను చేపట్టడం లేదని చెప్పడానికి ఇటీవల రాష్ట్రాలలో జరిగిన అనేక సంఘటనలే సాక్ష్యం.రాజకీయ దాడులు పెరిగాయి. పోలీసువ్యవస్థ కట్టుదిట్టమైన, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వలనే హింసా సంఘటనలు ఎక్కువయ్యాయి. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల అధినేతలు, ముఖ్యనాయకులు వారి కార్యకర్తలను రెచ్చగొట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఆతర్వాత ఆయా కార్యకర్తలు ఒకరి మీద ఒకరు కక్షలు పెంచుకుంటూ శత్రువులుగా మారిపోతున్నారు. అదను చూసుకొని ఘర్షణలకు దిగుతున్నారు. కొన్నిచోట్ల బాంబులతో దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారు. మారణాయుధాలతో హత్యలు చేస్తూ శాంతికి భంగం కలిగిస్తున్నారు. కొందరు పోలీసులు ఖద్దర్ల సేవలో తన్మయం చెందుతున్నారు. విధినిర్వహణలు చేపట్టే ముందు ఖాకీలు చేసిన వాగ్దానాలన్నిటినీ వాకిట్లో మూటకట్టి, చట్ట వ్యతిరేకులతో చేతులు కలిపి నోట్లకట్టల మూటలను కట్టుకుంటున్నారు. దోషులతో దోస్తీ చేస్తూ, నిర్దోషులను నిలువునా ముంచేస్తున్నారు. పాలించే వారి అడుగులకు మడుగులు ఒత్తుతూ అధికారాన్ని కాపాడుకుంటున్నారు. సమాజ శ్రేయస్సుకన్నా ప్రజాప్రతినిధులే మిన్న అన్న పంథాలో ఖాకీలు పయనిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పోలీసులకు ఊడిగం తప్పదు. నేరగాళ్లపై ఉక్కుపాదం మోపి, ప్రజల మాన, ధన, ప్రాణాలను కాపాడవలసిన పోలీసువ్యవస్థ అధికారి పార్టీ గుప్పిట్లోనలిగిపోతుంది. కింది స్థాయి అధికారుల నుంచి పై స్థాయి అధికారుల వరకు



వారి నైతిక విలువలనునేలమట్టం చేసి అధికార పార్టీ కనుసైగల్లో మెలుగుతూ పరిపాలన వ్యవహారాలను సాగిస్తున్నారు. లక్షలు ఖర్చు చేస్తే చాలు రోజులు తిరక్కముందే సివిల్ కేసులు పరిష్కారం అవుతున్నాయి. నెలలు, సంవత్సరాలు తరబడి చెప్పులుఅరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా అమాయాకుల కేసులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంటున్నాయి. ప్రజాప్రతి నిధులకు తలవంచకుండా, విధినిర్వహణలను పటిష్టంగా నిర్వహించాలి. ప్రజలకు అండగా నిలబడాలనుకున్న నిజాయితీ గల అధికారులను ప్రాముఖ్యత లేని విభాగాలకు బదిలీచేసి,వారి సేవలను తొక్కిస్తున్నారు.అధికార పార్టీ అస్తవ్యస్త పరిపాలన నచ్చక స్వచ్ఛందంగా రాజీనామాచేసిన ఐఎస్, ఐపిఎస్‌లు లేకపోలేదు. ఎన్నికలలో అధికారంలో ఉన్నపార్టీయే తిరిగి అధికారంలోకి వస్తే విధులునిర్వహించే పోలీసు ఉన్నతాధికారులు, అధికారులకు ఢోకా ఉండదు. వేరే పార్టీ అధికారంలోకి వస్తేనే ఇబ్బందులు ఎదురవు తాయి. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు పర్యాయాలు (2014,2018) జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తిరిగి టిఆర్ఎస్ విజయదుందుభి మోగించి అధికారం చేజిక్కించు కోవడంతో పోలీసు అధికారులు, ఉన్నతాధికారులు యధా విధంగా విధులను కొనసాగించారు.వీరిలో కొంతమందిని కీలకమైన విభాగాలకు బదిలీచేసి నియమించారు. మరికొందరికి కోరుకున్న విభాగాలకు బదిలీ చేసారు. 2023 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బిఆర్ఎస్ ప్రభుత్వానికి 'హుజూర్' అన్న వారందరి పైన వేటుపడింది. కాంగ్రెస్‌కు జై కొట్టిన వారందరికి అవకాశా లు లభించాయి. 2014 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగు దేశం పార్టీలో విధులు నిర్వహించిన అధికారులను 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ సిపి ఆయా అధికారులను ప్రాముఖ్యత లేని విభాగాలలో నియమించి వారికి (వైఎస్ ఆర్ సిపి)మద్దతు ఇచ్చిన అధికారులను అందలం ఎక్కించారు.2024సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో తిరిగి తెలుగు దేశం పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. కీలకమైన, ముఖ్యమైన విభాగాలలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు జిల్లా,డివిజన్లలో విధులు నిర్వహిస్తున్న అధికారులను బదలీ చేసి విఆర్‌లో ఉంచింది.దాదాపు 200 మంది కింద స్థాయి అధికారి నుంచి ఐపీఎస్ అధికారి వరకు పోస్టింగ్ ఇవ్వలేదు. సంవత్సరం తరువాత 140మంది అధికారులకు ప్రాముఖ్యత లేని విభాగాలకు బదలీ చేసి నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న మరో 60మంది డిఎస్పి, అదనపు ఎస్‌పిలను నియమించవలసి ఉంది. •

(రచయిత : సీనియర్ జర్నలిస్ట్)

# ఏఐ సదస్సుతో విప్లవాత్మక మార్పులు



## మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** భారత సాంకేతిక రంగ అభివృద్ధిలో కృత్రిమమేధ ఇంపాక్ట్ సదస్సు ఒక కీలకమలుపు అని ప్రధానిమోడీ అన్నారు. ఈ సదస్సులో తాను ప్రపంచస్థాయి టెక్ లీడర్స్, సీఈఓలను కలుసుకున్నట్టు తెలిపారు. భారత్‌లో జరుగుతున్న అనేక ఆసక్తికర సాంకేతిక అంశాల గురించి వారికి వివరించానని అన్నారు. పశు పోషణ, వ్యవసాయ రంగంలో ఏఐ సాంకేతికతను ఎలా ఉపయోగిస్తున్నదీ వివరించానని, ఏఐతో రైతులు తమ పశు సంపద, పంటలను నిరంతరం ఓ కంట కనిపెట్టుకుని ఉండగలుగుతున్నారని తెలిపారు. భారత తయారీదార్లు, స్టార్టప్ సంస్థలు నాణ్యమైన వస్తువుల తయారీపై దృష్టిపెట్టాలని అన్నారు. వంకపెట్టడానికి వీలులేని వస్తుసేవలతో అంతర్జాతీయ స్థాయిలో గౌరవమన్ననలను పొందాలని సూచించారు. నెలవారీ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. సృజనాత్మకతకు కేంద్రంగా దేశాన్ని నిలపాలని తెలిపారు. భారతీయ యువత, ఇన్నోవేటర్స్, వ్యాపారవేత్తలకు ఆ శక్తి ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. అవయవ దానానికి ముందుకొచ్చే వారిపై కూడా ప్రధాని ప్రశంసలు కురిపించారు. ఇటీవల మరణించిన కేరళ చిన్నారి అలిన్ షెరిన్ అబ్రహామ్‌ను గుర్తు చేశారు. మరణించిన తమ బిడ్డ అవయవాలతో ఇతరులకు ప్రాణదానం చేసేందుకు అలిన్ తల్లి దండ్రులను అభినందించారు. 10 నెలల వయసున్న అలిన్ ఇటీవల జరిగిన యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలపాలై కన్నుమూసిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు ఆమె అవయవదానానికి అంగీకరించడంతో దేశంలోనే అత్యంత పిన్న వయసు అవయవదాతగా అలిన్ నిలిచింది. వలస సంస్కృతి, విద్వేషాలు వదిలిపెట్టి భారతీయత వైపు మళ్లాలని ప్రధాని మోడీ తన ప్రసంగంలో సూచించారు. గతంలో ఎర్ర కోట వద్ద తను చేసిన ఆజాదీ కీ అమృత్ మహోత్సవ్ ప్రసంగాన్ని గుర్తు చేశారు. బానిస మనస్తత్వాన్ని వీడి ఆలోచనల్లో స్వతంత్రతను సాధించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ అక్షరాస్యత, సైబర్ సెక్యూరిటీ ఆవశ్యకత గురించి కూడా ప్రధాని పేర్కొన్నారు. డిజిటల్ వేదికల వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అంశాలపై అవగాహన పెరుగుతున్నా ఆన్‌లైన్ మోసాలు ఎక్కువవుతున్న వైనంపై ప్రజలను అప్రమత్తం చేశారు. కేవైసీ నిబంధనలు, ఇతర డిజిటల్ అంశాల గురించి అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఏఐఏడీఎంకే దివంగత నేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితను కూడా ప్రధాని మంత్రి ప్రశంసించారు. ఈనెల 24న జయలలిత జయంతి నేపథ్యంలో ఆమెకు నివాళులు అర్పించారు. ఆమె తన జీవితాన్ని ప్రజాక్షేమానికి అంకితం చేశారని అన్నారు. తమిళనాడు ప్రజల మనసుల్లో ఆమె చిరస్థాయిగా నిలిచిపోయారని కీర్తించారు.

# భారత్-యుఎస్ వాణిజ్య చర్చలకు బ్రేక్

## వాషింగ్టన్ భేటీ వాయిదా!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 22:** భారత్, అమెరికా దేశాల మధ్య కుదరాల్సిన అత్యంత కీలకమైన వాణిజ్య ఒప్పందంపై ప్రస్తుతానికి నీలినీడలు కమ్ముకున్నాయి. వాషింగ్టనన వేదికగా ఈ నెల 23 నుంచి మూడు రోజులపాటు జరగాల్సిన ఇరు దేశాల ప్రధాన చర్చాకర్తల సమావేశం అర్థాంతరంగా వాయిదా పడింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను ఓ కొలిక్కి తెచ్చి, లీగల్ డ్రాఫ్ట్‌ను సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరగాల్సి ఉండగా అనూహ్య పరిణామాల నేపథ్యంలో దీనిని రీషెడ్యూల్ చేశారు.

**వాయిదా వెనుక అసలు కారణం ఏమిటి?**

పిటిఐ నివేదికల ప్రకారం.. ఈ భేటీ వాయిదా పడటానికి ప్రధాన కారణం అమెరికాలో వేగంగా మారుతున్న వాణిజ్య విధానాలేనని తెలుస్తోంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 'రెసిప్రోకల్ టారిఫ్' విధానంపై అక్కడి సుప్రీంకోర్టులో ప్రతికూల తీర్పు రావడంతో ఈ చర్చల దిశను మార్చివేసింది. తాజా రాజకీయ, న్యాయపరమైన పరిణామాలు.. వాటి వల్ల కలిగే ఆర్థిక ప్రభావాలను లోతుగా విశ్లేషించడానికి ఇరు దేశాలకు మరింత సమయంల అవసరమని చర్చాకర్తలు భావించారు. ఈ నేపథ్యంలోనే పరస్పర అంగీకారంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు సమాచారం.

**ట్రంప్ టారిఫ్ నిరణయాల సెగ**

అమెరికా సుప్రీంకోర్టు తీర్పు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి బిగ్ షాక్ ఇచ్చింది. సుంకాల విధింపుపై కోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో, అధ్యక్షుడు ట్రంప్ వెంటనే అప్రమత్తమయ్యారు. సెక్షన్ 122ను ఉపయోగించి భారత్ సహా ప్రపంచ దేశాలన్నింటిపై మొదట 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆ నిర్ణయం తీసుకునన 24 గంటల వ్యవధిలోనే ఆ పన్నును ఏకంగా 15 శాతానికి పెంచుతూ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ అనూహ్య మార్పుల వల్ల భారత్ నుంచి జరిగే ఎగుమ తులపై భారీ భారం పడే అవకాశం ఉండటంతో, చర్చల కొనసాగింపునకు ముందు వ్యూహాత్మక విశ్లేషణ అవసరమని భారత బృందం భావిస్తోంది.



**మార్చి ఒప్పందంపై నీలినీడలు**

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ గతంలో వెల్లడించిన ప్రకారం ఈ కీలక వాణిజ్య ఒప్పందంపూ మార్చి నెలలో సంతకాలు జరగాల్సి ఉంది. ఏప్రిల్ నుంచి ఈ ఒప్పందాన్ని అమలులోకి తేవాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే తాజా పరిస్థితులు, వాషింగ్టన్ భేటీ వాయిదా పడటంతో ఈ గడుబు మారుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది. లీగల్ డ్రాఫ్ట్ పూర్తి కాకపోతే ఒప్పందం కుదరడం కష్టమౌతుంది. ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న కొత్త టారిఫ్ నిబంధనలను భారత్ ఏవిధంగా ఎదుర్కోబోతుది? ఈ ఒప్పందం ద్వారా భారత్ పొందే ప్రయోజనాలు ఏమిటి? అనే అంశాలపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

# అందుబాటులోకి ఆర్‌ఆర్‌టిఎస్



## రూ.12వేలకోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని మోడీ

**మీరట్, ఫిబ్రవరి 22:** దేశంలోనే తొలిసారిగా రూపొందిన నమో భారత్ రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్‌ఆర్‌టీఎస్)ను ప్రధాని మోడీ ఆదివారం ప్రారంభించారు. ఉత్తర ప్రదేశ‌లోని మీరట్‌లో ఇది అందుబాటులోకి వచ్చింది. ఈ కారిడార్ మొత్తం పొడవు 82 కిలోమీటర్లు. అంటే 82 కి.మీ. దూరాన్ని 45 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఇది దేశ రాజధాని ఢిల్లీని, సమీపంలోని ఇతర ప్రధాన నగరాలను కలుపుతుంది. ఈ రైలు మార్గం ద్వారా ఘజియాబాద్, సహీబాబాద్, మోదీనగర్, మీరట్‌ను అత్యంత వేగంగా చేరుకోవచ్చు. దీని ద్వారా ఆయా మార్గాల్లో కాలుష్య రహిత, ట్రాఫిక్ రహిత రవాణా సౌకర్యం కలగనుంది. ఢిల్లీమీరట్‌లోని ఈ రైలు మార్గం నిర్మాణానికి రూ.30,274 కోట్లు ఖర్చైంది. ఇది దేశంలోని తొలి ఆర్‌ఆర్‌టీఎస్ మార్గం. ఈ రైలు మార్గంలో 180 కిలోమీటర్ల వేగంతో రైలు ప్రయాణిస్తుంది. ఆర్‌ఆర్‌టీఎస్‌తోపాటు మీరట్ మెట్రో రైలును కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది దక్షిణ మీరట్ నుంచి మోదీపురం మధ్య నడుస్తుంది. ఇది కూడా అత్యం వేగవంతమైన రైలు. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. సౌత్ మీరట్ స్టేషన్ నుంచి మోదీపురం స్టేషన్ వరకు 23 కిలోమీటర్ల దూరాన్ని 30 నిమిషాల్లోపే చేరుకుంటుంది. ఈ రైలు సేవలు నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి అందుబాటులోకి వస్తాయి. నమో భారత్, మీరట్ మెట్రో ఒకే స్టేషన్ సంబంధిత సేవల్ని వాడుకుంటాయి. మెట్రోను ప్రారంభించిన అనంతరం ప్రధాని మోడీ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. ఢిల్లీమీరట్ మెట్రో సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రతి 10 నిమిషాలకో ట్రైన్ నడుస్తుంది. ప్రస్తుతం మాత్రం ప్రతి 15 నిమిషాలకు ఒక ట్రైన్ నడుస్తుంది. నమో భారత్, మెట్రో రైలుతోపాటు రూ.12,390 కోట్ల విలువైన ప్రాజెక్టుల్ని ప్రధాని మోడీప్రారంభించారు. రైలు సర్వీసులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్, అభివృద్ధి భారత్ దిశగా నూతన విప్లవం ఈరోజు ఊపందుకుందని, తొలిసారి ఒకే ఫ్లాట్‌ఫాం నుంచి ఒకేరోజు నమో భారత్ ర్యాపిడ్ రైలు, మెట్రో రైలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పనితీరు తనకెంతో సంతృప్తి నిచ్చిందని, బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం పని సంస్కృతిని ఇవాల్టి కార్యక్రమం ప్రతిబింబిస్తుందని చెప్పారు. శంకుస్థాపన రాయి పడినప్పటి నుంచి రేయింబవళ్లు పనిచేసి ప్రాజెక్టును పూర్తి చేయడమే తమ వర్క్ కల్చర్ అని వివరించారు. మెట్రోలో ప్రయాణం అనంతరం మొహియిద్దీన్‌పూర్‌కు మోదీ వెళ్లారు. అక్కడి బహిరంగసభలో పాల్గొన్నారు. పశ్చిమ యూపీలో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, ప్రజాపనులకు సంబంధించి రూ.12,930 కోట్ల విలువచేసే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు.

# పెళ్లిపీటలెక్కాల్సిన అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య

## జోధ్‌పూర్‌లో విషాదం నింపిన వివాహ వేదిక



**జోద్‌పూర్, ఫిబ్రవరి 22:** కొన్నిగంటలాగితే పెళ్లి కుమార్తెలుగా ఒకే వేదికపై కూర్చోవాల్సిన అక్కాచెల్లెళ్లు ఇదరూ ఆత్మహత్యచేసుకోవడంతో పెళ్లికి వచ్చిన బంధువులు కూడా కన్నీటి పర్యంతం అయ్యారు. రాజస్థాన్ రాష్ట్రం జోధ్ పూర్ జిల్లాలోని మనాయ్ గ్రామంలో గుండెను పిండేసే ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యలకు పాల్పడ్డ పెళ్లి కుమార్తెలు శోభ (25), విమ్లు (23) ఇద్దరూ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్లుగా పనిచేస్తున్నారు. శనివారం వారి పెళ్లిళ్లు జరగాల్సి ఉండటంతో శుక్రవారం అర్ధరాత్రి వరకు ఇంట్లో పెళ్లి వేడుకలు, సంప్రదాయ బంధోలి కార్యక్రమం సందడిగా సాగాయి. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరూ పురుగుల మందు సేవించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే వారు మరణించినట్లు ప్రకటించారు. దాంతో మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. కానీ ఇంతలో మృతుల మేనమామ జస్వంత్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి అంత్యక్రియలను నిలిపేశారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యం జరిగి ఉంటే అంత్యక్రియలు పూర్తయ్యేవని జస్వంత్ సింగ్ చెప్పారు. మృతదేహాలు నీలి రంగులోకి మారాయని, ఇది విష ప్రయోగంవల్ల జరిగిన ఆత్మహత్యేనని మృతుల మేనమామ ఆరోపించారు. బాధితుల బాబాయ్‌లు, ఈ పెళ్లిళ్ల విషయంలో తీవ్ర ఒత్తిడి తెచ్చారని, మొదట కుదిరిన పెళ్లి సంబంధాలను రద్దుచేసి, బాబాయ్‌ల ఒత్తిడి మేరకు పోఖ్రాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పెళ్లిళ్లు నిశ్చయించారని చెప్పారు. ఈ బలవంతపు పెళ్లి ఇష్టంలేకనే తన మేనకోడళ్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోస్టుమార్టంలో వారి మరణానికి పురుగుల మందే కారణమని తేలింది. వారు పురుగుల మందు తాగినట్లుగా ఆధారాలు లభించాయి. ఘటనా స్థలంలో ఎలాంటి ఆత్మహత్య లేఖ లభించలేదు. దీనిపై కుటుంబ సభ్యులందరినీ విచారిస్తున్నామని ఏడీసీపీ రోషన్ మీనా తెలిపారు.



# కిష్త్‌వార్‌లో ఎన్‌కౌంటర్: ఇద్దరు ఉగ్రవాదుల మృతి

**శ్రీనగర్, ఫిబ్రవరి 22:** జమ్మూకాశ్మీర్‌లోని కిష్త్‌వార్ జిల్లాలో ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. తీవ్రవాదుల నుంచి రెండు ఏకే47 రైఫిళ్లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. జమ్మూకాశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లా ప్రాంతంలో ఇద్దరు ఉగ్రవాదులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందింది. దీంతో ఆపరేషన్ ట్రాష్‌ఐ పేరుతో భారత భద్రతా బలగాలు వేట మొదలుపెట్టాయి. ఇందులో భాగంగా ఇక్కడి చాత్రూ ప్రాంతంలో దాక్కున్న ఉగ్రవాదుల కోసం జమ్మూకాశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఐబీ దళాలు కలిసి సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించాయి. మంచుతో నిండిన ఈ అటవీ ప్రాంతాన్ని బలగాలు చుట్టుముట్టాయి. పర్వత ప్రాంతంలోని ఒక మట్టి ఇంటిలో దాక్కున్న ఉగ్రవాదుల్ని ఉదయం 11 గంటల సమయంలో గుర్తించారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు మన బలగాలపై కాల్పులు జరిపారు. దీంతో మన బలగాలు ఎదురు కాల్పులు ప్రారంభించాయి. కొంతసేపటి తర్వాత కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల స్థావరం నుంచి రెండు ఏకే47 తుపాకులు, అలాగే కొంత యుద్ధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. చాత్రూ ప్రాంతంలో ఇటీ వలఉగ్రవాదుల కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. గత నెలలో ఆరుకుపైగా ఎన్‌కౌంటర్లుజరిగాయి. లష్కరే తొయిబా దేశంలో దాడులకు కుట్రపన్నిందన్న సమాచారం నేపథ్యంలో భారత భద్రతా దళాలు మరింత అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో భద్రతను కట్టు దిట్టం చేసి, తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# కుమ్మరి కుటుంబానికి రూ.1.25 కోట్ల జీఎస్టీ నోటీసు

**రాయ్‌బరేలీ, ఫిబ్రవరి 22:** ఉత్తరప్రదేశ్‌లోని రాయ్ బరేలీలో ఓ నిరుపేద కుమ్మరి కుటుంబానికి ఊహించని షాక్‌కు ఎదురైంది. మట్టి కుండలు అమ్ముకుంటూ జీవనం సాగించే మహమ్మద్ సయీద్‌కు, జీఎస్టీ విభాగం ఏకంగా రూ.1.25 కోట్ల పన్ను చెల్లించాలంటూ నోటీసులు పంపింది. రాయ్‌బరేలీ జిల్లా హర్‌చంద్‌పూర్ వాసి అయిన సయీద్, తన ఐదుగురు కుటుంబ సభ్యులను పోషించుకోవడానికి రోజంతా కష్టపడేవాడు. కొన్ని సంవత్సరాల క్రితం రుణం కోసం ప్రయత్నించినప్పుడు, ఓ వ్యక్తి ఆయన నుంచి పాన్, ఆధార్ కార్డులు తీసుకున్నాడు. అయితే లోన్ మంజూరు కాలేదు, ఆ పత్రాలు కూడా తిరిగి రాలేదు. ఇదే అదనుగా భావించిన కొందరు మోసగాళ్లు, ఆ పత్రాలను ఉపయోగించి



సయీద్ పేరు మీద బీహార్‌లోని పాట్నాలో నాలుగు కంపెనీలను రిజిస్టర్ చేసి, కోట్ల రూపాయల లావాదేవీలు నడిపారు. నిజానికి ఆరు నెలల క్రితమే జీఎస్టీ శాఖ నుంచి తొలి నోటీసు వచ్చింది. నిరక్షరాస్యుడైన సయీద్ దానిని పెద్దగా పట్టించుకోలేదు. ఈనెల 15న రెండోసారి నోటీసు రావడంతో, అనుమానంతో ఇతరులతో చదివించగా అసలు విషయం బయటపడింది. రూ.1.25 కోట్ల పన్ను బకాయి ఉందని తెలియగానే ఆ కుటుంబం కుప్పకూలిపోయింది. ఈ అన్యాయంపై న్యాయం చేయాలని కోరుతూ సయీద్ తన కుమారులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా అధికారులు, సయీద్ పత్రాలు దుర్వినియోగం అయినట్లు ప్రాథమికంగా గుర్తించి, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఇలాంటి మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలు తమ ఆధార్, పాన్ కార్డుల వివరాలను అపరిచితులకు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.




# ఆఫ్ఘన్ సరిహద్దుల్లో పాక్‌దాడులు

## డజన్లకొద్దీ అమాయక పౌరులు మృతిచెందారన్న ఆఫ్ఘన్

### తగిన సమయంలో ప్రతీకారం తప్పదని పాకిస్థాన్‌కు హెచ్చరిక

**కాబూల్, ఫిబ్రవరి 22:** ఉగ్రవాదులే లక్ష్యంగా దాడులుచేసామని చెపుతూ ఆఫ్ఘనిస్తాన్ పై పాకిస్తాన్ దాడులకుతెగబడింది. పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలువురు ఆఫ్ఘన్ పౌరులు మృతిచెందారు. తమ దేశంలో జరిగిన ఆత్మాహుతి దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు నిర్వహించినట్లు పాకిస్తాన్ పేర్కొన్నది. నంగర్హార్, పాక్తికా ప్రావిన్స్‌లలో అర్ధరాత్రి దాటాక ఈ దాడులు జరిగాయి. తమ పౌరుల నివాసాలపై పాకిస్తాన్ బాంబులతో దాడి చేసిందని, ఈ ఘటనలో డజన్ల కొద్దీ చనిపోయారని ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ చెప్పారు. గాయపడిన వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనను పాకిస్తాన్ ధ్రువీకరించింది. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఏడు టెర్రరిస్ట్ క్యాంపులపై దాడులు చేపట్టినట్లు ఆ దేశ సమాచారశాఖ మంత్రి తరార్ ఎక్స్‌లో పోస్టు చేశారు. పాకిస్తానీ తాలిబన్, దాని అనుబంధ సంస్థల లక్ష్యంగా చేసినట్లు తెలిపారు. ఐసిస్ అనుబంధ గ్రూప్‌పై సైతం దాడి చేసినట్లు తరార్ పేర్కొన్నారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో మసీద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిని తామే చేసినట్లు ఐసిస్ ప్రకటించుకుంది. ఈ ఘటనలో 31 మంది పాక్ పౌరులు మృతి చెందగా, 161 మంది గాయపడ్డారు. పాక్ వైమానిక దాడులు జరపడంపై ఆఫ్ఘనిస్తాన్ ఆగ్రహావేశాలు వ్యక్తంచేసింది. తగిన సమయంలో ప్రతీకారం తీర్చుకుంటామని తాజాగా హెచ్చరించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో దాక్కున్న ఉగ్రవాదులను తాము టార్గెట్ చేశామని పాక్ ప్రకటించుకుంది. పాక్ ఎదుర్కొంటున్న అంతర్గత సవాళ్లను ఈ దాడులతో కప్పిపుచ్చలేరని వ్యాఖ్యానించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో జాతీయ సంస్థలు, ప్రార్థనా కేంద్రాలపై జరిగిన ఈ దాడులు పాక్ నిఘా, భద్రతా వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. తగిన సమయంలో దీటుగా జవాబు చెబుతామని హెచ్చరించింది. అంతర్జాతీయ చట్టాలను పాక్ ఉల్లంఘించిందని మండిపడింది. పొరుగుతో సఖ్యతగా ఉండాలన్న కనీస ఇస్లామిక్ విలువలను నిలుపుకోలేకపోయిందని మండిపడింది. నన్‌గర్హర్, పక్తికా ప్రావిన్స్‌ల్లో జరిగిన ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా డజన్ల కొద్ది సాధారణ పౌరులు కన్నుమూశారని తెలిపింది. తమ దేశ ప్రాదేశిక సమగ్రత, ప్రజల భద్రత పరిరక్షణే తమ తొలి ప్రాధాన్యమని అఫ్ఘానిస్థాన్ రక్షణ శాఖ ఎక్స్ వేదికగా పేర్కొంది. అది తమ చట్టబద్ధ బాధ్యత అని పేర్కొంది. కాబట్టి, తగిన సమయంలో, తగిన రీతిలో దీటుగా బదులిస్తామని వ్యాఖ్యానించింది. తమ భూభాగంలో జరిగిన పలు ఆత్మాహుతి దాడుల వెనక అఫ్ఘానిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర శక్తులు ఉన్నాయని పాక్ ఆరోపిస్తుంటే తాలిబాన్లు మాత్రం పాక్ ఆరోపణలను ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతున్నారు. తమ భూభాగంలో ఉగ్రకార్యకలాపాలకు స్థానం లేదని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు: 10 మంది మృతి, 50 మందికి గాయాలు



**బీరూట్, ఫిబ్రవరి 22:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. లెబనాన్‌లోని బెకా లోయ లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడిలో ఓ సీనియర్ హిజ్బుల్లా ఫీల్డ్ కమాండర్‌తో సహా 10 మంది మరణించారు. మరో 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. నవంబర్ 2024లో రెండు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత జరిగిన అతిపెద్దదాడి ఇదే కావడం గమనార్హం. కాగా ఈ ఘటనపై లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పం దించింది. మృతుల్లో సాధారణ పౌరులు కూడా ఉన్నారని, గాయపడిన వారిలో చిన్నారులు ఉన్నారని తెలిపింది. మరణించిన 10మందిలో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు కొన్ని నివేదికలు పేర్కొం టున్నాయి. ఈ దాడితో బెకా లోయ ప్రాంతం శోక సంద్రంలో మునిగిపోయింది. మరోవైపు ఈ దాడిని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. తమపై దాడి చేసేందుకు హిజ్బుల్లా సన్నాహాలు చేస్తున్నట్లు కచ్చితమైన సమాచారం అందడంతోనే ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. బెకా లోయలోని హిజ్బుల్లా కమాండ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఈ ఘటనపై హిజ్బుల్లా వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తాజా పరిణామంతో ఇరుదేశాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# సంక్షిప్తంగా..

## రూ.5కోట్ల విదేశీ సిగరెట్లు స్వాధీనం



**అహ్మదాబాద్, ఫిబ్రవరి 22:** భారత జలాల్లోకి ప్రవేశించిన ఒక ఇరాన్ బోటును భారత కోస్ట్ గార్డ్ అడ్డు కున్నది. రూ.5 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నది. ఆ బోటులో ఉన్న నలుగురు ఇరాన్ పౌరులను అదుపులోకి తీసుకున్నది. గుజరాత్ తీరంలోని అరేబియా సముద్రంలో ఈ సం ఘటన జరిగింది. ఈనెల 21వ తేదీన ద్వారకాకు పశ్చిమాన సుమారు 115 నాటికల్ మైళ్ల దూరంలో అనుమానాస్పద విదేశీ పడవను భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది గుర్తించారు. షిప్‌లో ఆ బోటు వద్దకు చేరుకున్నారు. కాగా, భారత సముద్ర జలాల్లో ఉన్న ఆ బోటు ఇరాన్‌కు చెందినట్లు భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది తెలుసుకున్నారు. ఆ బోటులో 200 కార్టన్ల విదేశీ బ్రాండ్ సిగరెట్లు ఉన్నట్లు గుర్తించారు. రూ.5 కోట్ల విలువైన సుమారు లక్ష ప్యాకెట్ల విదేశీ బ్రాండ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

## కర్ణాటకలో 16యేళ్లలోపు మైనర్లకు మొబైల్‌ఫోన్లు బంద్!




**బెంగళూరు, ఫిబ్రవరి 22:** పిన్నవయసు పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారుతూ మానసిక అనా రోగ్యం కొనితెచ్చుకోవడంతోపాటు చదువులో రాణించలేకపోతున్నారని నిర్ణయించిన కర్ణాటక ప్రభుత్వం 16 ఏళ్లలోపు విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకాన్ని నిషేధించే ప్రణాళికను పరిశీలిస్తోంది. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల అభిప్రా యాన్ని కోరారు. విద్యార్థులలో సోషల్ మీడియా వ్యసనం, మాదకద్రవ్యాలకు గురయ్యే ప్రమాదం పెరు గుతున్నందున, ప్రభుత్వం ఈ చర్య తీసుకుంటోంది. ఆస్ట్రేలియా వంటి ఇతర దేశాల ఉదాహరణలను ఉటంకిస్తూ, విద్యార్థుల ప్రవర్తన, విద్య, మానసిక ఆరోగ్యంపై మొబైల్ ఫోన్ల ప్రభావం గురించి ముఖ్యమంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

## పోలీస్ వాహనాన్ని ఢీకొట్టిన ట్రక్కు: ఐదుగురు మృతి



**ఝార్సుగూడ(ఒడిశా), ఫిబ్రవరి 22:** ఒడిశాలోని ఝార్సుగూడ జిల్లా లో ఆదివారం తెల్లవారుజామున పెను విషాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై, ఝార్సుగూడ సదర్ పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీసులు ప్రయాణిస్తున్న బొలెరో వాహనాన్ని, వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు పోలీసులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడటంతో వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ట్రక్కు ఢీకొన్న వేగానికి బొలెరో వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రిలో చేర్పించారు. మరణించిన సిబ్బందిని సాయుధ పోలీస్ రిజర్వ్ కానిస్టేబుళ్లు కాశీరామ్ భోయ్, దేబేంద్ర సా, హవల్దార్ లింగరాజ్ ధరువా, సబ్‌ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కుజుర్, హోంగార్డు భక్త బంధు మిర్ధాగా గుర్తించారు.

## ఉత్తర చెన్నైనుంచి టివికె చీఫ్ విజయ్ పోటీ



**చెన్నై, ఫిబ్రవరి 22:** రాబోవు తమిళనాడు ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ కీలకంగా మార నుంది. తాజాగా తమిళనాడు ఎన్నికల్లో పోటీకి రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారు టీవీకే చీఫ్‌విజయ్ నార్త్ చెన్నై నుంచి పోటీకి విజయ్ రెడీ అయ్యారు. ఉత్తర చెన్నైలోని ఒక నియోజకవర్గం నుంచి విజయ్ పోటీ చేస్తారన్న టీవీకే ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. నార్త్ చెన్నై వెనుకబాటుకు డీఎంకేనే కారణమంటున్న విజయ్ పార్టీ ఇప్పటికే ఆరోపిస్తోంది. నార్త్ చెన్నైని స్టాలిన్ ప్రభుత్వం నిరక్ష్యం చేసిందని అక్కడి నుంచే తాము పోటీ చేయాలనుకుంటున్నట్లు పార్టీ నిర్ణయించుకుంది.

## ఆమెకు 28, ఆయనకు 60



**పాట్నా, ఫిబ్రవరి 22:**బీహార్‌లోని ఔరాయ్ ప్రాంతానికి చెందిన 60ఏళ్ల ప్రైవేట్ స్కూల్‌యజమానిరాకేష్‌షా, అదే పాఠశాలలో పనిచేస్తున్న 28 ఏళ్ల ఉపాధ్యాయురాలు షైస్తాపర్వీన్‌తో ప్రేమలోపడ్డారు. రహస్యంగా నేపాల్‌లోని ఒక ఆలయంలో వివాహంచేసుకున్నారు. ప్రస్తుతం వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# కూటమిలో చిచ్చు పెట్టాలని వైసిపి కుయుక్తులు

## లా అండ్ ఆర్డర్ దెబ్బతీయాలని ఆలోచన - శవ రాజకీయాలు

## జగన్‌కు కొత్త కాదు : ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్

**నరసాపురం ఫిబ్రవరి 22 ప్రభాతవార్త** :రాష్ట్రంలో సమాజాన్ని అస్థిర పరచాలని వైయస్సార్ పార్టీ నాయకులు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు విఫలయత్నం చేస్తున్నారని వారి కుయుక్తులు కూటమి ముందు సాగడం లేదని ఎంతకైనా తెగించి దిగజారుడు రాజకీయాలు నడుపుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ విమర్శించారు. ఆదివారం టిడిపి నాయకులు పి రామరాజు తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కూటమిలో చిచ్చు పెట్టడానికి వైకాపా నాయకులు చేయని ప్రయత్నం లేదని చేయని విమర్శలు లేవని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దెబ్బతీయాలని దుర్మార్గమైనటువంటి ఆలోచనతో వారు ఉన్నారని అయితే కూటమి నేతలు సమయమునతో అన్ని చూస్తున్నారన్నారు. గతంలో 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటి అహంకారంతో ఇప్పటికే వారు అదే ధోరణిలో కొనసాగుతున్నారని ఇది ఎంత మాత్రం సరికాదన్నారు. శాసనమండలిలో కలియుగ దైవం వెంకటేశ్వరుని యొక్క చిత్రపటాన్ని పట్టుకుని వారు చేసిన అరాచకం మొత్తం హిందూ సమాజం ముక్కున వేలేసుకున్నట్లు అయింది అన్నారు. వారి సంస్కారహీనమైన చర్యలు చూసి ప్రజలు తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. విశ్వ మానవాళి ఆరాధ్య దైవమైన వెంకటేశ్వరుని చిత్రపటానికి తీవ్రమైన అవమానాన్ని తెచ్చారని మండలిలో వారు చేసిన చర్యలు స్వామి వారిని క్షమాపణ కోరినా తీరదన్నారు. అంతటి హేయమైన దుశ్చర్యలకు పాల్పడ్డారని ఏ మతాన్ని అయినా గౌరవించాలని ఇటువంటి ఆలోచన జగన్మోహన్ రెడ్డి కానీ 11 మంది ఎమ్మెల్యేలు కానీ లేదన్నారు. లడ్డుకు సరఫరా చేసిన నెయ్యి విషయంలో తప్పులు చేసి బొంకుతున్నారని ఖచ్చితమైన ఆధారాలు ఉండి ముఖ్యులు ఆ తప్పును అంగీకరించిన జగన్ మాత్రం బొకా య్యేచటం విడ్డూరంగా ఉందన్నారు.



రాష్ట్రంలో వైసిపి డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతోందని ప్రజలు దీనిని గమనిస్తున్నారు. రాజ్యాంగబద్ధంగా ఎవరి మత విశ్వాసాలు వారికి ఉంటాయని కానీ రాజకీయ డిప్రెషన్ లో ఉన్న వైసీపీకి మాత్రం అది తెలియడం లేదన్నారు. సభలో వారి నడక తీరును ప్రజలు గమనించారన్నారు. కూటమి ప్రభుత్వంలో రాబోయే దశాబ్ద కాలం లో విడిపోయేది లేదని స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్ళడం ఖాయమన్నారు. గతంలో పోలవరం విషయంలో అనిల్ కానీ అంబటి కానీ ఏనాడేనా పోలవరం పూర్తి చేస్తామని చెప్పారా పోనీ చేసింది ప్రకటించారా అని ప్రశ్నించారు. ఇవాళ రాబోయే పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేస్తామని అమరావతికి రాజధాని శోభను తెస్తామని ధైర్యంగా చెప్పగలుగుతున్న నాయకులు చంద్రబాబు పవన్ కళ్యాణ్ అని అన్నారు. జగన్ పాలనలో అనేక పరిశ్రమలు వెళ్లి పోయాయని తిరిగి వాటిని తేవడంలో లోకేష్ చేస్తున్న కృషి ఎనలేనిది అన్నారు. ఏఐ టెక్నాలజీ క్వాంటం వ్యాలీ వంటి డిజిటల్ వ్యవస్థను రాష్ట్రానికి తేవడంలో చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఇవాళ ఐటీ దిగ్గజ సీఈఓ లు వచ్చి రాబోయే ఆంధ్రప్రదేశ్ను డిజిటల్ ప్రదేశ్ గా చూడగలమని ప్రకటించడమే అందుకు నిదర్శనం అన్నారు. జగన్ పాలన్లో కూల్చడం కేసులు పెట్టడం తప్ప ఏ అభివృద్ధి జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను నూరు శాతం అమలు చేస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటేనన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూడలేక వైకాపా నిరాధార ఆరోపణలు చేయడం మండలిలో హిందూ సమాజాన్ని అవమానపరిచేలా ప్రవర్తించడం ఎంత మాత్రం క్షమించరాదని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పి రామరాజు అన్నారు.

వైసీపీ అంటేనే పెద్ద అబద్దాల గుట్ట అని ఎద్దేవా చేశారు. హిందూ దేవుడంటే దేవాలయాలంటే వైసీపీ పార్టీకి ఏమాత్రం భయంగానే భక్తి కానీ లేవని వారికి కేవలం రాజకీయం ఒక్కటే అవసరం అన్నారు. లడ్డు నెయ్యి కుంభకోణంలోకి హెరిటేజ్ ను తేవాలని చూస్తున్నారని అందుకోసం చేయని కుతంత్రాలు లేవు అన్నారు.

బిజెపి రాష్ట్ర నాయకులు సీనియర్ న్యాయవాది గునిశెట్టి శ్రీనివాస్ వలవల నాని టిడిపి రాష్ట్ర నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ పట్టణ జనసేన అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు మాజీ మండల అధ్యక్షులు వాతాడి ఉమా కౌన్సిలర్లు జనసేన వీర మహిళలు టిడిపి నాయకులు పాల్గొన్నారు

## పెట్టుబడి వాతావరణానికి నష్టం కలిగించిన వ్యక్తి జగన్ : మంత్రి నారా లోకేష్

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్టుబడి వాతావరణానికి దేశంలో అత్యంత ఎక్కువ నష్టం చేసిన వ్యక్తి వైకాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ అని మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. అటువంటి వ్యక్తి ఇప్పుడు దేశ ప్రయోజనాల కోసం చింతిస్తున్నట్లు నటించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నిరసనలపై జగన్ ఆందోళన వ్యక్తం చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఎక్స్ వేదికగా శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడుల్ని అడ్డుకోవడానికి , పారిశ్రామికవేత్తల్ని బెదిరించడానికి గతంలో జగన్ చేసిన చర్యలని పలు సంఘటనల్ని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 2017 లో ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు భంగం కలిగించేందుకు ఎయిర్‌పోర్ట్ వద్ద ధర్నా చేశారు. 2019లో ప్రపంచ పెట్టుబడిదారులతో కుదుర్చుకున్న విద్యుత్తు ఒప్పందాల్ని రద్దు చేశారు. 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వం పెట్టుబడుల్ని అడ్డుకున్నారు. 2025లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిధుల సమీకరణను అడ్డుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లేఖ రాశారు. 2026లో ఏఐ సదస్సులో చోటుచేసుకున్న ఘటనపై ఆందోళన అంటూ ఆకస్మాత్తుగా నటిస్తున్నారు అని ఎద్దేవా చేశారు.

## పోలవరం నిర్మాణ పనులు 81.45% పూర్తి :కేంద్ర జలశక్తి శాఖ

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు 2025 అక్టోబరు నాటికి 81.45% పూర్తయినట్లు కేంద్ర జలశక్తి శాఖ వార్షిక నివేదిక వెల్లడించింది. భూసేకరణ, సహాయ, పునరావాస కల్పన 27.40% చేసినట్లు తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణ పనులు, భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలను కలిపి చూస్తే ఓవరాల్‌గా 60.40% పూర్తయినట్లు పేర్కొంది.

ఈ వార్షిక లెక్కల ప్రకారం ఏడాదిలో ప్రాజెక్టు ఓవరాల్ పనుల్లో 6.94% మే పురోగతి నమోదైంది. ఇందులో నిర్మాణ పనుల్లో 4.66% సహాయ-పునరావాసంలో 4.82% వృద్ధి కనిపించింది. ప్రాజెక్టులో తొలిదశ కింద ముంపునకు గురయ్యే కుటుంబాలు 38,060 మేర ఉండగా ఇప్పటివరకు 14,371 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గతేడాది కాలంలో కొత్తగా 1,574 కుటుంబాలను ముంపు ప్రాంతం నుంచి తరలించినట్లు వార్షిక లెక్కలు వెల్లడించాయి. ఇంకా 23,689 కుటుంబాలను తరలించాల్సి ఉంది. 2025 డిసెంబరు నాటికి మట్టి పనులు 90.20% కాంక్రీట్ పనులు 85%, స్ట్రక్చర్స్ 55% పూర్తయినట్లు నివేదిక వెల్లడించింది.



ఆర్5 జోన్ భూములపై సమావేశంలో చంద్రబాబు

## రాజధాని కట్టడాలకు అనుగుణంగా నిర్మాణాలు జరగాలి :సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణ డిజైన్‌కు అనుగుణంగా నిర్మాణాలు జరగాల్సి ఉంటుందనిసీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. అమరావతిలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆర్5 జోన్ భూములపై అధికారులకు కీలక దిశా నిర్దేశం చేసారు ఆ జోన్ కిందకు వచ్చే భూములను వెనక్కి తీసుకునేలా రెవిన్యూ శాఖకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. అక్కడ స్థలాలు కేటాయించిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా వారి ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని రెండు జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజధాని అమరావతి పరిధిలో పనులకు సంబంధించి అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు పనులు బదలాయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గత రాత్రి సిఆర్‌డిఏ 58వ అథారిటీ సమావేశం జరిగింది. వైసీపీ హయాంలో విజయవాడ, గుంటూరు నగరాలకు చెందిన 50 వేల మందికి అమరావతిలో ఆర్ 5 జోన్ లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇందు కోసం సీఆర్డీఏకు చెందిన 900 ఎకరాలను రెవిన్యూ శాఖకు బదిలీ చేసారు. అయితే, ఈ విధంగా స్థలాలు కేటాయించటం ద్వారా అమరావతి మాస్టర్ ప్లాన్ కు విఘాతం ఏర్పడుతుందని సీఆర్డీఏ అధికారులు చెబుతున్నారు. దీంతో, వైసీపీ హయాంలో అక్కడ కేటాయించిన భూములను వెనక్కు తీసుకొని.. వారి ప్రాంతాల్లోనే ప్రభుత్వ విధానం మేరకు అర్హులకు ఇంటి స్థలాలు కేటాయించాలని చంద్రబాబు ఆదేశించారు. దీనికోసం భూసమీకరణ, భూసేకరణ విధానాలలో ముందుకు వెళ్లాల్సిందిగా సూచించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలందకీ ఇళ్లు పథకంలో భాగంగా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన దాదాపు 51 వేల మందిని ఎంపిక చేసింది. వారికి అమరావతిలోని ఆర్5 జోన్‌లో లే అవుట్లు వేసి ఇళ్ల పట్టాలను కేటాయించింది.

ఈ స్థలాల విషయంలో స్పష్టత ఇచ్చారు. 2023 కు ముందు ఉన్న విధంగానే ఆర్ 5 జోన్ కొనసాగించాలని నిర్ణయించారు. అదే విధంగా గత ప్రభుత్వ హయాంలో సీఆర్డీఏ నుంచి రెవిన్యూ శాఖకు బదిలీ చేసిన భూములకు సంబంధించిన చెల్లించాల్సి నగదు చెల్లించలేదు. దీంతో, రెవిన్యూ శాఖకు తుది నోటీసులు జారీ చేసి.. ఆ భూములు సీఆర్డీఏ వెనక్కు తీసుకునే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఇక.. అమరావతిలో బీజేపీ కార్యాలయానికి గతంలో 2.8 ఎకరాల భూమి కేటాయించగా.. సాంకేతిక ఇబ్బందుల కారణంగా దానిని 1.43 ఎకరాలకు తగ్గించి.. వేరే చోట కేటాయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ఏడు సంస్థలకు భూములు కేటాయిస్తూ.. గతంలో కొన్ని సంస్థలకు చేసిన కేటాయింపుల్లో మార్పులు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం తెలిపారు. శాసనసభ, హైకోర్టు భవనాల ఎంఈపీ పనులకు టెండర్లు పిలిచేందుకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. బ్యాంకులకు, బిజెపి కార్యాలయానికి స్థలానికి సంబంధించి అథారిటీ ఆమోదం తెలిపింది. కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సులను ఆమోదించారు. హైకోర్టు, అసెంబ్లీకి సంబంధించి ఎంవిపి వర్కులకు అనుమతినిచ్చారు. ఎజిఐసిఎల్‌కు హైకోర్టు, ఐకానిక్ భవనాల నిర్మాణాల పనులను కేటాయించారు. రివర్‌ఫ్రంట్ కూడా దానికే బదలాయించారు. ఇప్పటి వరకూ సిఆర్‌డిఏ, ఎడిడిఎస్ నిర్వహిస్తున్న పనులను ఇక నుండి గ్రోత్ కార్పొరేషన్ కూడా చేపట్టనుంది. రెండోదశలో చేపట్టనున్న పనులనూ దీనికే అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అమరావతిలో రోడ్లు, డ్రెయిన్లతోపాటు గ్రీన్ అండ్ బ్లూ డిజైన్లపైనా చర్చ జరిగింది. వీటిపై ఇప్పటికే పలు సంస్థలు ఇచ్చిన డిజైన్లను పరిశీలించి ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. అలాగే ఇతర దేశాల్లో ఉన్న పార్కులనూ పరిశీలించాలని ఎడిసిఎల్‌కు సూచించారు. ఇక రాజధానిలో ఏ వైపు చూసినా వేల మంది కార్మికులు, వాహనాలు, యంత్రాలు, భారీ నిర్మాణ సామగ్రి దర్శనమిస్తున్నాయి. రాజధాని సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు ఐకానిక్ టవర్స్, ట్రంక్ రోడ్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, జడ్జిలు, ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, అఖిల భారత సర్వీసు అధికారుల భవన సముదాయాల పనులు వేగంగా జరుగుతున్నాయి. దానితోపాటు మరో వైపున రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధికీ శరవేగంగా ఎల్‌పీఎస్ లేఔట్ నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రస్తుతమున్న లేఔట్‌లలో జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు రోడ్లు, సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసే పనులను చేస్తున్నారు. ఏపీ ఎన్‌ఆర్‌టీ, హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

# డి సిఎం పవన్ కళ్యాణ్ చొరవతో కొణిదెల గ్రామానికి మహర్దశ



**విజయవాడ.ఫిబ్రవరి 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి మహర్దశ పట్టింది. పవన్ కళ్యాణ్ ఇంటి పేరు, ఆ ఊరి పేరు కొణిదెలఖిఖి కావడం విశేషం. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో ఉండగా అక్కడ సమస్యలను స్థానికులు పవన్ దృష్టికి తెచ్చారు. తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని పవన్ వారికి హామీ ఇచ్చారు. 2025లో నందికొట్కూరు నియోజకవర్గంలో ఫారం పాండ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో కొణిదెల గ్రామాభివృద్ధికి రూ.50 లక్షల విరాళం అందించారు. జిల్లా యంత్రాంగం సూచన మేరకు ఆ నిధులతో 90 వేల లీటర్ల సామర్థం ఉన్న ఓవర్ హెడ్ నీటి ట్యాంకు నిర్మించారు. దీంతో పాటు పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 2.0, సాస్కి, గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ తదితర పథకాల ద్వారా వచ్చిన నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి, గోకులాలు, ఇళ్ల నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. కేవలం ప్రభుత్వ పథకాల నుంచే ఇప్పటివరకు సుమారు రూ.6 కోట్లకు పైగా నిధులు కొణిదెల గ్రామాభివృద్ధికి వెచ్చించారు. గ్రామానికి అవసరం ఉన్న అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.50 లక్షలతో 90 వేల లీటర్ల రక్షిత త తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. దీని వల్ల ఆ గ్రామ పరిధిలో 2 వేల మంది దాహార్తి తీరనుంది. వేసవికి ముందే ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడంపై పవన్ ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులను అభినందించారు. కొణిదెల గ్రామానికి ఖిపల్లె పండుగ 1.0ఖిలో రూ.20 లక్షలకు పైగా వెచ్చింది 3 అంతర్గత రోడ్లు నిర్మించారు. ఖిపల్లె పండుగ 2.0ఖిలో రూ.45 లక్షలతో చేపట్టిన 7 సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఉప ప్రణాళిక నిధులతో స్థానిక జిల్లా పరిషత్తు స్కూల్ నుంచి పగిద్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు పునరుద్ధరణకు రూ.45 లక్షలు డిప్యూటీ సీఎం పవన్ మంజూరు చేయించారు. కొణిదెల గ్రామస్థుల అభ్యర్థన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణ శాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటి తొట్టెలు నిర్మించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతుల కోసం

# అమెరికాతో పోరాటానికి భారత్ సిద్ధం

## - మోడీకి రాజకీయ సంకల్పశక్తి తగ్గింది : సిపిఐ నారాయణ



**తిరుపతి,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** "దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా అక్రమ ఆర్థిక దౌర్జన్యాన్ని ఎదుర్కొనలేని స్థితిలో ఉన్నాడని, ఆయనకు రాజకీయసంకల్పశక్తితగ్గి పోయిందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఈ సమయంలో అమెరికాతో పోరాటానికి దేశప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి బైరాగి పట్టెడలో సిపిఐ కార్యాలయంలో తిరుపతి జిల్లా సమితి సమావేశం చిన్నం పెంచలయ్య అధ్యక్షతన జరిగింది .ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కే నారాయణ మాట్లాడుతూ అమెరికా దేశ అధ్యక్షుడు భారతదేశంలో విధిస్తున్న సుంకాలవల్ల భారత ప్రజానీకంపై మరింత భారం పడుతుందని అన్నారు. ఈ అక్రమ ఆర్థిక దౌర్జన్యాన్ని ఎందుకు మోడీ ప్రశ్నించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాడో ప్రజలకు సూటిగా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా కోర్టులే ట్రంప్ విధానాలను బహిరంగంగా వ్యతిరేకిస్తుంటే భారత ప్రభుత్వం ,మోడీ ఎందుకు నిస్సిగ్గుగా తప్పించుకు తిరుగుతున్నాడని వాపోయారు. న్యూయార్క్ లో అదాని లంచం ఇచ్చిన కేసు బయటపడింది అతనిని కాపాడుకోవడానికి మోడీ అమెరికాకు వెళ్లి ట్రంప్ కు సాష్టాంగం నమస్కారం చేస్తున్నాడని తీవ్రంగా విమర్శించారు. అమెరికాతో పోరాటానికి భారత ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అవసరమైతే చైనా, రష్యా, యూరప్ దేశాలు భారత్‌కు మద్దతుగా నిలబడడానికి సిద్ధంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పార్లమెంట్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నోరు నొక్కేసి ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో కి నెట్టుతున్నారని అన్నారు .ఓటు బ్యాంకు కోసం హిందువుల్ని రెచ్చగొడుతూ బిజెపి ప్రయత్నాలు చేస్తుందని, ఏమి చేసినా కేరళలో బిజెపి రాదని స్పష్టం చేశారు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పరచడానికే పేరు మార్చుకున్నారనే విషయాన్ని గుర్తు చేశారు .స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న మహాత్మా గాంధీ ,జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ పేర్లు కనబడకుండా చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. అటవీ సంపద లాక్కోవడానికి ఆపరేషన్ కగార్ పేరు తో నక్సలైట్ల మారురూపంలో మనుషులని చంపుతున్నారని ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి హరినాథ్ రెడ్డి , సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ రామానాయుడు, పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, ఎ .చిన్నిరాజ్, జె విశ్వనాథ్, పి బాలకృష్ణ, జె గురవయ్య, సుధాకర్ రెడ్డి, బి నదియా తదితరులు పాల్గొన్నారు.

# అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించిన నలుగురు పోలీసు అధికారుల సస్పెన్షన్

**విజయవాడ,ఫిబ్రవరి 22,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో పోలీసులు కుమ్మక్కు అయ్యారంటూ సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. 2022, మే 19న జరిగిన హత్య కేసు విచారణలో నిందితుడైన అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించిన నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణలో లోపాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు డిఫాల్ట్ బెయిల్ అందించడానికి అన్ని ప్రయత్నాలు జరిగాయని, అత్యంత హేయమైన నేరంలో పోలీసుల తీరు ఆక్షేపణీయమని సుప్రీం కోర్టు మండిపడింది. కేసు విచారణలో నిరక్ష్యంగా వ్యవహరించి నిందితులకు కొమ్ము కాసిన పోలీసులపై ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీసింది. అప్పటి పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో కేసులో కీలక ఆధారాలు కావాలని విస్మరించి నిందితుడైన అనంతబాబుకు సహకరించిన నలుగురు పోలీస్ అధికారులపై డీజీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెండ్ అయిన వారిలో కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన అప్పటి కాకినాడ డీఎస్పీ, ప్రస్తుతం భీమవరం అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న వి.భీమారావు, వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, అప్పట్లో సర్పవరం సీఐగా పనిచేసి ప్రస్తుతం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆకుల మురళీకృష్ణ, అప్పట్లో కేసు నమోదైన సర్పవరం స్టేషన్ ఎస్ఐగా ఉండి, ప్రస్తుతం కాకినాడ పోర్టు పోలీసస్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎస్.సతీష్ బాబు ఉన్నారు.

ఈ పోలీసు అధికారులపై వెంటనే క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. విచారణ సజావుగా సాగేందుకు క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ పూర్తయ్యే వరకు వీరి సస్పెన్షన్ కొనసాగుతుంది. వీరిపై హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుంది. 15 రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తారు.

## పథకం ప్రకారమే నాపై, నా కుటుంబంపై దాడి : అంబటి రాంబాబు



మీడియాతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

**రైల్వేకోడూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి తనపై తమ కుటుంబంపై కక్ష పెంచి దాడిని చేసిందని వైసిపి మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం తిరుపతి జిల్లా రైల్వేకోడూరు వైసీపీ కార్యాలయంలో విలేకరులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయన కుమారుడు రెడ్ బుక్ అధినేత నారా లోకేష్‌లు కక్షతో తనపై తమ కుటుంబంపై కక్ష పెంచి పూర్తిస్థాయిలో విధ్వంసానికి గురి చేశారు. ముఖ్యంగా భావ స్వేచ్ఛతో వైసిపి వారు ఏదైనా మాట్లాడితే అక్రమ కేసులు దాడులు కూటమి ప్రభుత్వంలో ఎక్కువగా అలజడులు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. లౌకిక రాజ్యంలో వాస్తవాలను మాట్లాడిన కూటమి ప్రభుత్వం అందరిపై కక్ష కడుతుందని అన్నారు ఇప్పటికే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్నది జగనన్న ప్రభుత్వమేనని ఆయన అన్నారు. దేశ చరిత్రలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు భూ దందాలు చరిత్రలో నిలిచిపోతాయని అంబటి అన్నారు. అనంతరం వెంకటరెడ్డి పల్లి పంచాయతీ చిల్ల గురువిరెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కే.శ్రీనివాసులు, కోడూరు ఉప మండల అధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, కిషోర్‌రెడ్డి, తోట శివసాయి, గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి, నాయని హరికృష్ణ రెడ్డి, రాజారెడ్డి, చియ్యవరం విష్ణు దొమ్మరాజు, సుబ్రహ్మణ్యం రాజు, రామకృష్ణ, ఆర్‌విరమణ, భూంపల్లి నాగరాజా ఆంజనేయులు, కృష్ణారెడ్డి, గౌతంరెడ్డితోపాటు వైసీపీకి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన తొలితరం తెలుగు యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి : సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన తొలితరం తెలుగు యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నరసింహారెడ్డి అని ఏపీ సీఎం చంద్రబాబు శ్లాఘించారు. ఉయ్యాలవాడ తెగబాటులో తెల్లదొరలు ఉక్కిరిబిక్కిరయ్యారు అన్నారు. సీమ ఆడబిడ్డల పట్ల అమానుషంగా వ్యవహరించిన వారికి ఆయన తగిన గుణపాఠం చెప్పారన్నారు. మరణాన్ని పూలహారంగా స్వీకరించిన ఘనుడు ఉయ్యాలవాడ అని స్తుతించారు. స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్థంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునివాళులర్పించారు. వర్తమాన. భావితరాలకు ఉయ్యాలవాడ ఆదర్శనీయులన్నారు.




ఉయ్యాలవాడ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సిఎంచంద్రబాబు

## ఎపి విఆర్‌ఒ సంఘంకు ఎన్నికల షెడ్యూలు విడుదల

**విజయవాడ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘంకు ఎన్నికల షెడ్యూలు ఖరారయింది. సంఘం బలోపేతం కొరకు కమిటీలు యొక్క కాల పరిమితి 3 సంవత్సరాలు పూర్తయినందున ఎన్నికలు జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నిర్ణయించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడు తెలిపారు. మండల కమిటీలు ఈనెల 25న, డివిజన్ కమిటీలు మార్చి 15న, జిల్లా ఎన్నికల కమిటీలు ఏప్రిల్ 5న జరుపుతామన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ



**విజయవాడ.ఫిబ్రవరి22,ప్రభాత వార్తప్రతినిధి:** ఏవీయే షన్ రంగంలో పెట్టుబడులకు ముందుకు వచ్చేవారి తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఎపి ప్రభుత్వ విధానాలు, డిఫెన్స్, ఏరో స్పేస్ రంగంలో అత్యుత్తమ ఫలితాలకు ఉత్తమ గమ్యస్థానం ఆంధ్ర ప్రదేశ్ అని తెలిపారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ అయ్యారు. డైనమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉదయంత్ మల్హోత్రా, ఎరోస్పేస్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ హెడ్ పీ. చలపతి, డైరెక్టర్ అహిల్యా మల్హోత్రా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆండ్రియా మిలానీ, సంస్థ యూరప్ వ్యాపార కార్యకలాపాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ క్రిస్టినా లిడేగార్డ్ సీఎంతో జరిగిన సమావేశంలో ఉన్నారు. ఏవియేషన్ రంగంలో, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో తమ సంస్థ కార్యకలాపాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. డిఫెన్స్ రంగంలో తమ సంస్థ అనుభవాన్ని వివరించారు.

## రాఘవేంద్రస్వామి మఠాన్ని దర్శించిన కేంద్ర మంత్రి కుమారస్వామి




**కర్నూలు, ఫిబ్రవరి 22 ప్రభాత వార్త ప్రతినిధి:** ప్రఖ్యాత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువై ఉన్న శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ప్రభుత్వ రంగ సంస్థల శాఖా మంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. శ్రీ మఠంలో నిర్వహిస్తున్న శ్రీ గురు వైభవోత్సవాలు కార్యక్రమాలకు హాజరు కావాలని పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థ స్వామిజీ వారు అందించిన ఆహ్వానం మేరకు వారు మంత్రాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీ మఠం ఆధ్వర్యంలో నడుస్తున్న అతిథి గృహానికి చేరుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ప్రముఖులను శ్రీ మఠం ఏఏఓ శ్రీ మాధవ శెట్టి, మేనేజర్లు శ్రీ ఎస్.కే. శ్రీనివాసరావు, శ్రీ వెంకటేష్ జ్యోషి, శ్రీ సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీ పతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీ ఐ.పి. నరసింహమూర్తి తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఈ సందర్భంగా వారు గ్రామదేవత శ్రీ మంచాలమ్మ అమ్మవారిని దర్శించుకొని, అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు స్వీకరించారు. అలాగే శ్రీ మఠంలో నిర్వహించిన వివిధ పూజా కార్యక్రమాలు, రథోత్సవంలో పాల్గొని భక్తులతో కలసి ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని పంచుకున్నారు. అనంతరం శ్రీ మఠం ఆవరణంలోని యోగీంద్ర సభామండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి మాట్లాడుతూ... శ్రీ రాఘవేంద్రస్వామి మహిమలను, మఠం చేపడుతున్న ఆధ్యాత్మిక మరియు సేవా కార్యక్రమాలను కొనియాడారు. పీఠాధిపతుల సేవాభావాన్ని ప్రశంసిస్తూ, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో శ్రీ మఠం కీలక పాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థ స్వామిజీ వారు కేంద్ర మంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి గారు, మాజీ క్రికెటర్ శ్రీ వెంకటేష్ ప్రసాద్ గారు సహా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను శేషవస్త్రం, ఫలమంత్రాక్షతలతో సత్కరించి రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌశిక్ ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, రాఘవేంద్రరావు, సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, డి.ఎస్.పి. భార్గవి, తహసీల్దార్ రమాదేవి, శ్రీ మఠం సిబ్బంది, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ - మచిలీపట్నం జాతీయ రహదారి, విజయవాడ నగర పరిధిలో ఎలివేటెడ్ పై ఓవర్ నిర్మాణం!

**విజయవాడ,ఫిబ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ -మచిలీపట్నం జాతీయ రహదారి, విజయవాడ నగర పరిధిలో ఉన్న మేరకు ఆ మార్గంలో ఎలివేటెడ్ పై ఓవర్ ను నిర్మించే ప్రతిపాదనను అధికారులు ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్క్ వద్దనున్న కనకదుర్గ పై ఓవర్ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే మార్గంలో గంగూరు కూడలి వరకు మొత్తం 14 కిలోమీటర్ల వరకు దాదాపు 6 వరుసలతో పై వంతెనను నిర్మించాలని ఆలోచిస్తున్నారు. ముఖ్యంగా దీని వలన జాతీయ రహదారిలో ప్రయాణించే వారికి ఏ ఆటంకాలు ఉండవని, అంతేకాకుండా విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలు కూడా తీరతాయని సంబంధిత శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టును ఏ విధంగా చేపట్టవచ్చన్న భిన్నమైన ప్రణాళికలపై ఢిల్లీ స్థాయిలో ఉన్నటువంటి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ ఏఐ) అధికారులు చర్చలు జరుపుతున్నారు. హైదరాబాద్ విజయవాడ మచిలీపట్నం రహదారి65 విజయవాడ పరిధిలో ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీ పురం, కనకదుర్గ ఫ్లైఓవర్, కృష్ణలంక, వారధి జంక్షన్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, కానూరు, పోరంకి, పెనమలూరు వైపు వెళ్తుంది. అయితే ప్రస్తుతం హైదరాబాద్ విజయవాడ మధ్య హైవేను ప్రధానంగా 6 వరుసలుగా విస్తరించే ప్రాజెక్టును చేపట్టడం గమనార్హం. దీనిని ముఖ్యంగా గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ కు క్రాస్ అయ్యే పాయింట్ వరకే విస్తరించాల్సిఉందిగా మొదట భావించారు. ఏపీ ప్రభుత్వం ఒత్తిడితో భవానీపురం వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ వరకు విస్తరించేందుకు గాను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ సన్నాహాలను చేసేందుకు సిద్ధపడుతుంది. మరొకవైపు ఉన్న విజయవాడమచిలీపట్నం రహదారిని 6 వరుసలుగా విస్తరించేటటువంటి ప్రాజెక్టును సైతం చేపడుతుండటం గమనార్హం. ఇదే విధంగా దావులూరు టోల్ ప్లాజా సమీపంలో ఔటర్ రింగ్ రోడ్ క్రాస్ అయ్యే ప్రదేశం నుంచి మచిలీపట్నం వరకు 6 వరుసలుగా విస్తరించనున్నారు. విజయవాడ నగర పరిధిలోని కనకదుర్గ ఫ్లైఓవర్ తర్వాత నుంచి వరుసగా కృష్ణలంక, వారధి జంక్షన్, స్క్యూల్ బ్రిడ్జి, బెంజ్ సర్కిల్ వరకు, అక్కడ నుంచి మచిలీపట్నం వైపు కానూరు, పోరంకి, పెనమలూరు, గంగూరు, కంకిపాడు వైపుగా దావులూరు టోల్ ప్లాజా వరకు 4 వరుసలుగానే ఈ రహదారి మిగిలిపోయింది. తాజాగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఉన్నతాధికారుల సమావేశంలో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. అంతేకాకుండా విజయవాడకు ఇరువైపులా 6 వరుసలుగా విస్తరించి వాహన రద్దీ ఎక్కువగా ఉండే నగరం మధ్యలో మాత్రం 4 వరుసలుగా మిగిలిపోతే ఎలాగైనా ప్రశ్న తలెత్తింది. దీనికి నగరంలో 6 వరుసలతో ఎలివేటెడ్ నిర్మించడమే పరిష్కారమనే ఓ అంచనాకు వచ్చారు. దీని ద్వారా కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి గంగూరు కూడలి వరకు 6 వరుసలతో ఎలివేటెడ్ వంతెన ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశించారు. ఎలివేటెడ్ పై ఓవర్ నిర్మాణానికి గాను బెజవాడ నగర పరిధిలో భూసేకరణ అవసరం ఎక్కువగా ఉండదు. వివిధ జంక్షన్ల వద్ద వంతెనెక్కెకి వెళ్లేందుకు, అదే విధంగా బయటకు వెళ్లేందుకు నిర్మించేటువంటి అప్రోచ్ లకు మాత్రం భూమిని సేకరించాల్సిన అవసరం ఉంటుంది. కానీ మొత్తంగా 14 కిలోమీటర్ల పొడవునా ఒకే వంతెనను నిర్మించాలా? లేక 2 భాగాలుగా విభజించాలా అనే చర్చ మాత్రం ఎక్కువగా నడుస్తుంది. దాదాపు ఒకే వంతెనను నిర్మించాలంటే మధ్యలో బెంజ్ సర్కిల్ వద్దన ఇప్పటికే 2 వంతెనలు ఉన్నాయి. దాంతో వాటిపై నుంచి బందరు వైపు మలుపు తిరిగే విధంగా ఎలివేటెడ్ ఫ్లైఓవర్ డిజైన్ ను చేయాల్సి ఉంటుంది. వీటికి బదులుగా కనకదుర్గ వారధి నుంచి కృష్ణలంక, వారధి కూడలి మీదుగా బెంజ్ సర్కిల్ సమీపం వరకు మొత్తం 5 కిలోమీటర్ల ఒక ఎలివేటెడ్ పై ఓవర్, అదే విధంగా బెంజ్ సర్కిల్ నుంచి గంగూరు కూడలి వరకు 9 కిలోమీటర్ల మరో పై ఓవర్ ను నిర్మిస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని ప్రస్తుతం పరిశీలించనున్నారు. దాంతో మొత్తంగా హైదరాబాద్ విజయవాడ మధ్య, విజయవాడ మచిలీపట్నం మధ్య హైవే విస్తరణ పేరుపై ఒకే హైవేపై మొత్తం 2 ప్రాజెక్టులకు డీపీఆర్ ను రూపొందిస్తున్నారు. ఇందులోనే ఈ ఎలివేటెడ్ పై ఓవర్ ను సైతం చేర్చే అంశాన్ని ప్రస్తుతం పరిశీలిస్తున్నారు.

# శరద్‌పవార్‌కు అస్వస్థత: ఆసుపత్రికి తరలింపు

**పూణె, ఫిబ్రవరి 22:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, మహారాష్ట్ర రాజకీయ దిగ్గజం శరద్ పవార్ (85) మరోసారి అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఉదయం ఆయనను పుణెలోని ప్రసిద్ధ రూబీ హాల్ క్లినిక్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఫిబ్రవరి నెలలోనే ఆయన ఆసుపత్రిలో చేరడం రెండోసారి కావడంతో ఆయన అభిమానులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని, వైద్యుల బృందం ఆయనను నిరంతరం చికిత్స అందిస్తోందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. కొద్దిరోజులుగా శరద్ పవార్ వయస్సు సంబంధిత ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈనెల 9వ తేదీన ఆయన తీవ్రమైన దగ్గు, గొంతు ఇన్ఫెక్షన్, ఛాతిలో ఇబ్బంది కారణంగా ఇదే రూబీ హాల్ ఆసుపత్రిలో చేరారు. ఐదు రోజుల పాటు చికిత్స పొందిన అనంతరం 14వ తేదీన ఆయన డిశ్చార్జ్ అయ్యి ఇంటికి చేరుకున్నారు. వైద్యులు ఆయనకు కనీసం వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన కూడా ఇంట్లోనే ఉంటూ రెస్ట్ తీసుకుంటున్నారు. అయినప్పటికీ పూర్తిగా కోలుకోకుండా మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం శరద్ పవార్ డీహైడ్రేషన్, తీవ్రమైన నీరసంతో బాధపడుతున్నట్లు వైద్యులు ప్రాథమికంగా గుర్తించారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ పుర్వేజ్ గ్రాంట్ పర్యవేక్షణలో ఆయనకు సెలైన్ ఎక్కించడం, ఇతర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయన ప్రాణానికి ప్రమాదం ఏమీ లేదని సాధారణ ప్రైవేట్ రూమ్‌లోనే చికిత్స పొందుతున్నారని వైద్యులు చెప్పారు. కనీసం రెండు రోజులు పాటు ఆయన ఆసుపత్రిలోనే ఉండి చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.



# కల్తీనెయ్యి పై ఏకసభ్యకమిటీకి ఆదిలోనే అభ్యంతరం!

**- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై సుప్రీంకోర్టుకు సుబ్రమణ్యస్వామి**

**- సిబిఐ సిట్ నివేదిక పరిణామాలపై నేడు విచారణ**

**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా,వినియోగించారనే ఆధారాలు సేకరించిన సిబిఐ సిట్ ,ఇందులో సూత్రధారులను కనిపెట్టే క్రమంలో రాష్ట్రప్రభుత్వం విశ్రాంత ఐఎఎస్ అధికారి దినేశ్‌కుమార్‌తో ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిటీపై అభ్యంతరాలు మొదలయ్యాయి. ఈకమిటీ కల్తీనెయ్యి కేసులో లోతుగా అధ్యయనం చేయనుందని ముందుగానే ఊహించిన ప్రత్యర్థులు,గత టిటిడి పెద్దలు ఇప్పుడు మాజీ ఎంపి ,సీనీయర్ న్యాయవాది సుబ్రమణ్యస్వామిని రంగంలోకి దించారనేది వినిపిస్తున్న హాట్‌టాఫిక్. ఆయన ఏకసభ్య కమిటీ నియామకాన్ని తప్పుబడుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణచేయనుంది. సుబ్రమణ్యస్వామి దాఖలుచేసిన పిటిషన్ కేసు లిస్టుఅయ్యింది. అంతేగాక ప్రతివాదులుగా సిట్, సిబిఐ, ముఖ్యమంత్రి, టిటిడిని పేర్కొన్నారు. ఇప్పటికే లడ్డూలకు కల్తీనెయ్యి దుమారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలిలో కూడా వివాదాంశంగా మారడంతో ఇప్పుడు అందరూ సుప్రీంకోర్టు నేడు(సోమవారం )ఇవ్వనున్నా తీర్పుపై ఆసక్తిగా చూస్తున్నారు. లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా చేయడం, వినియోగించి స్వామివారి ప్రసాదాలు తయారుచేసి విక్రయించారనే అంశంలో ఇప్పటికే గత ఏడాదిన్నరకాలంలో సుప్రీంకోర్టు నియమించిన సిబిఐ సిట్ అధికారులు దర్యాప్తు చేసి నివేదిక సమర్పించారు. ఆ నివేదికలో గత టిటిడి బోర్డు పెద్దలు, ఓ అధికారి పేర్లు లేకపోవడంతో కొంత అనుమానాలు లేకపోలేదు. ఈ నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా విశ్రాంత ఐఎఎస్ అధికారి, విశ్రాంత ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్‌ను కమిటీలో నియమించడంతో కల్తీనెయ్యి పాపంలో సూత్రధారులు బయటకు వస్తారని భయం పట్టుకుంది. ఇదే సమయంలో ఏకసభ్యకమిటీ నియామకం సవాల్‌చేస్తూ సుబ్రమణ్యస్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సంచలనం రేకెత్తించిన కల్తీనెయ్యి లడ్డూల విషయంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే సిట్ చాలావరకు పాత్రధారులను, కొందరు సూత్రధారులను అరెస్ట్ చేసింది. 11మంది టిటిడి అధికారుల పాత్ర ఉందని తేల్చింది. అంతేగాక ఈ కేసులో ఇప్పటికే గత టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌పై బదలీ వేటు వేసింది. అసలు సూత్రధారులు ఎవరనేది తేల్చలేకపోవడంతో ఇప్పుడు ఏకసభ్యకమిటీ నియామకం అవసరమని రాష్ట్రప్రభుత్వం, మంత్రివర్గం కూడా నిర్ణయించింది. ఈ కమిటీ నియామకమైన వెంటనే న్యాయవాది సుబ్రమణ్యస్వామి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేయడంతో నేడు ఏం జరగనుందనేది అందరిలోనూ ఆసక్తికర అంశంగా మారింది. తిరుమల వెంకన్న లడ్డూల తయారీలో కల్తీనెయ్యి కేసులో లోతుగా దర్యాప్తుచేసి అసలు సూత్రధారులను తేల్చాలనేది రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇందుకు విశ్రాంత ఐఎఎస్ అదికారి దినేశ్‌కుమార్‌తో నియామకమైన ఏకసభ్యకమిటీ పై సుప్రీంకోర్టుకు వివాదం చేరింది. సోమవారం జరగనున్న విచారణలో సుప్రీంకోర్టు ధర్మాసనం రాష్ట్రప్రభుత్వానికి అనుకూలంగా ఉత్తర్వులు ఇస్తే ఆ కమిటీ వెనువెంటనే తిరుపతికి చేరుకుని కార్యాచరణ ప్రారంభించనుంది. తదుపరి ఈ కల్తీనెయ్యి బాగోతంలో ఏకసభ్య కమిటీకి పూర్తిస్థాయి అధికారాలు బదలాయిస్తే గత టిటిడి బోర్డు పెద్దలను, ఓ అధికారిని విచారణ చేసే అవకాశం ఉంది. 2019-2024 మధ్యకాలంలో సరఫరా జరిగిన తీరు, టెండర్లు దక్కించుకున్న విధానం తదితర అంశాలు, దానివెనుక నడిచిన పెద్ద స్కామ్ ,ఇందుకు సహకరించిన పెద్దలు ఎవరనేది నిగ్గు తేల్చేందుకు ఏకసభ్య కమిటీ సిద్ధంకానుంది. ఇప్పటికే ఈ కల్తీనెయ్యికేసులో సుప్రీంకోర్టు ఆదేశాలతో సిబిఐ సిట్ అధికారులు అంతిమంగా భారీగా కోట్లరూపాయలు లబ్ధిపొందారని నిర్ధారించింది. కల్తీనెయ్యి కేసులో తొలినుండి టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్లు పాల్గొనడం, తదుపరి నిబంధనలు ఉల్లంఘించి నెయ్యిసరఫరా చేయడం వంటి అంశాల్లో భారీగా ఆర్థిక లావాదేవీలు నడిచాయనేటి సిబిఐ సిట్ అధికారులు నివేదికలు. 235కోట్లు రూపాయలు వరకు నిధులు లాభంపొందారని, 36మందిని పాత్రదారులు, సూత్రదారులను నిందితులుగా సిట్ తేల్చింది. వీరిలో 12మంది టిటిడి మార్కెటింగ్,కొనుగోళ్ళకమిటీ అధికారులే కావడం విశేషం.

# తల్లి పాడె మోసిన కూతుళ్లు!

**నెల వ్యవధిలోనే తల్లిదండ్రులు గుండెపోటుతో మృతి**

**కోనరావుపేట రూరల్, ప్రభాతవార్త:** ఆ తల్లిదండ్రులకు ఆస్తులు, సంపదలు సంపాదించుకోకపోయినా నలుగురు కూతుళ్లు ఉన్నారు. అయితే ఆ తల్లిదండ్రులు నెల వ్యవధి రోజుల్లోనే గుండెపోటుతో మృతి చెందడంతో ఆ నలుగురు కూతుళ్లు రోడ్డున పడ్డారు. తల్లి అంతిమ సంవత్సరాలు చేసేందుకు వారి చేతిలో చిల్లిగవ్వ లేకున్నా, ఆ తల్లి పాడెను నలుగురు కూతుళ్లు మోసి దహన సంస్కారాలు చేశారు. ఈ ఘటన కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు,బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దాల గ్రామానికి చెందిన ఎగదండి నర్సవ్వ (54) అనే మహిళ గుండెపోటుతో మృతి చెందింది.

నరసవ్వ భర్త బాబు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నెల రోజుల క్రితం ఇంట్లో గుండెపోటుతో గుండె పోటుతో మృతి చెందగా ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. భర్త మరణం తట్టుకోలేక నలుగురు కూతుళ్లను ఎలా పోషించాలని మనో వేదనతో నరసవ్వ నిత్యం పొంగిపోయేది.

# ఎఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తించిన తీరు ఆవేదన కలిగించింది : సీఎం చంద్రబాబు

**విజయవాడ.ఫిబ్రవరి 22,ప్రభాతవార్తప్రతినిధి:** .ఏఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తించిన తీరు ఆవేదన కలిగించింది. 70కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొన్న సదస్సులో కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన దేశ ప్రతిష్ఠకు నష్టమని, ఇలాంటి చర్యాల్ని ఖండిస్తున్నా అని సీఎం చంద్రబాబు అన్నారు.ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఏఐ సదస్సులో ప్రపంచంలోని చాలా దేశాలు ఆవిష్కరణలు ప్రదర్శించగా, మన ఆవిష్కరణల్ని చూపించి ప్రపంచ దేశాల అభినందనలు అందుకునా ్నమని అన్నారు. ఐటీ, ఏఐల్లో ముందుండటంతో ప్రపంచ నాలెడ్జ్ ఎకానమీకి నాయకత్వం వహించే ఏకైక దేశం మనదేనని అందరూ కితాబిచ్చారు. మన యువత ప్రయోజనాలు కాపాడాల్సిన కాంగ్రెస్ బాధ్యతారహితంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఖిఖిమన రాష్ట్రంలోను కూడా వైఎస్సార్సీపీ వంటి పార్టీని ఎప్పుడూ చూడలేదు. నేను బాంబులకు భయపడలేదు. అలిపిరిలో నాపై దాడి చేసినప్పుడు వేంకటేశ్వరస్వామి నన్ను కాపాడారు. ఆ స్వామికి అపచారం కలిగే పనులు వైఎస్సార్సీపీ నాయకులు చేస్తున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులే తిడుతున్నారు. ఇది న్యాయమేనా? మనం తిట్టించుకోవడానికి రాజకీయం చేస్తున్నామా? రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని గంజాయిమయం చేశారు. మదనపల్లెలో ఒకరు గంజాయి తాగి మృగంలా ప్రవర్తించారు. గంజాయి తాగి ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అవుతుందని చెప్పిన మాటకు కట్టుబడి ఉంటాను. అలాంటి మృగాలు జైల్లో ఉండాలి లేదా ఉరిశిక్షతో పైకి పోవాలి, చట్టం తన పని తాను చేస్తుందిఖిఖి అని సీఎం పేర్కొన్నారు. నెయ్యే కాదని సిట్ తేల్చింది: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో నాసిరకం ప్రసాదాలు గత 5 ఏళ్ల అందరూ తిన్నారు. వైఎస్సార్సీపీ వారు భక్తుల నమ్మకాన్ని దెబ్బ తీశారు. మేము పవిత్రతను కాపాడుతున్నాం. ఎన్నికల్లో నేను ఇచ్చిన హామీ ప్రకారం టీటీడీ ఈవోగా శ్యామలరావును నియమించి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని అన్నారు. నెయ్యి నాణ్యంగా లేదని ల్యాబ్ కు పంపితే జంతు కొవ్వు ఉందని తేల్చారు. ప్రజలకు తెలియజేయకపోతే అప్రతిష్ఠ వస్తుందని ల్యాబ్ రిపోర్టునే నేను ప్రకటించానని సీఎం అన్నారు. దీన్ని రాజకీయం చేసి సుప్రీం కోర్టు వరకు వెళ్లేలా చేశారని దీనిపై సిట్ వేస్తే అసలు నెయ్యే కాదని, రసాయనాలు ఉన్నాయి అని తేల్చిందని అన్నారు. సిట్ స్పష్టంగా చెప్పినప్పటికీ తిరిగి దాన్ని మా పై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని హెరిటేజ్ కంపెనీని తీసుకు వచ్చి నా పేరు ప్రస్తావించి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. కరడుగట్టిన నేరస్థులతో రాజకీయం చేయాలా? రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత నా ఒక్కడి పైనే లేదని మీ అందరిపై ఉందని తెలిపారు. చెడ్డవారిని దూరం పెట్టినప్పుడే రాజకీయాల్లో ప్రక్షాళన మొదలవుతుందని నాకెందుకులే అని ఇంట్లో కూర్చుంటే మార్పు రాదని పిలుపునిచ్చారు. ప్రజల కోసమే నాడు జైలుకెళ్లానని కేవలం ప్రజలు, రాష్ట్రాభివృద్ధి కోసమే ఇప్పటికీ పోరాటం చేస్తున్నానని సీఎం వివరించారు. చెత్త, రౌడీ రాజకీయాలు చేస్తున్నారు. పరామర్శల పేరిట బయటకు వస్తారు. మనుషుల్ని బలవంతంగా తెచ్చుకుని బలప్రదర్శనకు దిగుతున్నారు. వాళ్ల కార్ల కింద మనుషుల్ని చంపేసి ప్రభుత్వంపైకి నెట్టేస్తున్నారు. చనిపోయినవారి ఇళ్లకు పరామర్శకు వెళ్లరు వాళ్లనే పిలిపించుకుని పరామర్శిస్తారు. ఇదెక్కడా చూడలేదు. బూతులు తిట్టేవారిని పరామర్శిస్తారు. వాళ్ల కోసం చని పోయిన వారిని మాత్రం పరామర్శించారు. విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థ నుంచి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా తీసుకు వెళ్తున్నామన

# మాతృభాషా దినోత్సవం సందర్భంగా జర్నలిస్ట్ కథలు పుస్తకావిష్కరణ

**- ఠాగూర్ గ్రంథాలయంలో విజయవాడ భగవద్గీత శిక్షణా తరగతులు ప్రారంభం**

**విజయవాడ,ఫిబ్రవరి 22,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మా గాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జర్నలిస్ట్ కథల పుస్తకావిష్కరణ జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం. ఎస్. బేగ్ , చైర్మన్ కృష్ణాజిల్లా గ్రంథాలయసంస్థ వారి చేతుల మీదుగా "పుస్తకావిష్కరణ చేసారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ముందుగా అందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు. మాతృభాష మన ఆలోచనలకు మూలం మన సంస్కృతికి ఆధారం, మాతృభాషను ప్రేమించటం అంటే మనను మనమే గౌరవించుకోవడం అని తెలియజేశారు. జిల్లాలోని రచయితలు, కవులు, సాహితీవేత్తలు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు అందరి సూచనలను సలహాలను స్వీకరించి పరిశీలించిన మీదట గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో తీసుకువస్తామని తెలియపరిచారు. చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారిగా ఠాగూర్ గ్రంథాలయమునకు విచ్చేసి నందున గ్రంథాలయం నందలి ప్రతివిభాగాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు. జర్నలిస్టు కథలు పుస్తక సమీక్షకులు ఎం తిలక్ విశ్రాంత కార్యదర్శి ప్రెస్ అకాడమీ మాట్లాడుతూ రచయిత దాసరి ఆల్వార్ స్వామి ఇప్పటికీ 54 పుస్తకాలు రాశారని ఆయన ఎన్నో అవార్డులు తీసుకున్నారని అందులో 1994లో కృష్ణాజిల్లా సీనియర్ జర్నలిస్ట్ అవార్డు 2007లో రైతు నేస్తం అవార్డు తీసుకున్నారని 2016లో ఉగాది పురస్కారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్నారని 84 సంవత్సరాల వయసులో కూడా ఈరోజుకి ఇంకా పుస్తకాలు రాస్తానే ఉండటం ఎంతో ఆనందదాయకమన్నారు . రచయిత దాసరి ఆళ్వారు గారి నీ చైర్మన్ గారు దుస్సాలువాతో సత్కరించారు. తదుపరి విచ్చేసిన అతిథులు చైర్మన్ గారిని దుస్సాలువాతో సత్కరించబడెను. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి కే రమాదేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కలిమిశ్రీ చలపాక ప్రకాష్ , నాన, ఎస్ ఎం. సుభాని , వశిష్ట సోమేపల్లి,స్నిగ్ధమాధురి, ఆజామ్ ు, అజీజ్ రాధాకృష్ణ జగదీష్ , గ్రంథాలయ సిబ్బంది ఉమారాణి, ధనలక్ష్మి ్మ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు. ఇకఠాగూర్ గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే చదవటం మా ఇష్టం కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం నుంచి చిన్నారులకు భగవద్గీత శిక్షణా తరగతులు ప్రారంభించబడేను . శ్రీమతి మల్లెల. వరలక్ష్మి ్మ గారు చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. ఆమె మాట్లాడుతూ భగవద్గీత పిల్లలకు మంచి మార్గ దర్శని ఇది వారిని మంచి మనుషులుగా దిద్దటంలో ఎంతో సహాయపడుతుంది. చిన్ననాటి నుంచి భగవద్గీత నేర్చుకోవడం వలన వ్యక్తిత్వ వికాసంతో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కే రమాదేవి మాట్లాడుతూ తల్లితండ్రులు మీ చిన్నారులను కూడా ప్రతి ఆదివారం ఉదయం 10. గంటలకు జరిగే ఈ క్లాసుకు మీ పిల్లలను కూడా పంపించవలసిందిగా కోరడమైనది. ఈ కార్యక్రమంలోవివిధ స్కూల్స్ విద్యార్థులు తల్లిదండ్రులు

# ఒకే కుటుంబంలో ఐదుగురు అనుమానాస్పద మృతి

**కాస్‌గంజ్(యుపి),ఫిబ్రవరి 22:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాస్‌గంజ్ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ ఘటన స్థానికంగా పెను కలకలం రేపింది. భర్తే తన భార్యను, ముగ్గురు పిల్లలను కిరాతకంగా హతమార్చి, ఆ తర్వాత తాను కూడా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. అమన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెట్రోల్ పంపు దగ్గర సత్యదేవ్ ఫౌజీ అనే వ్యక్తి వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి అక్కడే నివసిస్తున్నాడు. అయితే గత రెండు రోజులుగా అతని ఇంటి తలుపులు మూసే ఉన్నాయి. ఇవాళ ఉదయం ఆ ఇంటి నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా ఒకే గదిలో ఐదు మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి.

మృతదేహాల పరిస్థితిని బట్టి చూస్తే ఈ ఘోరం జరిగి కనీసం రెండు రోజులు అయ్యి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతులను సత్యదేవ్, అతని భార్య, ముగ్గురు పిల్లలుగా గుర్తించారు.

ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలం నుంచి కీలక ఆధారాలు సేకరించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అసలు ఈ దారుణానికి దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఆర్థిక సమస్యలా లేక కుటుంబ కలహాలేమైనా ఉన్నాయా నే కోణంలో విచారిస్తున్నారు. ఈ ఘటనపై లోతైన విచారణ కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సత్యదేవ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు.

# తెలంగాణ పోలీసు జట్టు ఘన విజయం ఎన్‌ఎస్‌జీపై 124 పరుగుల తేడాతో గెలుపు

**విజయవాడ. ఫిబ్రవరి 22, ప్రభాతవార్తప్రతినిధి:** అఖిల భారత పోలీసు సౌత్ జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా మూడవ రోజున విజయవాడ శివారుల్లోని మూలపాడు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మైదానంలో జరుగుతున్నాయి.నేడు ఉత్కంఠభరితగా జరిగిన .మ్యాచ్ లో తెలంగాణ పోలీసు జట్టు ఎన్ఎస్జీ పై 124 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన తెలంగాణ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 259/2 భారీ స్కోర్ సాదించింది. తెలంగాణ పోలీసు జట్టులోని లోకనాథ్ నాయక్ 58 బంతుల్లో 119 పరుగులు చేసి అద్భుత శతకం సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లపై నిర్ధాక్షి ణ్యంగా విరుచుకుపడి బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపించి జట్టుకు భారీ స్కోరు సాధించడంలో తోడ్పాటు అందించాడు. ఆయన ప్రదర్శన మ్యాచ్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చేదనలో ఎన్ఎస్జీ జట్టు లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమై 18.3 ఓవర్లలో 135పరుగులకే ఆలౌట్ అయింది. తెలంగాణ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ తో ప్రత్యర్థి జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు.

అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభ కనబరచిన లోకనాథ్ నాయక్‌కు " మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్" అవార్డు ప్రదానం చేయబడింది.

ఈ మ్యాచ్‌లో తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, శ్రీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ బ్యాటింగ్ లో రాణించి 40 పరుగులు సాధించి ప్రత్యర్థి జట్టు ముందు భారీ లక్ష్యాన్ని ఉంచడంలో తనదైన పాత్ర పోషించారు. కళాత్మకమైన స్ట్రెయిట్ డ్రైవులు, హుక్ మరియు పుల్ షాట్లతో అలరించారు.

అనంతరం జరిగిన పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్ కార్యక్రమానికి హాజరై విజేతలను సి.వి. ఆనంద్ అభినందించారు.

**ఆంధ్రప్రదేశ్ పోలీసు జట్టుపై పుదుచ్చేరి పోలీసు జట్టు ఘన విజయం..**


ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 217/6 పరుగులు చేసింది. ఆంధ్రప్రదేశ్ పోలీస్ తరఫున రాహుల్ 62 బంతుల్లో అద్భుతంగా 141 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఆయన ఇన్నింగ్స్ మ్యాచ్‌లో విశేష ఆకర్షణగా నిలిచింది.

అయితే పుదుచ్చేరి పోలీస్ జట్టు లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో 221/6 పరుగులతో లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించి 4 వికెట్ల తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. జట్టులోని ప్రభు 56 బంతుల్లో 121 పరుగులు చేసి పుదుచ్చేరి జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు.

మ్యాచ్ అనంతరం జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఇరు జట్లలోని "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్"లకు తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్, ఐపీఎస్, డీఐజీ అన్బురాజన్ (స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ ఆంధ్రప్రదేశ్) మెమోంటోలు అందచేశారు...

# చంద్రబాబుకు మేమెందుకు సహకరిస్తాం

**మాపై ఆరోపణలు చేస్తే అసెంబ్లీలోనే సమాధానం చెప్పినం: సీఎం రేవంత్‌రెడ్డి**



ఆదివారం దేవాదుల వద్ద మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 22:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు తాము సహరిస్తున్నామని బీఆర్ఎస్ నేతలు చౌకబారు విమర్శలు చేయొద్దని హితవు పలికారు. అక్కడ సెటిల్ అయిన వారికి తామెందుకు సహకరిస్తామని ప్రశ్నించారు. ఆదివారం ములుగు జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. తుపాకులగూడెం దేవాదుల ప్రాజెక్టుని సందర్శించారు. దేవాదుల పనుల పురోగతిపై అధికారులతో సీఎం రేవంత్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పక్క రాష్ట్రాల వారితో చర్చించి తెలంగాణ నీటి హక్కులు కాపాడుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు విలువైన సూచనలిస్తే స్వీకరిస్తామని చెప్పుకొచ్చారు. ఓటేయకపోవడం ప్రజలదే తప్పు అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. గోదావరి నది జలాలపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చిద్దామన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేద్దామంటే నిధుల కొరత వచ్చిందని ప్రస్తావించారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలోనే అన్ని నిధులనూ విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేవాదుల ప్రాజెక్ట 2001లో రూ.6వేల అంచనాతో మొదలై.. రూ.18,500 కోట్లకు అంచనాలు పెరిగాయని తెలిపారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం మహా అద్భుతం అన్నారని.. తాము వచ్చినప్పటి నుంచి ఒక్క చుక్క ఎత్తిపోయలేదని చెప్పుకొచ్చారు. అయినా దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి జరిగిందని అన్నారు. ప్రాజెక్టులు, నీళ్లపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని తెలిపారు. బీఆర్ఎస్ నేతలంతా జ్ఞానవంతుల మని తాము చెప్పడం లేదని.. మీరు సూచనలు చేస్తే తీసుకుంటామని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును వదిలేయ కుండా ఉపయోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు.

# దుర్గమ్మ ఆలయాభివృద్ధి పనులు పరిశీలించిన ఇఒ



దాతలకు దుర్గమ్మవారిచిత్రపటం అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో లోకసంక్షేమార్థం సూర్యఉపాసన సేవను ఆదివారం నిర్వహించారు. ఆదిత్యహృదయం, సూర్యాష్టకం, అరుణపారాయణ, సూర్యనమస్కారాలు సమర్పిస్తూ పూజాదికాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం దుర్గమ్మవారికి విజయవాడకు చెందిన క్యాపిటల్ అమరావతి కల్చరల్ సొసైటీ నిర్వాహకుఉ పివిఎస్‌వి ప్రసాదరావు ఆధ్వర్యంలో కళాకారులు ఆదివారం కూచిపూడి నృత్య నీరాజనాలర్పించారు. ఆద్యంతం ఈ నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రదర్శన అనంతరం వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి ప్రసాదం , మెమొంటోలు అందించారు. - శ్రీ అమ్మవారి అన్న ప్రసాదం నిమిత్తం గన్నవరంకు చెంది మోచర్ల భవానీ పేరిట వారి కుటుంబసభ్యులు రు.1లక్ష విరాళం ఆదివారం అందించారు. విజయవాడకు చెందిన తన్నీరు మారుతి ఫణికాంత్ రు.1లక్ష విరాళం అన్నప్రసాద వితరణకు ఆదివారం అందించారు. హైదరాబాద్‌కు చెందిన జె కిషోర్ కుటుంబసభ్యులతో కలిసి రు.5లక్షలను అన్నప్రసాదానికి విరాళమందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# నేటి నుంచి టిజి ఐసెట్‌కు టిశాట్ స్పెషల్ డిజిటల్ పాఠాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నేటి(సోమవారం) నుంచి టీజీ ఐసెట్ కోసం టిసాట్ స్పెషల్ డిజిటల్ లెసన్స్‌ను ప్రసారం చేయనుంది సీఈవో బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 రోజులపాటు 320 ఎపిసోడ్స్‌ను ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. పలు పోటీ పరీక్షలకు డిజిటల్ లెసన్స్ అందిస్తోన్న టిసాట్ నెట్వర్క్ తెలంగాణ ఐసెట్-2026 పరీక్షలకు సైతం డిటిటల్ లెసన్స్ అందిస్తోందని సీఈవో ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఎం.బి.ఎ, ఎం.సి.ఎ అర్హత పరీక్ష ఐసెట్ కోసం నేటి(సోమవారం) నుంచి ప్రసారాలు మొదలౌతాయన్నారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టిజి ఐసెట్)- 2026 పరీక్షను మే 13, 14 తేదిల్లో జరగనుండగా ఎనలిటిక్ ఎబిలిటీ, మాథమెటిక్స్.

# సఫారీల సూపర్ విక్టరీ



## కుప్పకూలిన టీమిండియా బ్యాటింగ్

**"భయపడుతున్నదంతా జరిగింది. టీమిండియా బ్యాటింగ్ డొల్లతనం బయటపడింది. అసలు సిసలు పరీక్షలో తడబడింది. సఫారీల మేటి బౌలింగ్ ముందు భారత బ్యాట్స్‌మెన్ ఒకరి వెంట ఒకరిగా పెవిలియన్ చేరారు. మరీ పెద్ద లక్ష్యం కాకున్నా ఏ ఒక్కరూ క్రీజ్‌లో కుదురుకుందామన్న ధ్యాస లేకుండా లేజీ షాట్లతో వికెట్లు సమర్పించుకున్నారు. సొంతగడ్డపై ఒత్తిడంతా భారత్‌పైనే ఉంటుందని, ఆ ఒత్తిడినే సద్వినియోగం చేసుకుంటామన్న దక్షిణాఫ్రికా కోచ్ మాటలను నిజం చేస్తూ సూపర్ ఎయిట్‌లో సూపర్ విక్టరీ అందుకుంది"**

**అహ్మదాబాద్:** టీట్వంటీ ప్రపంచకప్ సూపర్8 లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే టీమిండియా.. సౌతాఫ్రికా చేతిలో 76 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయం పొందింది. 188 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా... మార్కో జాన్సెన్ బౌలింగ్ ధాటికి మరో 7 బంతులు మిగిలి ఉండగానే 111 పరుగులకు ఆలౌటైంది. ఇషాన్‌ను డకౌట్ చేసి మార్క్రమ్ భారత్ పతనానికి నాంది పలికాడు. ఆ తర్వాత జాన్సెస్ అద్భుత బంతులతో 51 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. మూడు గోల్డెన్ డక్‌లు ఇచ్చిన అభిషేక్(15) తనపై నమ్మకాన్ని నిలుపుకోలేకపోయాడు. తిలక్ వర్మ(1), సూర్య కుమార్(18), వాషింగ్టన్(11) నిరాశపరిచారు. హార్దిక్ (18), దూబే(42) కొద్దిసేపు వికెట్ల పత నాన్ని ఆపినా... కేశవ్ మహారాజ్ ఎంట్రీతో వెంటవెంటనే పెవిలియన్ చేరారు. రింకూ సింగ్ డకౌటయ్యాడు. చివరి వరుస బ్యాట్స్‌మెన్ స్పిన్ ఉచ్చులో చిక్కారు. దూబే ఒక్కడే ధాటిగా ఆడి 37 బంతుల్లో 3 సిక్స్‌లతో 42 రన్స్ చేశాడు. సౌతాఫ్రికా బౌలర్లలో జాన్సెన్ 4, కేశవ్ మహారాజ్ 3, బాచ్ రెండు వికెట్లు పడగొట్టారు. అర్ధసెంచరీతో రాణించిన డేవిడ్ మిల్లర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది.

## బూమ్ బూమ్ బుమ్రా



యార్కర్ల కింగ్ బుమ్రా నిప్పులు చెరిగారు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికాకు పేస్ బౌలింగ్‌తో చుక్కలు చూపాడు. రెండో ఓవర్ వేసిన బుమ్రా అద్భుతబంతితో డికాక్‌ను బోల్తా కొట్టించాడు. నిప్ బ్యాకర్ డెలివరీగా సంధించిన ఈ బంతి లో బౌన్స్‌గా వచ్చి లెగ్ స్టంప్‌ను పడగొట్టింది. ఆశ్చర్యపోవడం డికాక్(6) వంతైంది. ఇక నాలుగో ఓవర్లో రికల్టన్(7)ను స్లోబంతితో అవుట్ చేశాడు. స్లో బంతిని ఊహించని రికల్టన్ బ్యాట్ ఝుళిపించడంతో కవర్ పాయింట్‌లో శివమ్ దూబేకు ఈజీ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అంతకుముందు ఓవర్‌లో అర్షదీప్.. ఫామ్‌లో ఉన్న మార్క్రమ్(4)ను కంగుతినిపించాడు. మిడాప్‌లో ఈక్యాచ్‌ను హార్దిక్ తీసుకున్నాడు. దీంతో సౌతాఫ్రికా 20 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

### మిల్లర్, బ్రేవిస్ ధనాధన్

డేవిడ్ మిల్లర్(35బంతుల్లో 63), బ్రేవిస్(29 బంతుల్లో 45) దూకుడుగా ఆడారు. 5ఓవర్ వేయడానికి వచ్చిన వరుణ్‌ను టార్గెట్ చేసుకున్నారు. మిల్లర్ వరుసగా రెండో బౌండరీలు బాదాడు. ఆరో ఓవర్ వేసిన అర్షదీప్ బౌలింగ్‌లో మిల్లర్ మరో రెండు ఫోర్లు.. తరువాతి సుందర్ ఓవర్లో మిల్లర్, బ్రేవిస్ చెరో బౌండరీ రాబట్టారు. 9వ ఓవర్ వేసిన వరుణ్ బౌలింగ్‌లో మిల్లర్ ఓ సిక్స్, బ్రేవిస్ ఓ ఫోర్,ఓసిక్స్‌తో మొత్తం 17 రన్స్ పిండుకున్నారు. పదో ఓవర్లో హార్ధిక్ బంతిని మిల్లర్ లాంగ్ ఆన్ మీదుగా సిక్స్ బాదాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన దూబే ఓవర్లో బ్రేవిస్ ఓ ఫోర్, ఓ సిక్స్‌తో 15 రన్స్ సాధించి సౌతాఫ్రికా స్కోరు వంద దాటించాడు. ఎట్టకేలకు ఈ జోడీని దూబే విడదీశాడు. ఈ జోడీ 4వ వికెట్‌కు 50బంతుల్లోనే 97రన్స్ జోడించింది. దూబే బౌలింగ్‌లో సిక్స్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన మిల్లర్ అదే జోరు కొనసాగిస్తూ 63 రన్స్ చేసి వరుణ్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత అర్షదీప్, బుమ్రా వికెట్లు తీయడంతో స్కోరు వేగం తగ్గింది. మరోవైపు స్టబ్స్ ధాటిగా ఆడుతూ 20వ ఓవర్ వేసిన హార్దిక్ బౌలింగ్‌లో ఓ ఫోర్ సహ రెండు సిక్స్‌లతో 20 రన్స్ రాబట్టడంతో సౌతాఫ్రికా స్కోరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 187 రన్స్ సాధించింది. బుమ్రా 3, అర్షదీప్ 2 వికెట్లు తీశారు.

## ఇంగ్లాండ్ చేతిలో లంక విలవిల



**పల్లెకల్:** సొంతగడ్డపై లంకేయులు విలవిల్లాడారు. టీ20 ప్రపంచకప్ సూపర్8 గ్రూప్2 లో ఇంగ్లాడ్ చేతిలో చిత్తుచిత్తుగా ఓడింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంకను ఇంగ్లాండ్ స్పిన్ ఉచ్చులో పడేసింది. ఆఫ్ స్పిన్నర్ విల్ జాక్స్ దెబ్బకు బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. లంక ఓపెనర్లు పథుమ్ నిశాంక(9), కమిల్ మిషారా(6) లను పేసర్ జోఫ్రాఆర్చర్ అవుట్ చేసి తొలి దెబ్బ తీశాడు. ఆతర్వాత విల్ జాక్స్ వంతయింది. విల్ జాక్స్ ఆఫ్ బ్రేక్‌లకు శ్రీలంక 34 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. డాసన్, అదిల్ రషీద్ రెండేసి వికెట్లు.. జేమీ ఓవర్టన్ ఒక వికెట్ తీయడంతో శ్రీలంక 16.4 ఓవర్లలోనే 95 పరుగులకు కుప్పకూలింది. లంక ఇన్నింగ్స్‌లో దాసున్ షనక సాధించిన 30 పరుగులే టాప్ స్కోరు.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 రన్స్ చేసింది. జాస్ బట్లర్, జాకబ్ బెతెల్, టామ్ బాంటన్ సింగిల్ డిజిట్‌కే అవుటైనా ఇంగ్లాండ్‌ను ఫిల్ సాల్ట్(40 బంతుల్లో 62 రన్స్) ఆదుకున్నారు. లంక బౌలర్లపై బౌండరీలు, సిక్స్ లతో విరుచుకుపడ్డాడు. మిగతా వారిలో విల్ జాక్స్ 21 రన్స్ చేశాడు. లంక బౌలర్ల లో దునిత్ మూడు, దిల్షాన్ 2, తీక్షణ 2 వికెట్లు పడగొట్టారు.

### సంక్షిప్త స్కోర్లు

**ఇంగ్లాండ్–146/9**(20 ఓవర్లలో) (ఫిల్ సాల్ట్ 62, విల్ జాక్స్ 21, దునిత్ 3/26, మధుశంక 2/25, తీక్షణ 2/21); **శ్రీలంక–95 ఆలౌట్**(16.4ఓవర్లలో) (దాసున్ షనక 30, విల్ జాక్స్ 3/22, జోఫ్రా ఆర్చర్ 2/20, డాసన్ 2/27, అదిల్ రషీద్ 2/13)

## విమెన్స్ వండర్స్ : ఆసియాకప్ కైవసం



**బ్యాంకాక్:** మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ భారత్–ఎ నిలబెట్టుకుంది. బ్యాంకాక్ వేదికగా జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 46 పరుగుల తేడాతో గెలుపొంది వరుసగా రెండోసారి కప్ అందుకుంది.

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన భారత్–ఏ మహిళల జట్టు నిర్ణీత 20ఓవర్లలో7 వికెట్ల నష్టానికి 134 రన్స్ చేసింది. 44 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన తేజల్ హసబ్నిస్(34 బంతుల్లో 51) అర్ధ సెంచరీతో ఆదుకుంది. రాధా యాదవ్ (36 రన్స్)తో కలిసి అయిదో వికెట్‌కు 69 పరుగులు జోడించింది. బంగ్లా బౌలర్లలో ఫహిమా ఖాతూన్ నాలుగు వికెట్లు పడగొట్టింది.

135 పరుగుల లక్ష్యంతోబ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ను భారత మహిళలు కుప్పకూల్చారు. ప్రేమా రావత్ మూడు వికెట్లు.. సోనియా, తనుజా చెరో రెండు వికెట్లు తీయడంతో బంగ్లాదేశ్ 88 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో సుల్తానా చేసిన 20 పరుగులకే టాప్ స్కోరు. హాఫ్ సెంచరీతో రాణించిన తేజల్.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది.



## ప్రో హాకీ లీగ్ : భారత్ షూటౌట్

**హోబర్ట్:** ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత హాకీ జట్టు ఓటములు కొనసాగుతున్నాయి. సొంతగడ్డపై నిరాశపరిచిన భారత్... ఆస్ట్రేలియా అంచె ప్రోలీగ్ తొలి మ్యాచ్‌లోనే షూటౌట్ ఓటమి ఎదురైంది. ఈ మ్యాచ్‌లో భారత హాకీ వీరులు 45వ నిమిషం వరకు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ఆట 14వ నిమిషంలో అమిత్ రోహిదాస్ గోల్ చేసి 1-0 ఆధిక్యం అందించగా, 43వ నిమిషంలో జుగ్రాజ్ సింగ్ గోల్‌తోఆధిక్యం 2-0కు చేరుకుంది. గెలుపు బాటలో ఉన్న భారత్ ఆశలపై నీళ్ల చల్లుతూ ఆస్ట్రేలియా చివరి నిమిషాల్లో వేగంగా రెండు గోల్స్ చేసింది. 47వ నిమిషంలో, 56వ నిమిషంలో జోయెల్ రింటాలా చేసిన గోల్స్‌తో ఆస్ట్రేలియా 2-2తో సమవుజ్జీగా నిలిచింది. పూర్తి సమయం ముగిసే సరికి రెండు జట్లు 2-2తో సమానంగా నిలవడంతో ఫలితం తేల్చడానికి పెనాల్టీ షూటౌట్ నిర్వహించారు. షూటౌట్‌లో మాత్రం ఆస్ట్రేలియా 5-4 తేడాతో విజయం సాధించింది.

## కొడుక్కి హార్దిక్ 4కోట్ల కారు గిఫ్ట్

**ముంబై:** టీమిండియా స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్య.. తన కొడుకు అగస్త్యకు 4కోట్ల ఖరీదైన కారును గిఫ్ట్ ఇచ్చాడు. ముంబైలోని ఓ కార్ల షోరూమ్‌లో ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారు కీని తన తల్లి నటాషాతో కలిసి అగస్త్య అందుకున్నాడు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. హార్దిక్ పాండ్య, నటాషా 2020లో పెళ్లి చేసుకున్నారు. వీరి సంతానమే అగస్త్య. మనస్పర్ధలతో 2024లో విడాకులు తీసుకున్నారు. నటాషా సంరక్షణలోనే అగస్త్య ఉంటున్నాడు. అధికారికంగా విడిపోయిన తర్వాత కూడా హార్దిక్, నటాషా... తమ కుమారుడి విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. ప్రస్తుతం మోడల్ మహికా శర్మతో హార్దిక్ పాండ్య చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాడు. తామిద్దరం రిలేషన్‌లో ఉన్నట్లు పాండ్య అధికారికంగా వెల్లడించాడు. స్విమ్మింగ్ పూల్‌లో వీరిద్దరి రొమాన్స్ హాట్ టాఫిక్‌గా నిలిచింది.





## వాణిజ్య బ్యాంకుల నికర లాభాలు రూ.లక్ష కోట్లు!

**ముంబయి, ఫిబ్రవరి 22:** ప్రభుత్వరంగ బ్యాంకులు రికార్డుస్థాయిలోమూడో త్రైమాసికంలో నికరలాభాలు చవిచూసాయి. మొత్తం షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులు కలిపి రూ.లక్ష కోట్లు రూపాయలు అధిగమించాయి.

బ్యాంకింగ్చ రిత్రలోనే మొట్టమొదటిసారిగా ప్రైవేటు బ్యాంకులకంటే ప్రభుత్వ రంగ బ్యాంకులు నికరలాభాలను పెంచుకోగలిగాయి నికరలాభాలు 10.6శాతం వార్షికపద్దతిలో పెరిగాయి.

అలాగే ఇతర ఆదాయవనరులపరంగా కూడా రెండంకెల వృద్ధి కొంత కలిసొచ్చింది. దీనితో బ్యాంకుల మార్జిన్లు మెరుగుపడ్డాయి. స్థిరాస్తిప్రమాణాలు పటిష్టం అయ్యాయి. రుణాల్లోకూడా పెరుగుదల కనిపించింది. అయితే నిర్వహణ ఖర్చులుమాత్రం పెరగడం కొంత నిరాశకలిగించింది. ప్రభుత్వరంగ బ్యాంకుల నికరలాభాలు 17.5శాతం పెరిగి0.55 లక్షలకోట్లుగా ఉంటే ప్రైవేటురంగ బ్యాంకులు 3.2శాతం మాత్రమే వృద్ధిని నమోదుచేసి 0.45 లక్షలకోట్లు ఆర్జించాయి.

కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎక్కువగా ట్రెజరీ లబ్దిపెరిగింది. రికవరీలు మెరుగుపడ్డాయి. సాంకేతికంగా రద్దుచేసిన ఖాతాలుకూడా తగ్గాయి. విభిన్న కేటగిరీల్లో రుణాలు కూడాపెరిగాయి. ఇక బ్యాంకింగ్ ఆస్తులపై రిటర్నులు షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకుల్లో స్వల్పంగా ఒక బేసిస్‌పాయింట్‌పెరిగి వార్షికవృద్ధి ప్రాతిపదికన 1.34శాతానికి చేరింది. కేటాయింపులు ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రిటర్న్ ఆన్ అసెట్స్ ఆర్వోయే స్వల్పవృద్ధి మాత్రమే ఉన్నట్లు బ్యాంకింగ్‌ర ంగనిపుణులు అంచనావేసారు.



వాణిజ్యం

## ఐడిఎఫ్‌సి బ్యాంకులో రూ.590 కోట్ల మోసం!

**ఛండీఘర్, ఫిబ్రవరి 22:** ప్రైవేటురంగ బ్యాంకింగ్ సంస్థ ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు రూ.590 కోట్లమేర మోసం జరిగినట్లు గుర్తించింది. హర్యానా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఖాతాల్లో ఛండీఘర్ బ్రాంచ్‌లో ఈ మోసం జరిగిందని, ఇందుకు సంబంధజంచి నలుగురు ఉద్యోగులను కూడా సస్పెండ్‌చేసినట్లు ప్రకటించింది. ప్రభుత్వశాఖల్లో ఒకటి ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకులో తమ ఖాతాలను మూసివేసి మరో బ్యాంకుకునిధులను మళ్లించేందుకు నిర్ణయించింది. అయితే ఆ ప్రభుత్వశాఖ వెల్లడించిన మొత్తానికి, ఖాతాలో ఉన్న మొత్తానికి పొంతన లేకుండా ఉంది. కేటాయింపులపరంగా బ్యాంకు కొంతమూలధనం పక్కకకు పెట్టాల్సి ఉంటుంది. ఒకసారి మోసం గుర్తించిన వెంటనే కేటాయింపులు జరపాలి. బ్యాంకు ప్రాథమికంగా గుర్తించినమోసం డిసెంబరులో బ్యాంకు ఆర్జించిన రూ.503 కోట్లకంటే ఎక్కువగా ఉంది. స్టాక్ ఎక్ఛేంజిలకు ఇచ్చిన నివేదికల్లోకూడా బ్యాంకు వాస్తవాలను తెలిపింది. ఫోరెన్సిక్ ఆడిట్‌కోసం బయటి సంస్థలకు బాధ్యతలిచ్చినట్లు ప్రకటించింది. అనధికారిక, మోసపూరిత లావాదేవీలుజరిగినట్లు ముంబయి కేంద్రంగా ఉన్న ఈబ్యాంకు గుర్తించింది. ఒక్క శాఖలోనే వెల్లడి కావడంతో ఇతర ప్రభుత్వసంస్థలు కూడా తమతమ ఖాతాల వివరాలు వెల్లడించాలని కోరాయి. బ్యాంకు రికార్డుల్లోను, ప్రభుత్వశాఖల నివేదికల్లోను తేడాలున్నాయి. ప్రాథమికంగా మోసం జరిగినట్లు తేలడంతో బ్యాంకు నలుగురు ఉద్యోగులను సస్పెండ్‌చేసింది. మోసం చేసిన మొత్తం రూ.590 కోట్లవరకూ ఉంటుందని బ్యాంకు తన ఫైలింగ్‌లో వెల్లడించింది. పోలీసులకు కూడా ఫిర్యాదుచేసామని, ఇతర ఫిర్యాదులను కూడా చట్టపరమైన సంస్థలకు అందచేస్తున్నట్లుప్రకటించింది. దర్యాప్తుసంస్థలకు పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించింది.

## గ్రీన్ అడ్వాన్స్ పోర్టుపోలియో 10%కి పెంచుతున్న ఎస్‌బిఐ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్‌బ్యాంకు గ్రీన్ అడ్వాన్సుల పోర్టుఫోలియోను 7.5 నుంచి 10శాతానికి పెంచాలనినిర్ణయించింది. కేంద్రం నిర్దేశించిన కర్బన ఉద్గారాల తగ్గింపు విధానానికి అనుగుణంగా హరిత రుణాలను పదిశాతానికి పెంచేందుకునిర్ణయించింది. ఈ రుణాల్లో 25శాతం పూర్తిగా కేటాయించిన గ్రీన్‌డెట్ కౌంటర్లనుంచే అందించడం జరుగుతుంది. మొత్తం అడ్వాన్సుల్లో హరిత రుణాల పోర్టుఫోలియో 1.56శాతంగా నిలిచింది. ఇప్పటికే బ్యాంకు పునరుత్పత్తి విద్యుత్, విద్యుత్‌మొబిలిటీ, గ్రీన్‌హైడ్రోజెన్ రంగాలకుగాను చక్రా కౌంటర్ ప్రారంభించింది. పర్యావరణ ఫోకస్ ఉన్న పరిశ్రమలకు సత్వర రుణసాయం అందించేందుకు ఈ హరిత రుణ విధానం అనుసరించనున్నట్లు చెపుతోంది. ఎస్‌బిఐ ఇప్పటికే గ్రీన్‌మారథాన్ ఆరో ఎడిషన్‌నిర్వహించింది. రన్‌ఫర్‌ల గ్రీనర్ ఇండియా నినాదంతో ముంబయిలో ఐదు, 10, 21 కిలోమీటర్ల కేటగిరీలో రన్‌నిర్వహించింది. ప్రాధాన్యతా కేటగిరీలో వ్యవసాయ రంగానికి ఎక్కువ కేటాయింపులు జరిపిన ఎస్‌బిఐ ఇపుడు క్లీన్ ఎనర్జీ ఉత్పాదక రంగాలను కూడా ఎంపికచేసింది. ఇందులోభాగంగానే పునరుత్పాదక విద్యుత్‌ప్రాజెక్టులు ఈ హరిత రుణ కేటాయింపులపరిధిలోకి వస్తాయి.

## మార్కెట్లకు ట్రంప్ 15% సుంకాల ఎఫెక్ట్

### జిడిపి డేటా, ఎఫ్అండ్ఓ ముగింపు ఈవారం కీలకం





**ముంబయి, ఫిబ్రవరి 22:** ఈక్విటీ మార్కెట్లకు ఈ వారంలో ట్రంప్ కొత్త సుంకాల ప్రభావం పడుతుందన్న అంచనాలుపెరిగాయి. సుప్రీంకోర్టు ట్రంప్ విధించిన ట్యారిఫ్‌లు చెల్లవనిప్రకటించిన క్రమంలో వెనువెంటనే 10శాతం సుంకాలు వేస్తామని, కొన్ని గంటల తర్వాత 15శాతానికి సుంకాలు ప్రపంచ వ్యాప్తంగా 150 రోజులపాటు అమలులో ఉండేటట్లు అమలుచేస్తామని ప్రకటించడంతో ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లపై ఈప్రభావం పడనున్నది. వీటికితోడు ప్రభుత్వం కూడా నాలుగో త్రైమాసిక జిడిపి గణాంకాలను వెల్లడించనున్నది. వీటితోపాటు ఫ్యూచర్స్ ఆప్షన్స్ కాంట్రాక్టులు కూడా ముగింపు ఈ వారంలోనే ఉండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహారించే అవకాశం ఉంది.

దేశీయంగా ఇన్వెస్టర్లు కీలక జిడిపి గణాంకాలపై ఆసక్తిచూపిస్తారు. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల కార్యకలాపాలు, ట్రేడర్ల అంచనాలు ముడిచమురుధరలు, ఎంసిఎక్స్‌లో పసిడిధరలు, డాలరుతో రూపాయి మారకం విలువలు వంటివి ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేస్తాయని అంచనా. ఈనెల 27వ తేదీ 4వ త్రైమాసిక జిడిపి డేటాను ప్రభుత్వం విడుదలచేస్తుంది. అలాగే 24 వతేదీతోనే నెలవారీ ఎఫ్అండ్ఓలు ముగుస్తాయి. ఇప్పటివరకూ ఫిబ్రవరిలో ఎఫ్‌పిఐలు కొనుగోళ్లు ముమ్మరంగానే జరిపారు. వీటితోపాటే ఆసియా, యూరోప్, అమెరికా మార్కెట్లధోరణులను కూడా ఇన్వెస్టర్లు గమనిస్తూట్రేడింగ్ చేస్తారు.

వీటన్నింటికీ మూలం 15శాతం సుంకాలేనన్నది తెలిసిందే. విదేశీ కరెన్సీ నిల్వలు, ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులుకూడా కీలకం అవుతాయని అంచనా. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఈనెలలో 14,177 కోట్ల పెట్టుబడులు కుమ్మరించారు. అదనంగా ఎఫ్‌పిఐలు ప్రైమరీ మార్కెట్లలో రూ.2733.89 కోట్లు పెట్టుబడులుపెట్టారు. మొత్తంగా ఫిబ్రవరిలో పెట్టుబడులు రూ.16,911.55 కోట్లవరకూ ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిణామాల దృష్ట్యా మార్కెట్లలో అనిశ్చితి తప్పదని, అయితే ఎంపికచేసిన రంగాల్లో కొనుగోళ్ల ఉంటాయని స్టాక్ నిపుణులు చెపుతున్నారు.

## టాప్ ఆరు కంపెనీల్లో రూ.64 వేల కోట్లు పెరిగిన ఎంక్యాప్



**ముంబయి, ఫిబ్రవరి 22:** మార్కెట్లలో ఉన్న టాప్ పది అత్యధిక విలువలున్న కార్పొరేట్ కంపెనీల్లో ఆరు కంపెనీల విలువలు రూ.63,478.46 కోట్లు పెరిగాయి. వీటిలో ఎల్అండ్‌టి, భారతీయ స్టేట్‌బ్యాంకులు భారీగా లబ్దిపొందాయి. ఎల్అండ్‌టి మార్కెట్ విలువలు రూ.28,523.31 కోట్లు పెరిగి రూ.6,02,552.24 కోట్లకుచేరితే ఎస్‌బిఐకి రూ.16,015.12 కోట్లుపెరిగి రూ.11,22,581.56 కోట్లకు చేరింది హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు రూ.9617.56 కోట్లుపెరిగి రూ.14,03,239.48 కోట్లకు చేరింది. ఎల్ఐసి కూడా రూ.5977,12కోట్లుపెరిగి రూ.5,52,203.92కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్ రూ.3142.36కోట్లుపెరిగి రూ.6,40,387 కోట్లకు చేరితే రిలయన్స్ గ్రూప్ 202.99 కోట్లుపెరిగి రూ.19,21,678.78కోట్లకు చేరింది. ఇకభారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువలు రూ.15,338.66 కోట్లు క్షీణించి రూ.11,27,705.37 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు కూడా రూ.14,632.10 కోట్లు క్షీణించి రూ.9,97చ346.67 కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ ఎంకాప్ రూ.6791.58 కోట్లు క్షీనించి రూ.5,48,496.14 కోట్లకు చేరితే టిసిఎస్ కూడా రూ.1989.95 కోట్లు క్షీణించి రూ.9,72,053,48 కోట్లకు చేరింది. అయితే ఎప్పటిలాగే రిలయన్స్ టాప్ వన్‌గా నిలిస్తే ఆ తర్వాత స్థానాల్లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, భారతీయ స్టేట్‌బ్యాంకు, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్అండ్‌టి ఎల్ఐసి, ఇన్ఫోసిస్ కంపెనీలు నిలిచాయి.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | సోమవారం 23 ఫిబ్రవరి 2026 | I

## నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం

# ఇంద్రజాలికలను ప్రభుత్వం మరింతగా ఆదుకోవాలి : డాక్టర్ చల్లగాలి



**రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త)** ప్రఖ్యాతిగాంచిన ఇంద్రజాలకుడు పిసి సర్కార్ జయంతి సందర్భంగా ప్రపంచ ఇంద్రజాలకుల దినోత్సవం మెజీషియన్స్ అందరూ జరుపుకుంటారు రాజమహేంద్రవరానికి చెందిన ప్రపంచ ఇంద్రజాలికుల లో ఒకరైన బహుముకి కళా ప్రపూర్ణ తెలుగు తేజం ఇంద్రజాల వరిష్ట వంటి ఎన్నో ప్రపంచ స్థాయి అవార్డులు రివార్డులు అందుకున్న ప్రముఖ ఇంద్రజాలకులు డాక్టర్ చల్లగాలి శ్రీనివాస్ వర్మ అలియాస్ మ్యాజిక్ వర్మ ప్రపంచ నలుమూలల అనేక వేల ప్రదర్శనలు చేశారు చూబులైట్లను బ్లేడ్లను పరపర కరకర నెమలి మింగేయడం మన ట్యూబ్ లైట్ వర్మ ప్రత్యేకత డాక్టర్ వర్మ ఇప్పటివరకు 6823 చూపులైట్లను 69 25 బ్లేళ్లను నెమలి మింగినట్లు డాక్టర్ వర్మ తెలిపారు రామోజీ ఫిలిం సిటీ మెజీషియన్ గా కొంతకాలం చేసి తదనంతరం మౌంట్ అపేరా లో కూడా ఈవెన్ మేనేజర్ గా చేసి లక్షలాదిమంది ప్రేక్షకులని అలరించారు శ్రీనివాస్ వర్మ మ్యాజిక్ మిమిక్రీ టాకింగ్ డాల్ ఫైర్ డాన్స్ అండ్ పై రేటింగ్ తో పాటుగా రచనలు చేయడం విశేషం ఒక వ్యక్తిలో ఒక కల సంతరించుకోవడమే గొప్ప విషయం అటువంటిది డాక్టర్ చల్లగాలి శ్రీనివాస్. వర్మ సకల కళా కోవిధులు సకల కళా వల్లభుడు ఇంద్రజాల ఇంద్రుడు బహుముఖ కళా ప్రపూర్ణ వంటి బిరుదులు అందుకున్నారు డాక్టర్ వర్మ 2010లో చల్లగాలి సాంస్కృతిక సామాజిక సేవా సంస్థను స్థాపించి సేవలందిస్తున్నారు 2023లో దివంగత తన కుమారుడు పేరిట శోభిత్ వర్మ



చారిటబుల్ ట్రస్ట్ ను స్థాపించి ప్రతినెల ముగ్గురు కళాకారులను ముగ్గురు సంఘ సేవకులను రాజమహేంద్రవరంలోని స్థానిక సరస్వతి ఘాట్ వద్ద సత్కరిస్తున్న విషయం తెలిసిందే ప్రతి ఒక్క కళాకారుడికి ఇన్సూరెన్స్ ఐడి కార్డులను అర్హత కలిగిన కళాకారులకు పెన్షన్లు ఇళ్ల స్థలాలు వంటివి మంజూరు చేయాలని ఉగాది పురస్కారాలు కూడా ఇచ్చిన వారికే ఇవ్వకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇవ్వాలని డాక్టర్ చల్లగాలి శ్రీనివాస్ వర్మ తెలిపారు

## రాజమహేంద్రవరం అనూరియా కేసులపై అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

### కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ దర్యాప్తు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో** జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం లో అనూరియా (మూత్రం ఆపోవడం) కేసుల క్లస్టర్‌పై జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కే. వెంకటేశ్వరరావు తెలియజేసిన వివరాలు ప్రకారం ఆదివారం రాజమహేంద్రవరం కిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ నుండి లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వరనగర్ మరియు స్వరూప్‌నగర్ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు అనూరియా లక్షణాలతో ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం అందించింది . వెంటనే జిల్లా సర్వైలెన్స్ అధికారికి సమాచారం అందించి అత్యవసరంగా విచారణ ప్రారంభించామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా సర్వైలెన్స్ అధికారి, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ మరియు ఎపిడెమిక్ సెల్ బృందం కిమ్స్ ఆసుపత్రిని సందర్శించి బాధితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. వైద్యుల ప్రాథమిక నివేదికలు, కుటుంబ సభ్యుల వివరాలు మరియు కేసు చరిత్ర ఆధారంగా ఆకస్మిక మూత్రపిండ వైఫల్యం అనుమానం వ్యక్తం అవుతుంది ఫీల్డ్ స్థాయి విచారణలో బాధితులందరూ ఒకే స్థానిక పాల విక్రేత వద్ద నుండి పాలు కొనుగోలు చేసి వినియోగించినట్లు గుర్తించినట్లు తెలిపారు. తదుపరి సర్వైలెన్స్ తనిఖీలో మరో నాలుగు కేసులు ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో గుర్తించబడడంతో మొత్తం కేసుల సంఖ్య ఎనిమిదికి చేరుకున్నాయి. బాధితులందరూ 60 సంవత్సరాల పైబడినవారు కాగా, రాజమహేంద్రవరం పరిధిలోని చౌడేశ్వరనగర్ మరియు స్వరూప్‌నగర్ ప్రాంతాల్లోని నాలుగు కుటుంబాలకు చెందినవారిగా గుర్తించారు. ప్రస్తుతం అంటువ్యాధి లక్షణాలు ఉన్నట్లు ఆధారాలు లేవు. కొత్త కేసులు నమోదు కాలేదు. కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసి సమగ్ర ఎపిడెమియాలజికల్ , క్లినికల్ విచారణ చేపట్టారు. ఆహారం, నీరు, మల నమూనాలు సేకరించి ప్రయోగశాల పరీక్షలకు ,ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించామన్నారు. అనుమానిత పాల వనరును ఫుడ్ సేఫ్టీ అధికారి పరిశీలించి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం, పాలు వినియోగంపై అవగాహన కల్పించడం , ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందనీ ఆమె తెలిపారు ప్రస్తుతం ప్రజారోగ్య పరంగా పరిస్థితి స్థిరంగా ఉంది. ప్రయోగశాల నివేదికలు మరియు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ తుది నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోబడతాయనీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తెలియ చేశారు.

## ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి నష్టం



**రావులపాలెం, ఫిబ్రవరి 22: ప్రభాతవార్త** జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షురాలు జేసీ యశస్విని అధికారిక పర్యటనలో భాగంగా జేసీఐ రావులపాలెం ఆధ్వర్యంలో 100 మొక్కలు నాటడం, 100 స్టీల్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జోన్-26 అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ కామిశెట్టి, ఉపాధ్యక్షుడు లక్కం రవీంద్ర రెడ్డి, పర్యటన కోఆర్డినేటర్ అరవింద్, జోన్ డైరెక్టర్ అల్లం వర ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక శాఖ అధ్యక్షుడు చింతా రాంబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వినియోగం వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతుందని, వాటికి బదులుగా పునర్వినియోగానికి అనువైన స్టీల్ బాటిల్స్ వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నం తేజా రెడ్డి, జేసీ సుబ్బా రెడ్డి, జేసీ చల్లా నరేష్, జేసీ కుమారి, జేసీ మోహన్, జేసీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉద్యానవనం వద్ద హ్యాపీ సండే



**అమలాపురం, ఫిబ్రవరి22, ప్రభాతవార్త** అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం వద్ద హ్యాపీ సండే (ఆనంద ఆదివారం)లో భాగంగా యోగా,ప్రాణాయామం నిర్వహించారు.యోగా గురువు డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వర రావు మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డ్ సెక్రెటరీలు, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు, విద్యార్థులచే యోగాసనాలు,ప్రాణాయామం చేయించారు..అనంతరం వాకింగ్ (నడక)నిర్వహించారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఇంచార్జి కమిషనర్ డీఈఈ కె.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండవ,నాల్గొవ ఆదివారాల్లో హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.హ్యాపీ సండేలో పట్టణ యువత,మహిళలు, వృద్ధులు ,చిన్నారులు అందరినీ భాగస్వామ్యం చేస్తూన్నా మన్నారు.మానసిక ఒత్తిడిని తగ్గించుకుని,సంపూర్ణ ఆరోగ్యం తో ఉల్లాసంగా,ఉత్సాహంగా ఉండే విధంగా జరుపుతున్నా మన్నారు. సైక్లింగ్,నడక, జాగింగ్, యోగా,క్రీడలు,వ్యాయామాలు, ఆటలు,సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీతం,నృత్యం వంటి ఆనందాన్ని ఇచ్చే కార్యక్రమాలను సామాజిక,సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల సహకారంతో మున్సిపాలిటీ ద్వారా నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ డి.ప్రభాకర రావు,ఆర్. వో బి. శ్రీలక్ష్మి,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బి. సంయుక్త రాణి,అర్బన్ స్వర్ణ వార్డ్ ఆఫీసర్ జి.శ్రీహరి, టీడీపీ నాయకులు ఆశెట్టి ఆదిబాబు,మున్సిపల్ సిబ్బంది,స్వర్ణ వార్డ్ సెక్రెటరీలు, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓఎన్‌జిసి డ్రిల్లింగ్ పనులకు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసన



**అయినవిల్లి ఫిబ్రవరి 22 ప్రభాతవార్త** అయినవిల్లి మండలం వీరవెల్లిపాలెం గ్రామంలో గ్యాస్ పెట్రోల్ అన్వేషణ కొ రకు ఓఎన్జిసి సంస్థ డ్రిల్లింగ్ పనులు చేపట్టింది భారీ వాహనాలు రాకపోకలు డ్రిల్లింగ్ పనులు చేపట్టడంతో గ్రామస్తుల్లో ఆందోళన చెలరేగింది ఇరుకు రోడ్డు కావడంతో భారీ వాహనాలు రాకపోకలవలన ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు ఆదివారం గ్రామస్తు ఫ్లెక్సీ కార్డుతో నిరసన తెలిపారు కానీ తక్కువ మంది నిరసనకారులు పాల్గొన్నారు వీరు ఆందోళన చేపట్టి ఓఎన్జిసి సంస్థ పనులు నిలిపివేయాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు.గ్రా. గన్నవరం సీ.ఐ .ఆర్.భీమరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆందోళనకారులు విజ్ఞప్తి చేస్తూ ఓఎన్జిసి వాహనాలు కారణంగా తమకు రాకపోకల సమస్యలు ఏర్పడుతున్నాయని టెన్త్ క్లాసు ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయ్యే వరకు పనులు నిలుపుదల చేయాలని కోరారు అయితే ఓఎన్జిసి త్రవ్వకాలు నిలిపివేసే అధికారం తమకు లేదని కలెక్టర్కు ఫిర్యాదు చేసుకోవాలని ఆయన తెలిపారు తక్కువ మంది నిరసన కారులు పాల్గొనడం వల్ల వారికి పోలీసుల నచ్చచెప్పి పంపించారు అయినవిల్లి ఎస్ఐ జ్యోతి మాట్లాడుతూ సెక్షన్ 30 అమలులో ఉన్నందున నిరసనలు ప్రదర్శనలు నిర్వహించరాదని ఆందోళనకారులకు తెలిపారు నిరసనకారుల పేర్లను నమోదు చేసి వారితో చర్చించనున్నట్లు తెలిపారు

## ప్రభుత్వ సంకల్పానికి అధికారుల తూట్లు




**దేవరపల్లి, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** దేవరపల్లిలో చెత్త సంపద కేంద్రాలు మందుబాబులకు అడ్డా మారాయి. కోట్ల రూపాయలు వెచ్చించిన ప్రభుత్వ సంకల్పం నీరు గారుతుంది. సంబంధిత శాఖ అధికారుల అలసత్వం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. దేవరపల్లిలో మొదటగా 2014 లో ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మండలంలోని ప్రతి గ్రామంలో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటుకు 7: 50 లక్షలు రూపాయలు వెచ్చించారు. అప్పట్లో దేవరపల్లి చెత్త సంపద కేంద్రం తాటి ఆకు పాకలతో వేశారు. ఈ ఏడాది మరొకసారి ఐదున్నర లక్షలు కేటాయించి రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. ఇవన్నీ పంచాయతీ రాజ్. మండల పరిషత్. ఉపాధి హామీ పథకం నిధులతో సమకూర్చారు. కానీ వాటిని నిర్వహణలో సంబంధిత అధికారులు దృష్టి పెట్టకపోవడంతో అవి మరుగున పడిపోతున్నాయి. మరోపక్క గ్రామాల్లో ఎక్కడ చూసినా రోడ్ల పక్కన చెత్త కుప్ప తెప్పలుగా దర్శనం ఇస్తున్నాయి. అయినా పంచాయతీ అధికారులు నామమాత్రంగా మాత్రమే పనులు నిర్వహిస్తున్నారు మండల కేంద్రంలో పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను అధికారులు చిత్తశుద్ధితో పనిచేయకపోవడంతో వాటి పరిస్థితి ఇలానే ఉంటాయి. ఈ సమస్యపై మండల ఈవో పి ఆర్ డి. ప్రస్తుత దేవరపల్లి పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి రాజారావు ను వివరణ కోరగా మండలంలో చెత్త సంపద కేంద్రాలు అన్ని పనిచేస్తున్నాయని సమాధానం తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు. మండల స్థాయి అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పనులు విషయంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు మండల ప్రజలు కోరుతున్నారు.

## కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన వనమాడి కొండబాబు:



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో కాకినాడ ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త )** ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆదివారం కాకినాడ సిటీ శాసనసభ్యులు వారి స్వగ్రాహం జగన్నాధపురం నందు లక్ష్మీ డీప్ వాటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికుల ముగ్గురు కుటుంబాలకు, వినాయక డీప్ వాటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికుల ఇద్దరు కుటుంబాలకు శాసనసభ్యులు వనమాడి కొండబాబు చేతుల మీదుగా లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం చెక్ లను అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాకినాడ యాంకరేజ్, డీప్ వాటర్ పోర్ట్ పై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయంతో పాటు, యూనియన్ ద్వారా ప్రతి కార్మికుడు కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించి మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ గదుల సాయిబాబా, లక్ష్మీ డీప్ వాటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పట్టా ధనలక్ష్మి, పాలెపు రాజు, వినాయక డీప్ వాటర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఓలేటి పాండురంగడు, బలసాడి శ్రీను, పాలెపు దుర్గారావు, ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల శాశ్వత అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం



**యు.కొత్తపల్లి, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త) :** మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి వంద రోజులు గడువు కావాలని పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉప్పాడ వేదికగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోబోతున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రావు అక్షయ్ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తీర ప్రాంతం గ్రామాల మత్స్యకారుల దీర్ఘకాల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసారని, ఒక నిర్దిష్టమైన దీర్ఘకాలిక పరిష్కార మార్గాలను రూపొందించడం అభినందనీయమన్నారు. సంబంధిత అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంపొందించేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, ఈ ప్రణాళికను తొందరలోనే పిఠాపురం విచ్చేసి స్వయంగా ప్రకటించనున్నారని తెలియజేశారు. అంతేకాకుండా సమాజంలో ని అన్ని వర్గాల ప్రజలు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్న నాయకుడని కొనియాడారు.

## శ్రీ మందేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి భక్తుల సౌకర్యాలపై చైర్మన్ సంతృప్తి

### దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆలయ ఈవో సురేష్ బాబు



**కొత్తపేట, ఫిబ్రవరి 22,(ప్రభాతవార్త)** కొత్తపేట మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఉమా మందేశ్వర(శనీశ్వర) స్వామి వారి ఆలయ అభివృద్ధి భక్తుల సౌకర్యాలపై దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఫ్యామిలీ మెంబర్ పూసపాటి అశోక గజపతిరాజు సంతృప్తి వ్యక్తం చేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆలయ ఈవో దారపు రెడ్డి సురేష్ బాబు తెలిపారు దేవస్థానం నూతన ధర్మ కర్తలి మండలి సమావేశం ఆదివారం విజయనగరం కోట లో చైర్మన్ అశోక గజపతి రాజు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించినట్లు సురేష్ బాబు తెలిపారు ఈ సమావేశంలో ఆలయ నిర్వహణ పూజా విధానాలు భక్తుల సౌకర్యాలు దేవస్థానం లో గోదావరి పుష్కరములు అభివృద్ధి పనులు ఇతర విషయములను ఆలయ కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు చైర్మన్ అశోక్ గజపతి రాజుకు వివరించినట్లు ఈ ఓ సురేష్ బాబు తెలిపారు ఆలయంలో జరిగే పూజా విధానాలు అభివృద్ధి కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేసి మాస్టర్ ప్లాన్ భక్తుల సౌకర్యాలపై సూచనలను ఇచ్చారన్నారు దేవాలయధర్మకర్తలు అందరూ సమిష్టిగా ఆలయ అభివృద్ధికి భక్తుల విశ్వాసాలు సౌకర్యాలకు సహకరించవలసినదిగా సూచించినట్లు తెలిపారు అలాగే గోదావరి పుష్కరములు సందర్భంగా దేవస్థానం నందు ప్రారంభించబోవు రూ3.00 కోట్ల రూపాయలతో తైలాభిషేక మండపాల నిర్మాణమునకు ఆన్లైన్ టెండరు పరిశీలించి ఆమోదించారన్నారు అదేవిధంగా పలు అజెండా అంశములను పరిశీలించి ఆమోదింవారన్నారు ఈ ధర్మకర్తల మండలి సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ నేరెడుమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు గవర వీర వెంకట సత్యనారాయణ చిలకమర్తి అనంత లక్ష్మి సావిత్రి శ్రీనివాస్ దేవపాటి వెంకటేశ్వర రావు తణుకు వీరభద్రరావు కముజు స్వప్న దేవస్థానం సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు ఈ సమావేశమునకు మందపల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యులు సిద్ధంశెట్టి వీర వెంకట సత్యనారాయణ పాల్గొని చైర్మన్ ను మర్యాదపూర్వకంగా కలిసి వారిని దేవస్థానమునకు విచ్చేయాలని కోరారు అన్నారు

## లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు...



**ఆత్రేయపురం, ఫిబ్రవరి, 22,(ప్రభాత వార్త )** ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత, మనోధైర్యం లభిస్తాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.ఆత్రేయపురంగ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పండితులు ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు (రమణబాబు), సుదర్శనం సూర్య పురుషోత్తమ సత్యసాయి ల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వాడపల్లి పవన్ దీక్షితులు, నేతృత్వంలో తొలుత సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యావాసనం, దీక్షాధారణ, అకల్మష హోమం, దిగ్దేవత ప్రార్థన, తదితరు కార్యక్రమాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు,చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు, రాజ్యలక్ష్మి దంపతులు శ్రీ స్వామి వారి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆదివారం మొదలైన శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. వారికి ఆలయ శాశ్వత ధర్మకర్తలు,చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు,ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఏకాదశ బ్రహ్మోత్సవాలు ప్రారంభంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. బ్రహ్మాండనాయకుడైన స్వామివారి ఆలయాన్ని అద్వితీయంగా నిర్మించి, నాటి నుంచి తిరుమలలో నిర్వహించిన మాదిరిగా ఇక్కడ కూడా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ ఉండటం, ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో 120 మంది వరకూ స్వామివారి గోవిందమాల ధరించి బ్రహ్మోత్సవాల నిర్వహణలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. 11సంవత్సరాలుగా స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న పాతపాటి సోదరుల కృషిని ప్రశంసించారు. పాతపాటి నాగరాజు, రామాంజనేయరాజు, సత్యనారాయణరాజు సోదరులు హైదరాబాదులో ఉంటున్న తమ స్వగ్రామమైన ఆత్రేయపురంలో సైతం లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి ఆలయం ఉండాలనే సంకల్పంతో గొప్పగా ఆలయాన్ని నిర్మించడం జరిగిందన్నారు.సాయంత్రం మృత్సంగ్రహణం,(పుట్టమన్ను తెచ్చుట), అంకురార్పణ, అగ్ని మధనం, అగ్ని ప్రతిష్టాపన, వాస్తు పూజ, వాస్తు హోమం, దోచారోహణ తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి అనంతరం శ్రీ స్వామివారి శేష వాహనంపై తిరుమడవీధుల్లో వివిధ సంస్కృత కార్యక్రమాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఈరోజు ఈ కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, కూసంపూడి రామకృష్ణరాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, గనిశెట్టి వీరేష్, ఆలయ మేనేజర్ గోరింట వినయ్ కుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ మరింత బలోపేతం :ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న జనసేన పార్టీ సభ్యత్వ నమోదు పై పార్టీ కార్యకర్తలకు రూరల్ ఎమ్మెల్యే నానాజీ దిశ నిర్దేశం చేశారు. ఆదివారం కాకినాడ బాలజీ చెరువు కాస్మో క్లబ్ లో రూరల్ నియోజకవర్గం క్రియాశీలక సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉద్యమి, సాధక్, ప్రదాత గురించి వివరించి పార్టీ సిద్ధాంతాలను నమ్మిన ప్రతి ఒక్క జన సైనికులు, వీర మహిళలతో సభ్యత్వ నమోదు చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కోసం నన్ను సమన్వయకర్తగా నియమించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు జనసైనికులు పాల్గొన్నారు.

## లడ్డూ కల్తీ పాపం జగన్‌దే.. మంత్రి వాసంశెట్టి సుభాష్,



**అమలాపురం,పిబ్రవరి22, ప్రభాతవార్త** తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ డిమాండ్ చేశారు.ఆదివారం అమలాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యాలను,తిరుమల పవిత్రత ను దెబ్బతీసిన తీరును ఎండగట్టారు.డార్క్ రూమ్ పాలన చేసిన జగన్ చీకటి రాజకీయాలు మానుకోవాలన్నారు.దేవుడితో ఆటలాడితే ఆ ఏడుకొండలవాడు చూస్తూ ఊరుకోరు అన్నారు. సాక్షాత్తు దేవునితో రాజకీయాలు చేసే దుస్థితికి వైసీపీ దిగజారి పోయిందని ఘాటుగా విమర్శించారు.అమలాపురం ఎంపీ ఎంపీ ?గంటి హరీష్ బాలయోగి మాట్లాడుతూ 151 సీట్ల నుండి 11 సీట్లకు దిగజారినా జగన్ తీరు మారలేదన్నారు. సాక్షాత్తు భగవంతుడి ప్రసాదం విషయంలోనూ అబద్ధాలు ఆడుతూ భక్తులను మోసం చేస్తున్నారన్నారు.అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో వ్యవస్థలన్నీ కుప్పకూలాయి అన్నారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో విఫలమైన వైసీపీకి ప్రజలే బుద్ధి చెప్పారన్నారు. చెప్పులు వేసుకుని తిరిగి భక్తుల మనో భావాలను దెబ్బ తీసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఈసారి ఎన్నికల్లో 11 కాదు ఒక సీటు మాత్రమే వస్తుందని ఎమ్మెల్యే జోస్యం చెప్పారు.ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ వైసీపీ నాయకులు దేవుడిని కూడా రాజకీయం కోసం వాడుకుంటున్నారన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులను వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ అలిపిరి వద్ద మద్యం బాటిల్స్ పెట్టి అల్లరి చేసిన చరిత్ర కరుణాకర్ రెడ్డి అనుచరుల దన్నారు.వీరి అరాచకాలను ఆ వేంకటేశ్వర స్వామే చూసుకుంటా డన్నారు.టిడిపి జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా కోసం జగన్ భిక్షాటన చేస్తున్నారనన్నారు. జగన్ తుగ్లక్ పాలనతో రాష్ట్రాన్ని చీకట్లోకి నెట్టేసిన వైసీపీ, ఇప్పుడు తప్పును కప్పిపుచ్చుకోవాలని చూస్తోందనన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నేతలు పాల్గొన్నారు.

## పార్టీలు, పదవులు శాశ్వతం కాదు.. కుల ఐక్యతే ముఖ్యం..

### రాష్ట్ర కార్మికశాఖా మంత్రి సుభాష్..




**అంబాజీపేట, ఫిబ్రవరి 22, (ప్రభాతవార్త):** పార్టీలు,పదవులు శాశ్వతం కాదని,కుల ఐక్యతే ముఖ్యమని,కుల ఐక్యత కోసం ఆది నుండి పోరాటం చేసిన గడ్డ గంగలకుర్రు అగ్రహారంలో శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని గంగలకుర్రు అగ్రహారంలో ఆదివారం శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం పార్టీల కతీతంగా జరిగింది. శెట్టిబలిజ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శెట్టిబలిజ స్మారక చిహ్నాము ప్రారంభించారు. అనంతరం శెట్టిబలిజ సీనియర్ నాయకుడు మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి అధ్యక్షత వహించిన సదస్సులో మంత్రి సుభాష్ మాట్లాడుతూ శెట్టిబలిజ ఐక్యత ఈనాటిది కాదని పోస్టుకార్డుల వినియోగం ముమ్మరంగా ఉన్న ఆనాటి రోజుల నుండే ప్రారంభమైందని శెట్టిబలిజలకు ఆనాటి నుండి గుర్తింపు తెచ్చిన దొమ్మేటి వెంకటరెడ్డి చిరస్మరనీయుడని పేర్కొన్నారు. పార్టీలు, పదవులు శాశ్వతం కాదని కుల ఐక్యత ముఖ్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను వ్యక్తిగతంగా శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ ను స్థాపించి కోటి విరాళం ఇచ్చారన్నారు. వన భోజనాలు, పేదలకు ఉచిత వైద్య, విద్య సౌకర్యాలను తన స్వంత నిధులతో, నిర్వహిస్తూ మరోపక్క సేవా కార్యక్రమాలు తన వ్యక్తిగతంగానే నిర్వహిస్తున్నానన్నారు. గతంలో తాను ఒక పదవి కోసం ఆశించి భంగపడ్డానని ఆ సమయంలో రాజకీయాలనుండి విరమించుకుందామని అనుకున్నానని,అయితే అదే రోజు రాత్రి తనకోసం తన ఇంటి వద్ద అర్ధరాత్రి సమయంలో కూడా సుమారు 2000 మంది వర్గీయులు, తనకు పదవి ఉన్న లేకున్నా నీ వెంటే ఉంటామని పేర్కొనడంతో కొండంత ఆశ కలిగిందన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం, తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుత్తుల మీరా కుమార్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు,టిడిపి జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి తదితరులు మాట్లాడారు. అంతకుముందు దొమ్మేటి వెంకటరెడ్డి, రాయుడు సత్తిబాబు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**బిఆర్ఎస్ ను భూస్థాపితం చేస్తా..**

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తెలంగాణలో బీసీ సామాజిక వర్గంలోని శెట్టిబలిజలకు తీవ్ర అన్యాయం చేశారని మంత్రి సుభాష్ మండిపడ్డారు.బిఆర్ఎస్ ను ఆంధ్రాలో విస్తరింప చేసేందుకు ప్రయత్నాలు చేస్తే ఆదిలోనే భూస్థాపితం చేద్దామని,దీనికి శెట్టిబలిజలు కంకణం కట్టుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు,సర్పంచి దొంగ నాగేశ్వరరావు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి భరత్ భూషణ్, విత్తనాల ఇంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, గూడాల ఫణి,రాయుడు కృష్ణ మహేష్, రాయుడు షణ్ముఖ్, మట్టపర్తి సతీష్, సంసాని మురళి, దొంగ హరి, మట్టపర్తి విజయ్, మట్టపర్తి జలందర్ తదితరులు ఉన్నారు.

## ఉట్రుమిల్లిలో భారీ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ..



**రామచంద్రపురం,ఫిబ్రవరి 22,(ప్రభాతవార్త):** జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు రామచంద్రాపురం డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో పట్నంలో శాంతిభద్రతలు మరింత పటిష్టం చేయడం,నేర కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా రామచంద్రపురం సబ్ డివిజన్ పోలీసు శాఖ ఆదివారం ఉట్రుమిల్లి అపార్ట్మెంట్స్ ,గ్రామ పరిసరాల్లో భారీ కార్డన్ సెర్చ్ (సమగ్ర తనిఖీలు) నిర్వహించారు.శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణే ధ్యేయంగా తనిఖీలు చేపట్టారు.అపార్ట్మెంట్లో అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించారు.తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు.సిఐ వెంకటనారాయణ సిబ్బందితో కలిసి అపార్ట్మెంట్లో ఉన్న ప్రతి ఇల్లు,పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.గ్రామంలో నేరాలను అరికట్టడానికి మరిన్ని సిసి టీవీ కెమెరాల ఏర్పాటు అవసరమని, ముఖ్యంగా ఆలయాలు,విగ్రహాల వద్ద లైటింగ్ మరియు కెమెరాలు ఉండేలా ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు.అలాగే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వాడకంపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా డీఎస్పీ రఘువీర్ స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో కొత్త వ్యక్తులు లేదా అనుమానిత కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని ప్రజలకు సూచించారు.ఈ కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో రామచంద్రాపురం ఎస్ఐ నాగేశ్వరరావు,ద్రాక్షారామం ఎస్ఐ ఎం.లక్ష్మణ్, పామర్రు ఎస్ఐ జి.సోమేంద్ర మరియు సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...

## జిల్లా సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్‌చైర్మన్ కరుటూరికి పితృవియోగం



**ఆత్రేయపురం, ఫిబ్రవరి, 22,(ప్రభాత వార్త )** జిల్లా సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహ రావు తండ్రి ర్యాలి రూరల్ బ్యాంకు మాజీ అధ్యక్షులు తెలుగుదేశం సీనియర్ నాయకులు కరుటూరి కృష్ణ మూర్తి (86) ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతిపట్ల కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్,వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కుదప కృష్ణమూర్తి, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, జుజ్జువరపు శ్యామల, హరిబాబు, నరాలశెట్టి సుబ్బలక్ష్మి, వెంకన్న, కాయల జగన్నాథం, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, తోటకూర సుబ్బరాజు, మండల కుటమి నాయకులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే కరుటూరి కృష్ణమూర్తి కరుటూరి కృష్ణమూర్తి భౌతికకాయానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. భౌతికకాయంపై టిడిపి జెండాను కప్పి పార్టీకి ఆయన చేసిన సేవలనుగుర్తు చేసుకున్నారు. పితృవియోగంతో బాధపడుతున్న కరుటూరి నరసింహారావును ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, గ్రామ సర్పంచ్ ముత్తా బత్తుల రాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, జుజ్జువరపు శ్యామల, హరిబాబు, నారాలశెట్టి సుబ్బలక్ష్మి, వెంకన్న, కాయల జగన్నాథం, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, తోటకూర సుబ్బరాజు, కుటమి నాయకులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## క్యాన్సర్ స్క్రీనింగ్ ఆశా వర్కర్లతో సమావేశం



**పి. గన్నవరం ఫిబ్రవరి 22 (ప్రభాత వార్త)** మండలంలోని ఆశా వర్కర్లు మరియు ఏ ఎన్ ఎం లతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ. ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 'పవన్ అన్న ఆరోగ్య భరోసా' మరియు 'పవన్ అన్న నేత్ర రక్ష' కార్యక్రమాలను విజయవంతం చేయడంలో వీరి పాత్ర కీలకమని ఎమ్మెల్యే కొనియాడారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా, అహర్నిశలు ప్రజల కోసం శ్రమిస్తున్న ఆశా వర్కర్లు మరియు ఏ ఎన్ ఎం ల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ, వారికి తన సొంత ఖర్చులతో ఉచితంగా 'క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు' చేయిస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సేవ చేసే వారి ఆరోగ్యం బాగున్నప్పుడే సమాజం బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## భాష్యంలో ఘనంగా ఫేర్‌వెల్ డే



**దేవరపల్లి, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** భాష్యం స్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ డే కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో సాగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవరపల్లి మండల విద్యాశాఖాధికారి కె. భరత రాజు మాట్లాడుతూ, విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని పదవ తరగతి అనంతరం తమ ఆసక్తికి అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే విజయాలు సాధ్యమవుతాయని తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ పి. పేరయ్య నాయుడు మాట్లాడుతూ, వీడ్కోలు సభ తీపి జ్ఞాపకాలను మిగిల్చే భావోద్వేగ క్షణమని పేర్కొన్నారు. జీవితంలో మరో అధ్యాయానికి అడుగుపెడుతున్న విద్యార్థులను చూసి ఉపాధ్యాయులకు గర్వంగా ఉంటుందని, వారి విజయాలను తమ విజయాలుగా భావిస్తామని అన్నారు. ఓర్పు, ధైర్యం, దయ, క్రమశిక్షణ వంటి విలువలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాష్యం ఛాంప్స్ ప్రిన్సిపాల్ షేక్ షబానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'మన స్థాయిని పెంచేది విద్యే'



**గోపాలపురం ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** యువత విద్యపై దృష్టి పెట్టి అనుకున్న లక్ష్యాలను సాధించాలని పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ గోపాలపురం మండల అధ్యక్షులు దొడ్డిగర్ల వెంకటేష్ అన్నారు. పెద్దగూడెంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఇంటర్ పరీక్షలు వ్రాసే విద్యార్థులకు విద్య సామాగ్రిని అందజేశారు. పార్డ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది దళితులు గతంలో ఎంతో కష్టపడి విద్యను అభ్యసించి నేడు ఎంతో ఉన్నతమైన స్థితిలో ఉండడం ఆనందించదగ్గ విషయమన్నారు. పార్డ్ సంస్థ సెక్రటరీ చింతలపూడి భాస్కరరావు మాట్లాడుతూ.. విద్య ద్వారానే పేదరికం నిర్మూలన అవుతుందన్నారు. ఎంతోమంది యువకులు ఉన్నత విద్యను అభ్యసించి పేదరికాన్ని జయించి, అభివృద్ధి చెందారని గుర్తు చేశారు. సంఘ కోశాధికారి కొండలరావు మాట్లాడుతూ.. యువకులు విద్యతో పాటు క్రీడలు, సమాజ సేవ వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి నాణ్యమైన విద్యను అభ్యసించి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ గోపాలపురం మండల శాఖ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని, ప్రతి ఒక్కరు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలు వ్రాసే సుమారు 30 మంది విద్యార్థులకు పరీక్షలు రాసే ప్యాడ్లు, పెన్నులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వింజుమూరి సుబ్బారావు, గుమ్మడి నాగేశ్వరరావు, సరిపల్లి వెంకటేష్, పాముల తిరుపతయ్య పాల్గొన్నారు.

## అధ్యక్ష,కార్యదర్శుల బాధ్యత చాలా ప్రధానమైనది.. మంత్రి సుభాష్..




**అంబాజీపేట,ఫిబ్రవరి 22, (ప్రభాతవార్త):** పార్టీ అభివృద్ధిలో అధ్యక్ష, కార్యదర్శుల బాధ్యత చాలా ప్రధానమైనదని,అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి శుభాష్ సూచించారు.ఇటీవల అంబాజీపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన గూడాల ఫణి వీర వెంకట భ్రమరేశ్వర్లు (ఫణి), రవణం శ్రీరాములు (రాము)లను మంత్రి సుభాష్ అభినందించి, చిరు సత్కారం చేశారు. మాచవరం పంచాయతీ పరిధిలోని పేర్మియాపాలెంలో ఫణి ఇంటికి మంత్రి సుభాష్ ఆదివారం విచ్చేశారు. ఆయన వెంట పలువురు టిడిపి శ్రేణులు ఉన్నారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు 2026 సన్నాహక సమావేశం:



**జగ్గంపేట ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త )** జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జగ్గంపేట పరిణయ ఫంక్షన్ హాల్ లో క్రియాశీలక సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల జనసైనికులు జనసేన నాయకులు హాజరయ్యారు. అలాగే పవన్ కళ్యాణ్ నూతనంగా ఉద్యమి సాధక్ ప్రదాత పేర్లతో పార్టీకి మూడంచల వ్యవస్థ పరిచయం చేయడంతో వాటి యొక్క విశిష్టతను ఈ కార్యక్రమంలో నాయకులతో రమేష్ చర్చించారు. అలాగే క్రియాశీలక సభ్యత్వాలు చేయడానికి ఉత్సాహం గా తమ పేర్లను ను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మరియు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ కార్యకర్తల క్షేమం కోసం క్రియాశీలక సభ్యత్వం తీసుకొచ్చి వారికి వారి కుటుంబానికి భద్రతను తీసుకొచ్చారని, కార్యకర్తల కోసం ఆలోచించే ఏకైక పార్టీ జనసేన పార్టీ అని, జగ్గంపేట నియోజకవర్గంలో గత క్రియాశీలక సభ్యత్వాలు 13000 పైచిలుకు సభ్యత్వాలు చేసి జగ్గంపేటలో జనసేన బలం నిరూపించామని,జనసైనికులు నాయకులు బాగా కష్టపడి జనసేన పార్టీ కార్యకర్తలు కి క్రియాశీలక సభ్యత్వం విశిష్టతను తెలియజేసి ఈ 2026వ సంవత్సరంలో 20000 పైచిలుకు సభత్వాలు నమోదు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి , సర్పంచ్ లు,ఎంపీటీసీ లు జగ్గంపేట నియోజకవర్గం ఐటీ కోఆర్డినేటర్,మండలం అధ్యక్షులులు, గ్రామ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యత్వ వాలంటీర్లు జన సైనికులు నాయకులు హాజరయ్యారు.

## గోపాలపురం ఎస్సైగా శివగణేష్



**గోపాలపురం, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** గోపాలపురం ఎస్సైగా పనిచేస్తున్న పి.మనోహర్ ను విఆర్ కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. మండలంలోని భీమోలు గ్రామానికి చెందిన ఒక ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న విషయమై ఎస్సై మనోహర్ ను బాధ్యునిగా చేస్తూ పైఅధికారులు తీసుకున్న చర్యలలో భాగంగా విఆర్లో ఉంచారు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు పోలీసు ఉన్నతాధికారులు ఎస్సై మనోహర్ ను వి.ఆర్ కు పంపించినట్లు సమాచారం. ప్రస్తుతం గోపాలపురం ఎస్సైగా ఇటీవల ఎస్ఐగా గోపాలపురంలో శిక్షణ పొందిన పి.శివ గణేష్ కు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శివ గణేష్ గోపాలపురంలో బాధ్యతలు చేపట్టారు.

## కిమ్స్ కళాశాల వేదికగా ప్రపంచ తెలుగు మహాసభలు

### గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ చైతన్య రాజు




**కాకినాడ రూరల్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** ప్రపంచ తెలుగు మహాసభలకు అమలాపురం లోని కిమ్స్ కళాశాల వేదిక కానుంది.ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 1వ తేదీలలో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ సభలకు కేంద్ర రాష్ట్ర మంత్రులతో పాటు ఏపీ తెలంగాణ ఒడిశా గవర్నర్లు హాజరవుతారని అని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ కెవివి సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) తెలిపారు. కాకినాడ రూరల్ సర్పవరం లో ఉన్న ఆవాస వన్ అపార్ట్మెంట్ ఆవరణలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి చిన్న వయసు నుండే తెలుగు భాష పై మక్కువ చూపించాలని అన్నారు. , ఈ కార్యక్రమానికి ప్రపంచ నలు దిక్కుల నుండి ప్రముఖులు హాజరవుతారని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక తెలుగు వాడు హాజరు కావాలని కోరారు. తెలుగు భాషాభివృద్ధి, సంస్కృతి పరిరక్షణ, ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ మహాసభల ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. సభా ప్రాంగణంలో అన్నవరం విజయవాడ వాడపల్లి సింహాచలం తిరుమల తిరుపతి దేవస్థానాల నమూనాలలో ఉత్సవ విగ్రహాల రథాలు ఏర్పాటు వాటిని సందర్శకులు దర్శించుకోవచ్చు అని చైతన్య రాజు తెలిపారు. ఈ మహాసభల ప్రధాన వేదికకు నందమూరి తారక రామారావు పేరును పెట్టి "శ్రీ నందమూరి తారక రామారావు వేదిక"గా నామకరణం చేసినట్లు ఆయన వివరించారు. అదనంగా మరిన్ని మూడు వేదికలను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తెలుగు భాష వికాసానికి, తెలుగు సంస్కృతి పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని చైతన్య రాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చైతన్య గ్రూప్ డైరెక్టర్ పి. కృష్ణంరాజు, తెలుగు పండితులు సూర్యనారాయణ మూర్తి, డాక్టర్ వేదుల శ్రీరామశర్మ( శిరీష), స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులు పి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ కల్తీ పాపం జగన్‌దే..:నామన



**మామిడికుదురు.ఫిబ్రవరి 22(ప్రభాతవార్త)** తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రత పై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు.ఆదివారం మగటపల్లి ఆయన స్వగృహం నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగన్ ప్రభుత్వ వైఫల్యాలను, తిరుమల పవిత్రతను దెబ్బతీసిన తీరును రాంబాబు ఎండ కట్టారు. సాక్షాత్తు తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రసాదం విషయంలోనూ అబద్దాలు ఆడుతూ భక్తులను మోసం చేస్తున్నారని విమర్శించారు.గత జగన్ పాలనలో వ్యవస్థలన్నీ కుప్పకూలాయన్నారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో విఫలమైన వైసీపీకి ప్రజలే బుద్ది చెప్పారని వైసీపీ నాయకులు దేవుడిని కూడా రాజకీయం కోసం వాడుకుంటున్నారన్నారు . కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా నామన పేర్కొన్నారు.వైసీపీ నాయకుల మానసిక స్థితి రోజురోజుకూ దిగజారుతోందన్నారు. జగన్ ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు కల్తీ నెయ్యితో పాటు కల్తీ లిక్కర్లను కూడా తయారు చేసి ఎంతోమంది ఆరోగ్యాన్ని పాడుచేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని నామన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కుంపట్ల బాబ్జి సరెళ్ల సత్యనారాయణ చెల్లెంగి సింహాచలం భూపతి శ్రీనివాస్ కంచే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు తగవు



**మామిడికుదురు.ఫిబ్రవరి 22(ప్రభాతవార్త)** మహాజన నేత మంద కృష్ణ మాదిగ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అటువంటి వ్యాఖ్యలు చేస్తే ఎంఆర్పీఎస్,ఎంఎస్పీ చూస్తూ ఊరుకోదని నాయకులు హితవు పలికారు. మహానాడు ముసుగులో విజ్ఞత లేని మాటలు మాట్లాడుతున్నారని అటువంటి వ్యాఖ్యలను సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆదివారం మామిడికుదురు సెంటర్లో కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి వారి ఐక్యతను చాటారు. అనంతరం పాత సినిమాహాలు వద్ద మాదిగల రాజకీయ మహాకూటమి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాదిగ జెఏసీ కన్వీనర్ ఆకుమర్తి ఆశీర్వాదం, శెట్టిం శ్రీనివాస్, నూటుకుర్తి సత్యనారాయణ,మంద గాంధీ,ముసూడి నరసింహస్వామి,ఆకుమర్తి భాస్కరరావు, ఆకుమర్తి శ్రీను, పెదపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కవలల దినోత్సవం..



**అంబాజీపేట, ఫిబ్రవరి 22, (ప్రభాతవార్త):** అంబాజీపేట మండలంలో కవలల దినోత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మాచవరం పంచాయతీ పరిధిలోని కుమ్మరిపాలెంలో ఆదుర్తి నరసింహమూర్తి- మీనా దంపతులకు 11 ఏళ్ల క్రితం పాప,బాబు కవలలు జన్మించారు.వీరికి గాయత్రి,గౌతమ్ గా నామకరణం చేశారు.వీరు ప్రస్తుతం ఆరవ తరగతి చదువుతున్నారు. రూపంలోనూ,ఆలోచనలోనూ ఒకే రీతిగా ఉండడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా సోదరి,సోదరుడికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## వాసవిక్లబ్ కోఆర్డినేటర్ గా నాగబాబు





**గండేపల్లి ఫిబ్రవరి 22(ప్రభాతవార్త):** గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షులు గ్రంధి నాగబాబు తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆవరణలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారిచే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. తన మీద ఎంతో నమ్మకంతో తనకు ఈ పదవి అందజేసిన వాసవి క్లబ్ వారికి నాగబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్యవైశ్య సంఘం,మల్లేపల్లి గ్రామ ప్రజలు నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాపుగంటి మురళీకృష్ణ,వాకచర్ల నాగేశ్వరరావు, సత్యవరపు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## వాసంశెట్టికి ఘన సన్మానం




**కె గంగవరం, ఫిబ్రవరి 22, (ప్రభాతవార్త):** ఊపిరి ఉన్నంతవరకు, అధికారం ఉన్నా లేకున్నా సమాజ సేవ చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంలు పునరుద్ఘాటించారు. ఆదివారం సాయంత్రం రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండల శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ , సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంను ఘనంగా సన్మానించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం చేస్తున్న సామాజిక ప్రజాసేవలకు గాను ఈ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ఈ సన్మానం మరింత బాధ్యతను పెంచిందని, కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించడం కొనసాగిస్తాం అని తెలిపారు. అన్ని కులాలను గౌరవిస్తూనే తను పుట్టిన శెట్టిబలిజ జాతి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రానున్న మూడు సంవత్సరాల్లో నియోజకవర్గంలో పూరి గుడిసెలు లేకుండా చేయడమే లక్ష్యమని, కోటిపల్లి--ముక్తేశ్వరం రహదారి బ్రిడ్జి సాధనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శెట్టి బలిజల సంక్షేమం కోసం "ఎస్ఏఎఫ్ (శెట్టి బలిజ యాక్షన్ ఫోర్స్)"ను స్థాపించినట్లు వెల్లడించిన మంత్రి, దానికి తనవంతుగా రూ.1 కోటి విరాళం అందించినట్లు తెలిపారు. రామచంద్రపురం నియోజవర్గంలో గుండెపోటు మరణాల నివారణకు మూడు కంటైనర్ ఆసుపత్రులను ఏర్పాటు చేసి మార్చి 9వ తేదీ నుంచి వైద్య సేవలు ప్రారంభిస్తామని చెప్పారు. అధికారం ఉన్నా లేకున్నా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ అభివృద్ధికి రూ.180 కోట్ల పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ కె.గంగవరం మండలంలో శెట్టి బలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం, కమ్యూనిటీ హాలు నిర్మాణం త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. తమ ఫౌండేషన్ సేవలు గుర్తించి రాష్ట్ర గవర్నర్ ప్రశంసలు అందుకోవడం తమ బాధ్యత మరింత పెంచిందన్నారు. నియోజకవర్గంలో ఎవరికి కష్టం వచ్చినా అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శెట్టి బలిజ సంఘ నాయకులు మేడిశెట్టి రవికుమార్, పెంకే అన్నపూర్ణ, పెంకే సాంబశివరావు, జుత్తుక శ్యాంప్రసాద్, పెంకే గోవిందరాజు, పిల్లి దొరబాబు, పిల్లి రాంబాబు, పంపన శ్రీను, దంగేటి నాగేశ్వరరావు, మేడిశెట్టి శేషారావు, మేడిశెట్టి సూర్యనారాయణ, టేకుమూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

## మంత్రి సుభాష్ చిత్రపటానికి పాలాభిషేకం



**రామచంద్రపురం, (కాజులూరు) ఫిబ్రవరి22,(ప్రభాతవార్త):** కాజులూరు మండలం తనుమళ్ళ గ్రామంలో ఏఎంసీ డైరెక్టర్ ఖండవల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ పాలాభిషేకం చేశారు.గత 20 సంవత్సరాలుగా పెనుమళ్ళ గ్రామం నుంచి తనుమల్ల కు వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా గుంతల మయంగా ఉండేది,ఇరు గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లారు.మంత్రి సుభాష్ తక్షణమే స్పందించి 71 లక్షలతో దృఢమైన రోడ్డు వేయించడం పట్ల ఆయా గ్రామ ప్రజలు వాసంశెట్టి సుభాష్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతుల భవాని భీమరాజు,పార్లమెంటరీ అధికార ప్రతినిధి,వనం వీరబ్రహ్మంగారు,ఇజ పేపకాయల బాబ్జి,బూత్ చైర్మన్ భూలా సురేష్ బాబు,ఏడిద భాను ప్రకాష్,జనసేన నాయకులు దార్ల బాబి,ఊబా వివేక్,ఖండవల్లి శ్రీనివాస్ కూటమి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదికను

## సద్వినియోగం చేసుకోండి

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త)** ఆంధ్రపదేశ్ రాష్ట్రంలో ప్రతీ సోమవారం ప్రతీ జిల్లాస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈనెల 23 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ గోదావరి భవన్ నందు యధావిధిగా నిర్వ హించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్య గురించి ఖచ్చితమైన పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. గతంలో ఫిర్యాదు చేసిన వారు తప్పనిసరిగా పాత అర్జీ రసీదు తీసుకురావాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. సమస్య పరిష్కారమైన వెంటనే అర్జీదారుని ఫోన్ నంబర్ కు మెసేజ్ అలర్ట్ వస్తుందన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్లు వాట్సాప్ ద్వారా పంపడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని డివిజన్లు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా పీజీఆర్ఎస్ జరుగుతుందన్నారు. అర్జీదారులు తమ సమీప కేంద్రాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ప్రజా సమస్యలు కోసం ప్రభుత్వం కల్పించిన 1100 టోల్ ఫ్రీ నంబర్ను సంప్రదించి కాల్ చేసి అర్జీదారులు కలెక్టరేట్ కార్యాలయం కు రాకుండానే తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీల స్టేటస్ తెలుసుకోవడానికి కూడా ఈ నంబర్ కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. అలాగే,వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో కూడా అర్జీలను సమర్పించవచ్చునని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ముగ్గురు రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లు తప్పనిసరిగా ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్లో నిర్వహించే రెవెన్యూ క్లినక్కు హాజరై వినతులను స్వీకరిస్తారని తెలిపారు.అలాగే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు లు స్వీకరించేందుకు సంబంధిత ఏఓ, డీటీ లు అందుబాటులో ఉంటారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్కు మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తమకు సంబంధించిన అన్ని రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రైతులు భూసంబంధిత సమస్యలు, రెవెన్యూ సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యల కు సత్వర పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్మీ జవాన్ అనారోగ్యంతో మృతి

### మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ హరీష్ మధుర్ బాలయోగి



**అల్లవరం,ఫిబ్రవరి22(ప్రభాతవార్త),** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బడుగు నాగబాబు (45) అనారోగ్యంతో మృతి చెందారు.అమలాపురం ఎంపీ గంటి హరీష్ మధుర్ బాలయోగి ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆర్మీ అధికారులతో ఫోన్ లో మాట్లాడి అనంతరం నాగబాబు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంపీ హరీష్ హామీ ఇచ్చారు.నాగబాబు పంజాబ్ రాష్ట్రంలోని 27 ఏ డి ఆర్మీ క్యాంపులో విధులు నిర్వహిస్తున్నారని,జనవరి నెలలో సెలవుపై స్వగ్రామమైన బోడసకుర్రుకు వచ్చిన ఆయన,సెలవులు ముగియడంతో తిరిగి విధుల్లో చేరేందుకు సిద్ధమయ్యారని,ఈ క్రమంలో అనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 18న అమలాపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా,చికిత్స పొందుతూ ఫిబ్రవరి 19న మృతి చెందారు.దీంతో కుటుంబంలో,గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.నాగబాబు 24 సంవత్సరాల నుండి దేశానికి సేవలు అందిస్తున్నారు.నాగబాబు మరణానంతరం ఆర్మీ నుంచి అందవలసిన సహాయం,పింఛన్ తదితర లబ్ధుల విషయమై ఎంపీ హరీష్ బాలయోగి ఆర్మీ అధికారులతో ఫోన్ ద్వారా చర్చించారు.ఆర్మీ నిబంధనల ప్రకారం శవ పంచనామా నిర్వహించిన తరువాతే కుటుంబ సభ్యులకు పింఛన్ మరియు ఇతర ప్రయోజనాలు అందుతాయని అధికారులు తెలిపారు. నాగబాబు కుటుంబానికి రావలసిన అన్ని లబ్ధులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆర్మీ అధికారులును కోరారు.ఆర్మీ మరియు జిల్లా పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపంతో నాగబాబు 24 సంవత్సరాలు సేవ చేసినప్పటికీ,మరణానంతరం దక్కాల్సిన అధికార లాంఛనాలు, గౌరవ వందనం అందలేదని కుటుంబ సభ్యులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి,ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబి,మొయిల గణపతి, ఓలేటి పరమేశ్వరరావు,సాధనాల శ్రీనివాస్,రొక్కాల నాగేశ్వరరావు,ముత్యాల దుర్గారావు,మాజీ సర్పంచ్ సాపే ధర్మరాజు,జల్లి రాధాకృష్ణ,దొమ్మేటి రాధాకృష్ణ,పోలిశెట్టి బాబులు,వేగిరాజు వెంకటరాజు,బొంతు హరికృష్ణ తదితరులు నాగబాబు కుటుంబసభ్యులను పరామర్శించినవారిలో ఉన్నారు.

## నేటి నుంచే ఇంటర్మీడియట్ పరీక్షలు



**కొత్తపేట ఫిబ్రవరి 22 ,(ప్రభాతవార్త)** నేటి నుంచే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నట్లు కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పరీక్షా కేంద్రం సిఎస్ బి వై ఎన్ వి ప్రసాద్ డి ఓ దుర్గా ప్రసాద్ లు తెలిపారు తమ కళాశాలలో కేవలం జనరల్ విద్యార్థులు మాత్రమే పరీక్షలు రాస్తున్నారని 23వ తేదీ సోమవారం 286 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నట్లు ఆయన తెలిపారు అలాగే ఫిబ్రవరి 23 నుంచి మార్చి 18వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో 2836 మంది విద్యార్థులు తమ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు వారు తెలిపారు ఉదయం ఎనిమిది గంటల 40 నిమిషాల కల్లా పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలన్నారు తొమ్మిది గంటల తర్వాత విద్యార్థులను పరీక్ష వ్రాసేందుకు అనుమతించరని ఆయన తెలిపారు అలాగే స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాలలో జనరల్ ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నట్లు సిఎస్ జిఎస్ రాంబాబు డివో కె సత్యనారాయణ లు తెలిపారు సోమవారం తమ పరీక్ష కేంద్రంలో జనరల్ , వోకేషనల్ విద్యార్థులు 250 మంది పరీక్షలు వ్రాయనున్నట్లు తెలిపారు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఈ పరీక్షల్లో 2908 మంది విద్యార్థులు పరీక్ష లు వ్రాస్తారన్నారు విద్యార్థులు ఏమాత్రం ఒత్తిడి కి లోను కాకుండా పరీక్షలు స్వేచ్ఛగా వ్రాసుకోవాలని వారు తెలిపారు

### గుర్రంపాలెం రామాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్టాపన

## మహా అన్న సమారాధన..



**జగ్గంపేట ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త)** కురుక్షేత్రంలో మయూరధ్వజుని త్యాగానికి ప్రతిరూపమే ఆలయాల ముందున్న ధ్వజ స్తంభం అని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుర్రంపాలెం సగర పేట రామాలయం లో ఘనంగా ధ్వజస్తంభం(పెరుమాళ్ళ స్థంభం) ప్రతిష్టాపన మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ పాల్గొని ధ్వజస్తంభం ప్రతిష్టాపన చేసి సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం 6000 మందికి మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట రాంజీ, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు,దేవరపల్లి మూర్తి, రేఖ బుల్లి రాజు, దాట్ల సూర్యనారాయణ రాజు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps